

సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 231 | మంగళవారం | 21-07-2026 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## ఎంపిలను కలిసేందుకు యూత్ లీడర్లను అనుమతించేదాకా దీక్ష

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మరో సందేశం విడుదల



# సిజెపి 'పార్లమెంట్ మార్చ్'తో రణరంగంగా మారిన ఢిల్లీ



## పోలీసుల వీరంగం

పలుదారుల్లో పార్లమెంటు వీధికి చేరిన యువత

వేలాది మంది రోజంతా రోడ్డుపైనే నిరసనలు

కర్కశంగా పోలీసుల లాఠీచార్జీ, బాష్పవాయువు ప్రయోగం

పలు వీధుల్లో ట్రాఫిక్ జామ్‌తో ప్రజల అవస్థలు

అభిజీత్ దీప్కే అరెస్టు

నడ్డాతో సిజెపి ప్రతినిధుల చర్చలు

23 రోజుల నిరశన తదుపరి చర్చలకు సిద్ధపడిన మొండి ప్రభుత్వం

సిజెపి దీక్షాశిబిరం తొలగింపు

ట్రక్కుపైనే కొనసాగిన దీక్ష


### విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై నోరుమెదపని మోదీ

**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అక్రమాలకు నిరసనగా.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'చలో పార్లమెంట్ మార్చ్' ఢిల్లీ వీధుల్లో తీవ్ర రణరంగంగా మారింది. సిజెపి మద్దతుదారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, సిజెపి కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు లాఠీఛార్జ్ చేశాయి. టియర్ గ్యాస్ ప్రయోగించారు. పలువురిని అరెస్టు చేశారు. అనేక మంది నిరసనకారులకు తీవ్ర గాయాలయ్యాయి. మరోవైపు, పార్లమెంట్‌కు వెళ్లే అన్ని మార్గాలను అధికారులు మూసివేశారు. సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. నిరాహారదీక్ష చేస్తున్న సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దీక్ష విరమించిన తరువాత ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 23 రోజుల నిరాహారదీక్ష తదుపరి చర్చలకు మోదీ ప్రభుత్వం సిద్ధపడింది. కాగా, సిజెపి నేతృత్వంలో చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్'ను అడ్డుకుని నిరసనకారులపై లాఠీచార్జ్ చేయడంపై పార్లమెంట్ లోపల ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేశారు. సభ్యుల నిరసనల మధ్య లోక్‌సభ, రాజ్యసభలు పదేపదే వాయిదా పడ్డాయి. ఇంత జరుగుతున్నా విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై ప్రధాని మోదీ నోరు మెదపలేదు.

ఇళ్లలోంచి దొంగచాటుగా బయటకు వచ్చిన పిల్లలు, రాష్ట్రాలు దాటి ప్రయాణించి వచ్చిన వృద్ధులు, ప్లకార్డులు పట్టుకున్న విద్యార్థులతో సహా వేలాది మంది సోమవారం ఢిల్లీలో సిజెపి చేపట్టిన 'చలో సంసద్'కు తరలివచ్చారు. నిరసనకారులు జెండాలు, ప్లకార్డులు తరువాయి 8లో

### మా డిమాండ్లు నెరవేర్చాల్సిందే

కేంద్రమంత్రి జెపి నడ్డాకు సిజెపి ప్రతినిధి బృందం మెమోరాండం



07

### విద్యార్థులపై బలప్రయోగం ప్రజాస్వామ్య ధిక్కారం

- జవాబుదారీ వహించకుండా బ్యారికేడ్స్ వెనుక నక్కిన ప్రధాన్
- సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా విమర్శ
- సిపిఐ(ఎం) ఇతర వామపక్షాల ఖండనఃమంత్రి రాజీనామాకు డిమాండ్



07

### దేశ చరిత్రలో యువతను వ్యతిరేకించిన ప్రధాని మోదీనే

- తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన రాహుల్‌గాంధీ
- ప్రశ్నాపత్రాల లీక్ నేరస్థులు వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు
- ప్రశ్నించిన విద్యార్థులను ఈడ్చి ఈడ్చి కొడుతున్నారు



07



## యువత ఆందోళనకు మద్దతు, రామాలయ నిధుల చోరీపై స్వతంత్ర విచారణకు ప్రతిపక్షాల నిరసనతో స్తంభించిన పార్లమెంటు

### ఉభయ సభలు నేటికి వాయిదా

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజే ఉభయసభల్లో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. నీట్ పరీక్షా పత్రం లీక్, అయోధ్యలోని రామమందిరానికి సంబంధించిన విరాళాల చోరీపై ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో ఉభయసభలూ దద్దరిల్లాయి. పలుమార్లు వాయిదా పడ్డాయి. నీట్ పేపర్ లీక్ విషయంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, కాక్రోజ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలోని నిరసనకారుల బృందాలు బారికేడ్లను బద్దలు కొట్టి పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఈ అంతరాయం తరువాయి 8లో

## ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం తథ్యం

### అదే శంకర్‌గౌడ్ త్యాగానికి ప్రభుత్వ నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)ని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయడం తథ్యమని, అదే అమరుడు శంకర్‌గౌడ్ చేసిన త్యాగానికి ప్రభుత్వం ఇచ్చే నివాళి అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహించి, గెలిచిన యూనియన్ ప్రతినిధులను మంత్రుల కమిటీలోకి తీసుకుని భవిష్యత్తులో ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు రాకుండా విలీన ప్రక్రియను పూర్తి చేస్తామనే హామీని మంత్రి పునరుద్ఘాటించారు. రూ.6 లక్షల లోపు ఆదాయం ఉండి, అర్హత ఉన్న ఆర్‌టిసి ఉద్యోగులు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ తరువాయి 12లో

## క్యూర్ పరిధిలో 'ఇందిరమ్మ ఇళ్లు'

- తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 8వేల ఇళ్ల నిర్మాణం
- నేటి నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాజధాని నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో నివసించే నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. క్యూర్ పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టనున్న 'ఇందిరమ్మ ఇళ్లు' (ఎల్‌ఐజి స్కీమ్) నిర్మాణ కార్యక్రమాన్ని సోమవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన బ్రోచర్, మీసేవ, వాట్సాప్ దరఖాస్తులను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి తరువాయి 8లో

09



## ఫిఫా ప్రపంచకప్ విజేతగా స్పెయిన్

ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో స్పెయిన్ విజేతగా నిలిచింది. ఆదివారం అర్ధరాత్రి ఉత్కంఠగా సాగిన ఫైనల్లో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను ఓడించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ నిర్ణీత సమయంలో ఫలితం తేలలేదు. దాంతో ఎక్స్‌ట్రా టైమ్ ఆడించాల్సి వచ్చింది. ఈ సమయాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది.

## కాల్పుల విరమణకు మళ్లీ మధ్యవర్తి ప్రయత్నాలు

- ఇరాన్‌కు చేరిన ప్రతిపాదనలు
- ఇస్మాయిల్ బఖాయీ ధ్రువీకరణ

**టెహ్రాన్:** అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు తగ్గించేందుకు, కాల్పుల విరమణకు మధ్యవర్తులు విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ఖతార్,పాకిస్థాన్ సహా పలువురు మధ్యవర్తులు యుద్ధ విరమణ చేయాలని కోరుతూ ప్రతిపాదనలు చేస్తున్నారన్న విషయాన్ని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ సోమ వారం ధృవీకరించారు. మధ్యవర్తుల ద్వారా వచ్చిన ప్రతిపాదనలు మాకు చేరాయి, మేం వాటిని స్వీకరించాం, ఐతే ఈ దశలో ఈ విషయంపై స్పందించడానికి, వాటి వివరాల




లోతుల్లోకి వెళ్ళడానికి ఇష్టంగా లేం అని చెప్పారు.మధ్యవర్తులకు ప్రతిస్పందన ఇవ్వడంతోపాటుగా ఇరాన్ కూడా ఉద్రిక్తతలు తగ్గించేందుకు తన వంతు దౌత్య ప్రయత్నాలు తరువాయి 12లో

## బ్రిటన్ ప్రధానమంత్రిగా బర్న్‌హామ్



**లండన్:** బ్రిటన్ ప్రధానమంత్రిగా ఆండీ బర్న్‌హామ్ (56) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అధికార బదిలీ ప్రక్రియలతో భాగంగా సర్ కీర్ స్టార్‌మర్ (63) తన పదవికి లాంఛనంగా రాజీనామా చేసిన తర్వాత కీర్ స్టార్‌మర్‌తోపాటు బర్న్‌హామ్ కూడా బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు వెళ్ళి రాజు ఛార్లెస్–3 ను కలుసుకున్నారు. ఈ సమావేశంలోనే కొత్త ప్రధానమంత్రిగా బర్న్‌హామ్‌కు రాజు ధృవీకరణ లభించింది. దీంతో బ్రిటన్ దేశ చరిత్రలో 59వ ప్రధానమంత్రిగా బర్న్‌హామ్ తన పేరు నమోదు చేసుకున్నారు. బర్న్‌హామ్‌తో రాజు ఛార్లెస్ ప్రైవేటుగా జరిపిన సమావేశంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు. ఆయన ఆహ్వానాన్ని బర్న్‌హామ్ వినయంగా తరువాయి 12లో

# బ్రిటన్‌కు కొత్త ప్రధాని

లేబర్ పార్టీ నాయకునిగా గతవారం ఎన్నుకోబడిన యాండీ బర్న్‌హామ్ యునైటెడ్ కింగ్‌డం(యుకె) నూతన ప్రధానమంత్రిగా సోమవారం పదవీ ప్రమాణం స్వీకరించారు. ఈయన గత నాలుగేళ్లలో ఐదవ ప్రధానమంత్రి. 2024 జులైలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లేబర్‌పార్టీకి 600లకు 412 సీట్లలో అఖండవిజయం సాధించి పార్టీని 14ఏళ్ల అరణ్యవాసం నుంచి అధికార అందలమెక్కించిన నాయకుడు కీర్ స్టార్మర్ రెండేళ్లలోనే మరోనాయకునికి అధికారం బదిలీ చేయటం లేబర్ పార్టీలో రాజకీయ కల్లోలానికి నిదర్శనం. గత దశాబ్దకాలంలో అసాధారణంగా అరడజను ప్రధానమంత్రులు మారటం – డేవిడ్ కామరూన్, థెరిసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రుస్, రిషి సునాక్ (కన్సర్వేటివ్ పార్టీ), కీర్ స్టార్మర్(లేబర్ పార్టీ) – యుకెలోని ఆర్థిక, రాజకీయ అస్థిరతకు ప్రబల నిదర్శనం. సాధారణంగా కామన్స్ సభకు సార్వత్రిక ఎన్నికల తదుపరి అధికార బదిలీ జరగటం ప్రజాస్వామిక దేశాల్లో సర్వసాధారణం. కాని యుకెలో పార్టీల్లో అంతర్గత అలజడులు, తిరుగుబాట్లతో ప్రధానులు మారుతుండటం గమనార్హం. సంవత్సరాల తరబడి రాజకీయ అస్థిరత కారణంగా లేబర్ పార్టీకి ఓటర్లు పట్టంగట్టగా, దాని నాయకుడు స్టార్మర్‌కు కన్సర్వేటివ్‌ల నుంచి మందగమనంలోని ఆర్థిక వ్యవస్థ, పెచ్చుపెరిగిన ప్రభుత్వ అప్పు, భారంగా తయారైన ప్రజా సర్వీసులు, జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎస్), పెరిగిన వలసలు, గృహాలకొరత, ఎదుగుబొదుగులేని జీవన ప్రమాణాలు వారసత్వంగా లభించాయి. పదేళ్లకుపైగా కన్సర్వేటివ్ ప్రభుత్వాలనుంచి సంక్రమించిన వ్యవస్థాగత సమస్యలూ ఉన్నాయి. పర్యవసానంగా, త్వరితగతిన మార్పు తెస్తామన్న హామీని స్టార్మర్ ప్రభుత్వం నెరవేర్చలేక పోయింది. అనేక స్థానిక ఎన్నికల్లో వరుసగా వైఫల్యాలు, లేబర్ పార్టీ ఎంపిల్లో పెరుగుతున్న అసంతృప్తి, ప్రజామోద రేటింగ్స్‌లో క్షీణింపు, పార్టీలో అంతర్గత ఉద్రిక్తతలు – ఇవన్నీ ఒకదానికొకటితోడై స్టార్మర్ అథారిటీని క్రమంగా బలహీన పరిచాయి. నాయకత్వ మార్పుకై ఒత్తిడి తీవ్రతరం కావటం ఆయన రాజీనామాకు దారితీసింది.

లేబర్ పార్టీ నాయకత్వ మార్పు అతివేగంగా జరిగిన తీరే ఆ పార్టీలో భవిష్యత్ ఎన్నికల గూర్చి ఏర్పడ్డ భయసందేహాలను ప్రతిబింబిస్తోంది. కొత్త ప్రధాని బర్న్‌హామ్ జాతీయ రాజకీయాలకు కొత్తవాడేమీకాదు. వాయవ్య ఇంగ్లండ్‌లోని లీఘ్ నుంచి లేబర్ ఎంపిగా ఉన్న బర్న్‌హామ్ టోనీబ్లేయర్, గార్డన్ బ్రౌన్ ప్రభుత్వాల్లో కార్యదర్శిగా (మనభాషలో మంత్రి)గా పనిచేశారు. రెండుసార్లు లేబర్ నాయకత్వం కోసం విఫలయత్నం చేశాడు. 2017లో పార్లమెంటును విడిచిపెట్టి, కొత్తగా ఏర్పాటైన గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ పదవికి పోటీచేసి సఫలమైనాడు. స్థానిక సంస్థలకు అధికారాల పంపిణీ, మెరుగైన ప్రజారవాణా, అందుబాటు ధరలో గృహవసతి, బలమైన స్థానిక ప్రభుత్వం వగైరా విధానాలను ఛాంపియన్ చేస్తూ బలమైన ప్రాంతీయ నాయకునిగా గుర్తింపు పొందారు.

కోవిడ్ సమయంలో ఉత్తర ఇంగ్లండ్‌కు నిధుల కోసం బోరిస్ జాన్సన్ ప్రభుత్వంతో బహిరంగంగా ఘర్షణపడి దేశవ్యాప్త గుర్తింపు పొందాడు. లేబర్ పార్టీకి భావి నాయకుడన్న భావం కలిగించాడు. లేబర్‌పార్టీలో స్టార్మర్ నాయకత్వంపై అసంతృప్తి పెరుగుతున్న దశలో పార్లమెంటుకు వచ్చిన ఉపఎన్నికలో పోటీకి ఆయన కోరిన వెంటనే పార్టీ నాయకత్వం అనుమతి ఇచ్చింది. కాబోయే ప్రధాని బర్న్‌హామ్ అనే భావన ప్రచారంలోకి వచ్చింది. అందుకు తగినట్లు ఆయన దాదాపు పదేళ్ల తర్వాత పార్లమెంటులో ప్రవేశించాడు. నాయకత్వ మార్పు వెంటనే ఖరారైంది. స్టార్మర్ రాజీనామా చేయటానికి అంగీకరించాడు.

గతవారం లేబర్ ఎంపిల సమావేశం బర్న్‌హామ్‌ను నాయకునిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సోమవారం ప్రమాణ స్వీకారం జరిగి పోయింది. జనాదరణ పెంచుకుంటున్న పచ్చిమితవాది నిగెల్ ఫరాగ్ పార్టీ 'రిఫామ్ యుకె'ని ప్రతిఘటిస్తూ కార్మికవర్గం ఓటర్లకు పార్టీని చేరువ చేయగలిగిన వ్యక్తి బర్న్‌హామ్‌యేనని సీనియర్ మంత్రు లు, ట్రేడ్ యూనియనిస్టులు, ఎంపిలు శీఘ్రంగా ఆయన వెనుక చేరటం వల్లనే ఈ పరిణామాలు ఇంతవేగంగా జరిగాయి. బర్న్‌హామ్ ను కింగ్ ఆఫ్ ద నార్త్ అని పిలుస్తున్నారు. ఉత్తర ప్రాంతం నుంచి బ్రిటన్ అత్యున్నత అధికార స్థానానికి వచ్చిన నాయకులు అరుదు.

బర్న్‌హామ్ మీద లేబర్ పార్టీయే కాదు, మధ్యతరగతులు, శ్రామిక ప్రజలు ఎంతో ఆశపెట్టుకున్నారు. అయితే ఫలితాలు సాధించటం మాటలు చెప్పినంత సులభం కాదు. ప్రభుత్వాన్ని మితవాదంవైపు నెట్టేందుకు ఇంట–బయట ఒత్తిళ్లు, రక్షణ వ్యయం పెంచి యూరప్‌లో బలమైన సైనిక శక్తిగా యుకెను తయారు చేయాలన్న ఒత్తిళ్లు, రెండోవైపున ఆర్థిక ఇబ్బందులు, ప్రజల అవసరాలు తీర్చటం, సేవలు మెరుగుపరచటం మధ్యనున్న వైరుధ్యం సామాన్యమైనది కాదు. రాజకీయ భౌగోళిక అస్థిరతలు, బలహీనమైన వృద్ధిగమనం, పెచ్చుపెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్లతో కూడిన జి7 ఆర్థిక వ్యవస్థలో భాగంగా యుకెను నడిపించటం గ్రేటర్ మాంచెస్టర్‌ను పాలించినంత సులభం కాదని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అయితే 10 డౌనింగ్ వీధిలోకి యాండీ బర్న్‌హామ్ ప్రవేశించటం రొటీన్ నాయకత్వ మార్పు కాదు. లేబర్ పార్టీ భవితవ్యాన్ని నిర్మించుకునే ప్రయత్నం. ●



## రాజకీయం చేయొద్దు

**అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసును రాజకీయం చేయవద్దు. కోర్టులు రాజకీయాలకు వేదిక కాదు. ఇది ఒక సాధారణ నేరం. సరైన మార్గంలో దర్యాప్తు జరిగేలా చూస్తాం. ఈ కేసు దర్యాప్తునకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు విచారణ చేస్తున్నారు.**


– సుప్రీంకోర్టు

# లౌకిక రాజ్యాంగాన్ని మార్చేందుకే డీలిమిటేషన్

**అరుణ్ శ్రీవాస్తవ**

**లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపుదలకోసం డీలిమిటేషన్‌కై రాజ్యాంగ సవరణ బిల్లుకు వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఆమోదం సంపాదించేందుకు బిజెపి అప్రజాస్వామిక వ్యూహాలు రచిస్తోంది. డీలిమిటేషన్, సీట్లసంఖ్య 50శాతం పెంపు వెనుకనున్న అసలు ఉద్దేశం ప్రమాదకరమైనది.**

ఉత్తర భారతదేశ జనాభా పరిమాణం, హిందీ–హిందూ మెజారిటీ, హిందూ మెజారిటీని ఏకం చేయటం, 'హిందీ–హిందూ–హిందుస్థాన్' అనే ఏకీకృత సాంస్కృతిక గుర్తింపును ముందుకు తీసుకెళ్లడం వంటి ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక లక్ష్యం ప్రచారానికి, 2014 నుండి బిజెపి ఎన్నికల ఆధిపత్యానికి దోహదపడింది. భారత రాజ్యాంగంలోని లౌకిక, సామ్యవాద పునాదులను మార్చాలనే లక్ష్యంగా పెట్టుకోగా, భారతదేశ ప్రాథమిక స్వరూపాన్ని, గుర్తింపును, హిందూ దేశ (రాష్ట్రం)గా మార్చడానికి 'నియోజకవర్గాల పునర్విభజన'ను తొలి రాజ్యాంగపరమైన అడుగుగా ఉపయోగించాలని ఆర్ఎస్ఎస్ భావిస్తోంది.



రాబోయే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో మరోసారి ప్రవేశపెట్టనున్న డీలిమిటేషన్ బిల్లు, ఆర్ఎస్ఎస్/బిజెపి శిబిరం విభజన రాజకీయాలలో ఒక ముఖ్యమైన భాగం. పార్లమెంటు స్వరూపాన్ని, పార్లమెంటరీ వ్యవస్థను శాశ్వతంగా మార్చి, పార్లమెంటరీ బలాన్ని హిందీ మాట్లాడే ఉత్తరాది ప్రాంతాల వైపు, ముఖ్యంగా హిందుత్వ కాషాయ రాజకీయాలను విశ్వసించే వారి వైపు నిర్ణయాత్మకంగా మళ్లించడానికి ఇది తయారుచేయబడింది. పార్లమెంటరీ వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురానంత వరకు, భారతదేశాన్ని అధికారికంగా హిందూ దేశంగా ప్రకటించే దిశగా మార్చాలనే తమ లక్ష్యాన్ని సాధించలేమనే వాస్తవం కాషాయ వర్గానికి బాగా తెలుసు.

భారతదేశ జనాభా 1971లో 55 కోట్ల నుండి 2026 నాటికి సుమారు 146 కోట్లకు పెరిగింది. ఈ భారీ జనాభా మార్పులకు అనుగుణంగా ఎన్నికల పటాన్ని నవీకరించడానికే పునర్విభజనను రూపొందించారు. పునర్విభజన ఒక చట్టపరమైన విధి అయినప్పటికీ, ఇది వివిధ కారణాల వల్ల తీవ్ర వివాదాస్పదంగా ఉంది. మొదటిది, ఉత్తర, దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం. ఉత్తర రాష్ట్రాలు (ఉత్తరప్రదేశ్, బీహార్ వంటివి) అధిక జనాభా పెరుగుదలను చూశాయి. ప్రస్తుత జనాభా ఆధారంగా సీట్లను పునఃసర్దుబాటు చేయడం వల్ల పార్లమెంటులో వారి ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని, అదే సమయంలో కుటుం బ నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణ రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యం తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. లోక్‌సభ మొత్తం సామర్థ్యాన్ని (850 సీట్ల వరకు) విస్తరించడానికి మోదీ పునర్విభజన బిల్లును, రాజ్యాంగ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ విస్తరణ లక్ష్యం, దక్షిణ రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను స్థిరంగా ఉంచుతూ, కొత్తగా కేటాయించిన సీట్లను ఉత్తర రాష్ట్రాలకు కల్పించడం.

భారతదేశాన్ని ఉత్తర, దక్షిణ ప్రాంతాలుగా విభజిస్తున్నట్లు కాషాయ వర్గం బహిరంగంగా ఎన్నడూ అంగీకరించనప్పటికీ, భారతదేశాన్ని పాలించాలంటే ఉత్తర భారతదేశం తమ అదుపులో ఉండాలనే స్పష్టమైన భావనను అది పెంచుకుంటోంది. ఇది తమ ప్రస్తుత పార్లమెంటరీ బలంతో దక్షిణ భారతదేశంలో ఆర్ఎస్ఎస్, బిజెపిలు బలమైన శక్తిగా ఎదగలేవనే వాస్తవాన్ని కూడా అంగీకరించడమే. ఒక నిర్దిష్ట ప్రాంతంలో బలమైన పునాది వేసుకోవాలంటే, ఆ రాజకీయ పార్టీ ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలను, కోరికలను గ్రహించాలి. ఆర్ఎస్ఎస్ ఈ లక్ష్యాన్ని ఎప్పటికీ సాధించలేదు. అది ఇప్పటికే హిందీ మాట్లాడే హిందువుల పార్టీగా గుర్తింపు పొందింది. దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ దక్షిణ భారతదేశంలో చురుకుగా ఉంటూ, భారీ సంఖ్యలో కార్యకర్తలను చేర్చుకున్నప్పటికీ, బిజెపికి బలమైన ఎన్నికల పునాదిని సృష్టించడంలో ఇప్పటివరకు విజయం సాధించలేదు.

కర్ణాటకలో బి.ఎస్. యడియూరప్ప నాయకత్వంలో బిజెపి అధికారంలోకి రావడాన్ని, ఆ రాష్ట్రంలో దానికి బలమైన పట్టు ఉన్నట్లుగా భావించకూడదు. ఒక్కలి, లింగాయత్ వర్గాల మధ్య ఉన్న వైరుధ్య సంబంధాలను ఆసరాగా చేసుకుని బిజెపి అధికారంలోకి వచ్చింది. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి, ఆ సంస్థలో రెండవ అత్యున్నత అధికారి అయిన దత్తాత్రేయ హోసబాలె కర్ణాటకకు చెందినవారైనప్పటికీ, ఆ రాష్ట్రం అనేకమంది ప్రముఖ బిజెపి నాయకులను అందించినప్పటికీ, ఆ రాష్ట్రంలో హిందుత్వ రాజకీయాలు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయన్నది వాస్తవం. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కాషాయ కూటమి తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, అది ఈ ప్రాంత ప్రజలతో మమేకం కాలేకపోయింది.

దామాషా పద్ధతిలో నియోజకవర్గాల పునర్విభజన, లోక్‌సభలో దక్షిణ రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని, వాణిని తగ్గిస్తుంది. తద్వారా వాటిని శక్తిహీనంగా, రాజకీయంగా ప్రాముఖ్యత లేనివిగా మార్చే అవకాశం ఉంది. డీలిమిటేషన్ ప్రక్రియ అన్ని రాష్ట్రాలకు దామాషా ప్రకారం సీట్లు పెంచుతుందని (సుమారు 50శాతం), సాపేక్షికంగా దామాషా కాపాడబడుతుందని, ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదనే వాదన అర్థరహితం. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్ సీట్లు 80 నుంచి 120కి పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి సంఖ్యాబలం పార్లమెంటులో తగ్గుతుంది.

2026 ఏప్రిల్‌లో మోదీ, బిజెపి ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు, పార్లమెంటరీ సీట్ల కేటాయింపుపై 50 ఏళ్లుగా ఉన్న స్తంభనను అంతం చేయడానికి రూపొందించిన భారతదేశ ఎన్నికల పటం నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణ. ఈ బిల్లు లోక్‌సభ గరిష్ట సభ్యుల సంఖ్యను 543 నుండి 850కి పెంచాలని ప్రతిపాదిస్తుంది. ఈ విస్తరణను, 33% మహిళా రిజర్వేషన్ కోటా అమలుతో వ్యూహాత్మకంగా జత చేశారు. భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడం కోసం, హిందూ జనాభా ను పెంచాలని ఆర్ఎస్ఎస్ నిరంతరం నొక్కి చెబుతోందన్నది ఇక్కడ ప్రస్తావించాల్సిన విషయం. ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భాగవత్, ముగ్గురు సంతానం విధానాన్ని గట్టిగా సమర్థించారు. జనాభా సమతుల్యతను కాపాడటానికి, సామాజిక పతనాన్ని నివారించడానికి ప్రతి భారతీయ కుటుంబానికి ముగ్గురు పిల్లలు ఉండాలని ఆర్ఎస్ఎస్ వాదిస్తున్నది.

సంఘ్ ప్రాథమిక లక్ష్యం హిందువుల సంఖ్యను పెంచడమే అయినప్పటికీ, వాస్తవానికి దేశవ్యాప్తంగా పట్టణ మధ్యతరగతి హిందువులు కుటుంబ నియంత్రణను పాటిస్తున్నారు. చాలామంది గరిష్టంగా ఒకరు లేదా ఇద్దరు పిల్లలను కనడానికే ఇష్టపడుతున్నారు. కానీ, సామాజిక స్థిరత్వాన్ని కాపాడటానికి ఒక కుటుంబానికి ముగ్గురు పిల్లలు అవసరమని భాగవత్ వాదిస్తున్నారు.

అయితే, ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కనడానికి అన్ని వర్గాల హిందువులు విముఖత చూపడం, ఆర్ఎస్ఎస్/బిజెపి మోదీలను నియోజకవర్గాల పునర్విభజన మార్గాన్ని ఎంచుకునే లా చేసింది. ఇది ఉత్తర భారతదేశంలోని హిందూ జనాభాను రాజకీయంగా బలోపేతం చేయడానికి ఒక పరోక్ష యంత్రాంగం. నియోజకవర్గాల పునర్విభజన చట్టం ద్వారా ఆర్ఎస్ఎస్, బిజెపి పార్లమెంటుపై పూర్తి ఎన్నికల నియంత్రణను సాధించగలిగితే, వారిని ఎన్నికల ద్వారా తొలగించడం దాదాపు అసాధ్యం. మోదీ ప్రభుత్వం ప్రాంతీయ వైవిధ్యాన్ని, దక్షిణాది ప్రాబల్యాన్ని అధిగమించడానికి రాజ్యాంగ సరిహద్దులను దుర్వినియోగం చేయాలని చూస్తోంది. గత లోక్‌సభ సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఓడిపోయిన తర్వాత, మోదీ, కాషాయ కూటమి మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రతిపక్ష శ్రేణులలో చీలిక సృష్టించడానికి బిజెపి ఇటీవల తీసుకున్న చర్య కూడా ఈ మొత్తం పథకంలో భాగమే. బెంగాల్‌లో బిజెపి అధికారంలో ఉన్నప్పటికీ, అమిత్ షా టిఎంసి పార్లమెంటరీ పార్టీని చీల్చారు. ఈ పార్లమెంటరీ చీలిక కారణంగా రాష్ట్రంలో పాలనపై ఎలాంటి ప్రభావం ఉండదు. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు తమ సంఖ్యాబలాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇది ఒక ఎత్తుగడ. ప్రతిపక్ష పార్టీల నుండి ఇటీవల జరిగిన ఫిరాయింపులు పార్లమెంటులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ బలాన్ని మెరుగుపరిచాయి. వారి అసలు ఉద్దేశం భారత రాజ్యాంగాన్ని మార్చడమే. 400 సీట్లు దాటడం వెనుక ఉన్న ఉద్దేశ్యం రాజ్యాంగాన్ని మార్చ గలిగిన స్థితిలో ఉండటమే. బెంగాల్‌లోని టిఎంసి, మహారాష్ట్రలోని శివసేన (యుబిటి)లను వీడిన ఎంపిల ఇటీవలి ఫిరాయింపులు, మిత్రపక్షాల మద్దతుతో ఎన్‌డిఎ బలం 300 మార్కును దాటింది. కానీ ఇది ఇప్పటికీ మూడింట రెండు వంతుల కచ్చితమైన మెజారిటీకి తక్కువే. రాజ్యసభ కూడా ఇలాంటి సవాలునే విసురుతోంది. దీంతో ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్ష ఎంపిలు ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశం ప్రభుత్వ బిల్లు ఆమోదానికి కీలకంగా మారింది.




# అతిగా ఆలోచించే జబ్బు 'రుమినిజం'

మానవ మనస్సు అత్యంత సంక్లిష్టమైనది. కొన్నిసార్లు ఆలోచనలు మన నియంత్రణలో లేకుండా ఒకే విషయాన్ని పదే పదే తిప్పుతూ ఉంటాయి. దీనినే మానసిక శాస్త్రంలో రుమినిజం లేదా అతిగా నెమరువేయడం అంటారు. పశువులు ఆహారాన్ని తిన్న తర్వాత మళ్లీ నోట్లోకి తెచ్చుకుని నమలడాన్ని 'నెమరువేయడం' అంటారు. సరిగ్గా అదే విధంగా, ఒక వ్యక్తి తన మనస్సులోని ప్రతికూల ఆలోచనలను, గతంలో జరిగిన చేదు అనుభవాలను లేదా భవిష్యత్తు గురించిన ఆందోళనలను పదే పదే తలచుకుంటూ ఆ ఆలోచనల వలయంలో చిక్కుకుపోవడాన్ని మానసిక రుమినిజం అని పిలుస్తారు. ఇది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, తీవ్రమైన మానసిక రుగ్మతలకు దారితీసే ఒక మానసిక ప్రవర్తన.

రుమినిజం అనేది సాధారణ ఆలోచన కంటే భిన్నమైనది. ఒక సమస్యకు పరిష్కారం కనుగొనడానికి ఆలోచించడం వేరు, కేవలం ఆ సమస్య ఎందుకు వచ్చింది, నాకే ఎందుకు ఇలా జరిగింది అని ఆలోచిస్తూ బాధపడటం వేరు. రుమినిజంలో వ్యక్తి సమస్య పరిష్కారం వైపు కాకుండా, సమస్య తీవ్రత వైపు మాత్రమే దృష్టి పెడతాడు. ఈ రుగ్మతతో బాధపడేవారు గతంలో తాము చేసిన తప్పులను, ఇతరులు తమకు చేసిన అన్యాయాలను పదే పదే గుర్తుచేసుకుంటూ ఉంటారు. దీనివల్ల మెదడులో నిరంతరం ఒత్తిడి హార్మోన్లు విడుదలవుతాయి. ఫలితంగా, వ్యక్తి మానసికంగా మరింత కుంగిపోతాడు. ఇది ఒక విషవలయంలాంటిది. ఎంత ఎక్కువగా ఆలోచిస్తే అంతగా బాధ పెరుగుతుంది, ఆ బాధ మళ్లీ మరిన్ని ప్రతికూల ఆలోచనలకు దారితీస్తుంది.

రుమినిజం ఏర్పడటానికి అనేక కారణాలు ఉంటాయి. వ్యక్తిత్వ లోపాలు,అధిక సున్నితత్వం,గతంలో అనుభవించిన తీవ్రమైన మానసిక గాయాలు, ఆత్మవిశ్వాస లోపం వంటివి దీనికి ప్రధాన కారణాలు. ఆధునిక కాలంలో ఒత్తిడితో కూడిన జీవనశైలి కూడా దీనిని పెంచుతోంది. ఈ రుగ్మత యొక్క ప్రభావాలు చాలా తీవ్రంగా ఉంటాయి.నిరంతరం ప్రతికూల ఆలోచనలు చేయడం వల్ల వ్యక్తి క్రమంగా డిప్రెషన్‌లోకి జారుకుంటాడు. భవిష్యత్తు గురించి ఊహాజనిత భయాలు పెరిగిపోయి తీవ్రమైన ఆందోళనకు గురవుతారు. ఒక చిన్న విషయాన్ని కూడా విశ్లేషించలేక, ఏ నిర్ణయమూ తీసుకోలేక నిద్రలేమి,తలనొప్పి, అలసట, జీర్ణక్రియ సమస్యలు తలెత్తుతాయి.

రుమినిజం అనేది మౌనంగా మనశ్శాంతిని హరించే ఒక మానసిక రుగ్మత. ఒక వ్యక్తి తన ఆలోచనల స్వభావాన్ని స్వయంగా గమనించడం ద్వారానే దీనిని గుర్తించగలడు. ప్రతికూల ఆలోచనల వలయం నుండి బయటపడటానికి సంకల్పం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఎంతైనా అవసరం. అవసరమైతే సంకోచించకుం డా మానసిక నిపుణుల సహాయం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవితాన్ని తిరిగి పొందవచ్చు.

సుధాకర్ ఎవి, 9000674747

# రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం..ఆందోళనలో అన్నదాతలు

రాష్ట్రంలో కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. సాగు–త్రాగునీటి సమస్య తీవ్రం కాబోతున్నదా! అంటే ఔవుననే చెప్పక తప్పదు! రాష్ట్రవ్యాప్తంగా సగటున 33% లోటు వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 67% లోటు నమోదయింది. 548 మండలాల్లో జాడలేని వానలు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్లో 1,32,38,446 ఎకరాలు సాగయ్యేది. సాగయింది 59,83,971 ఎకరాలు మాత్రమే. వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడినవి. దిక్కుతోచని పరిస్థితుల్లో.. వానకోసం ఎదురుచూపులలో రైతాంగం..

తెలంగాణ ప్రాంతానికి సాగునీరు అందించే నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయాలు అడుగంటాయి. డెడ్ స్టోరేజ్ కి చేరుకోవడంతో కృష్ణమ్మ వెలవెల పోయింది. తెలంగాణలో వర్షపాతానికి కీలకం నైరుతి రుతుపవనాలు. 80 శాతానికి పైగా వర్షం వాటి ఆధారంగానే పడుతున్నది. అయితే ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షాలు అంతగా కురవలేదు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ ఆ మూడు నెలల్లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ తెలియజేస్తున్నది.

ఈ సీజన్‌లో జులై 15 వరకు 30 శాతం లోటు వర్షపాతం నమోదయింది. ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు పెద్దఎత్తు న నష్టం చేరకుండా రాష్ట్ర సర్కార్ 'కంటిజెన్సీ ప్లాన్ వానకాలం' 2026న విడుదల చేసింది. భూగర్భ జలాలు అడుగంటుతున్నందున బోర్ల కింద సాగు చేసే రైతులు వరిసాగు 25 శాతానికి తగ్గించుకోవాలని, ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించింది.

రాష్ట్రంలో జూన్ 1 నుండి జులై 15 నాటికి 33.53 శాతం లోటు వర్షపాతం నమోదయింది. రాష్ట్రంలో ఇప్పటివరకు ములుగు, నాగర్కర్నూల్, రంగారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోనే సాధారణ వర్షపాతం రికార్డు అయింది. 27 జిల్లాల్లో లోటు. మండలాల వారీగా చూస్తే 358 మండలాల్లో లోటు వర్షపాతం, 85 మండలాల్లో అత్యంత లోటు వర్షపాతం రికార్డు అయింది. 142 మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదయింది. ఎల్ నినో నేపథ్యంలో రాష్ట్రంలో వచ్చే మూడు నెలలు కూడా లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయి. అయితే సాధారణ వర్షపాతం నమోదైన మండలాల్లోనూ ఒకటి రెండు భారీ వర్షాలు పడటంతో అలా కనిపిస్తున్నప్పటికీ ఆ ప్రాంతాల్లోనూ కరువుచాయలే ఉన్నాయని వాతవరణ పరిశోధన కేంద్రం తెలియజేస్తున్నది.



శ్రీశైలం గరిష్ట సామర్థ్యం 215.81 టిఎంసిలకుగాను ప్రస్తుతం 39.2 టిఎంసిలకు పరిమితమైంది. శ్రీశైలం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ 810 అడుగులకు చేరువలో ఉంది. అలాగే తాగునీటికి వెన్నెముకగా ఉన్న నాగార్జునసాగర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జలాశయం గరిష్ట సామర్థ్యం 312.05 టిఎంసిలగాను ప్రస్తుతం 137.86 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉన్నాయి. నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ 510 అడుగుల చేరువలో ఉంది. జలాశయాల్లో నీరు అడుగంటినప్పటికీ అత్యవసరంగా తాగునీటి తాపం తీర్చేందుకు ఎపికి 10 టిఎంసిలు, తెలంగాణకు 16 టిఎంసిలను కృష్ణానది యాజమాన్య బోర్డు కేటాయించింది. రెండు ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరద ప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టులో నీటి నిలువలు అడుగంటాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 9.657 టిఎంసిలు కాగ, ప్రస్తుతం కేవలం 0.44 టిఎంసిలకే పరిమితమైంది.

గోదావరి బేసిన్ లోని ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు బాగా తగ్గిపోయినవి. మెదక్ జిల్లా రైతాంగానికి సాగు, త్రాగు నీరు కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే సింగూరు కింద క్రాఫ్ హాలిడే ప్రకటించగా.. సింగూరు సామర్థ్య నిలువ 29.91 టిఎంసిలకు గాను ప్రస్తుత నిల్వ 4.53 లు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు కింద నిర్మించిన రిజర్వాయర్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవటంతో గత రెండున్నర సంవత్సరాలుగా జలాశయాలు నీటిని నింపకపోవడంతో కొన్ని జలాశయాలు అడుగంటాయి. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచినీటిని ఎత్తిపోసి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లు నింపి రైతుల పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం అన్నపూర్ణ లో 2.72 టిఎంసిలు, రంగనాయక సాగర్ లో 0.89 టిఎంసిలు.

మల్లన్న సాగర్ లో 7.897 టిఎంసిలు నీళ్లు ఉన్నాయి. మరికొద్ది రోజుల్లోనే ఈ నీరంతా ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొన్నది.

శ్రీరామ్ సాగర్, ఎల్లంపల్లి, మానేరు, కడెం, కొమరం, సీతమ్మ సాగర్ దుమ్ముగూడెం, ఇచ్చంపల్లి స్వర్ణ సదర్ ఘాట్, పోచారం తదితర జలాశయాలు డెడ్ స్టోరేజ్‌కి చేరుకొని ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలో మిగతా రాష్ట్రాల కంటే తెలంగాణలోనే నీటి ఎద్దడి అధికంగా ఉంది. దక్షిణ భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో 40 నుంచి 50% జలాశయాల్లో నీటి నిలువలు ఉండగా తెలంగాణలో 25 నుంచి 36% వరకు నీటి నిల్వలు మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వ నివేదికలు తెలుపుతున్నాయి.

రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అప్రమత్తమవుతున్నది. దానికోసం పంటల మార్పిడి పై విస్తృత ప్రచారం చేస్తున్నది. అదే సమయంలో ప్రాజెక్టులో నీటి నిల్వలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నది. రాష్ట్రంలో గోదావరి బేసిన్ 52.64 శాతం, కృష్ణ బేసిన్ 46.60 శాతం, చిన్న నదీ పరీవాహక ప్రాంతాలు 0.76 శాతం వాటా కలిగి ఉన్నాయి. జులై 15 నాటికి 30 నుంచి 40% వరకు తక్కువ స్థాయిలో వర్షపాతం నమోదయి ఉన్నందున.. ప్రాజెక్టుల్లో నీరు లేక వర్షాలు కురవక వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విత్తనాలు వేసి నెలరోజులు గడిచిన ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత కారణంగా పత్తి, మొక్కజొన్న, పెసర, పసుపు తదితర విత్తనాలు మొలక దశలోనే వాడిపోతున్నాయి. వరి నారు పోసుకొని నాట్ల కోసం ఎదురుచూస్తున్నారు.

ఈ దశలో వ్యవసాయ శాఖ వారు అన్నదాతలు ఆరు తడి పంటలు వేసుకోవాలని సూచనలిస్తున్నారు.

**గ్రేటర్‌లో త్రాగునీటి ఇబ్బంది**

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో 1.30 కోట్ల జనాభాకు రోజుకు 813.28ఎంజిడిలు డిమాండ్ ఉండగా, రోజు తప్పించి రోజు.. ప్రస్తుతం వాటర్ బోర్డు 560 ఎంజిడి లు మాత్రమే సరఫరా చేయగలుగుతుంది. ఈ లెక్కన లోటు 243.28 ఎంజిడి లు గా ఉంది. అయితే 2027 ఆఖరి నాటికి సిటీలో జనాభా 1.57 కోట్లకు చేరుకుంటుందని అప్పుడు నీటి డిమాండ్ 835ఎంజిడిలు ఉండవచ్చునని అధికారులు అంచనా వేశారు. పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా గోదావరి 2,3 దశలు పూర్తి చేసుకోవాలని నివేదికలు తెలుపుతున్నాయి.

# అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి

22న రాష్ట్రవ్యాప్తంగా ట్రంప్, మోదీ దిష్టిబొమ్మల దహనం

రైతులకు పిలుపునిచ్చిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

యాదగిరిగుట్టలో ముగిసిన మూడు రోజుల రాష్ట్ర శిక్షణా తరగతులు




**ప్రజాపక్షం/యాదాద్రి :** అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దానిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఇచ్చిన పిలుపులో భాగంగా, ఈనెల 22న రాష్ట్రవ్యాప్తంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీల దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు సోమవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ముగింపు సమావేశంలో పశ్య పద్మ మాట్లాడుతూ.. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేస్తే దేశీయ రైతాంగం కోలుకోలేని దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వంటనూనెలు, యాపిల్స్, డైరీ ఉత్పత్తుల ధరలు మార్కెట్లో భారీగా పడిపోయి రైతులు రోడ్డున పడతారని పేర్కొన్నారు. ‘అమెరికా రైతులకు అక్కడి ప్రభుత్వం భారీ సబ్సిడీలు ఇస్తోంది. కానీ, మన దేశంలో రైతులకు తగిన మద్దతు లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వారితో పోటీ పడటం అసాధ్యం‘ అని ఆమె స్పష్టం చేశారు. ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకునే వరకు ఢిల్లీ నుంచి గల్లీ దాకా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఈనెల 28, 29 తేదీల్లో జాతీయ స్థాయిలో ఎస్కేఎం ఆధ్వర్యంలో రైతు, కార్మిక సంఘాలతో సంయుక్త కన్వెన్షన్ నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

**‘భూభారతి’ని రాష్ట్రమంతటా అమలు చేయాలి..** రాష్ట్ర ప్రభుత్వం ‘ధరణి’ స్థానంలో తీసుకురానున్న ‘భూభారతి’ చట్టం అమలును కేవలం పైలట్ ప్రాజెక్టులకే పరిమితం చేయొద్దని ఆమె డిమాండ్ చేశారు . సమగ్ర భూ సర్వే చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలు చేయాలని కోరారు. మూడు రోజుల శిక్షణా శిబిరంలో విద్య, వైజ్ఞానిక అంశాలతో పాటు సాగు చట్టాలు, సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ‘నీట్’ (NEET) పేపర్ లీకేజీని నిరసిస్తూ కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త మరియు పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ పోరాటానికి సంఘీభావం తెలియజేస్తూ తీర్మానం చేశారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు దీక్ష చేస్తున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు హెల్త్ బులెటిన్లు విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరారు. భూమి హక్కులను కాపాడేందుకు భూభారతి చట్టంలో చేయాల్సిన చేర్పులు, మార్పులపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, రైతు సంఘాల సలహాలు, సూచనలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ శిక్షణా శిబిరంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బోగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు, కొల్లూరి రాజయ్య, దొడ్డ వెంకటయ్య, డి.జి.నరేందర్ ప్రసాద్, ఎం.ప్రభులింగం, కొండపర్తి గోవిందరాజు, వర్ల వెంకటయ్య, కంజర భూమయ్య, నర్ల వెంకటయ్య, ఏషాల అశోక్, లక్ష్మయ్య, ఎస్.రవి, దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల గళాన్ని లాఠీలతో అణిచివేయలేరు

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ‘చలో పార్లమెంట్’ కార్యక్రమంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు జరిపిన లాఠీచార్జి దమనకాండను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి. నర్సింహ్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం పోలీసు లాఠీలతో స్పందించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. ఎన్‌టిఎలో చోటుచేసుకున్న అవినీతి ఆరోపణలు, పరీక్షల నిర్వహణపై వ్యక్తమైన ఆందోళనలకు సమాధానం చెప్పకుండా నిరసనలను అణచివేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత 12ఏళ్లుగా కేంద్రంలోని నరేంద్రమోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం దేశభక్తి పేరుతో ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, జాతీయ ఆస్తుల విక్రయం, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గనులు, విద్యుత్, రైల్వేలు వంటి కీలక రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు విస్తృత అవకాశాలు కల్పించడం ద్వారా అంబానీ, అదానీ లాంటి గ్రూపులు అపారంగా లబ్ధి పొందాయని ఆరోపించారు. మరోవైపు దేశ ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య–వైద్య రంగాల సంక్షోభం, రైతుల ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా నష్టపోతుండగా దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ కుబేరుల చేతుల్లో కేంద్రీకృతమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు ఈ పరిణామాలన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తూ విద్యార్థులు, యువత గొంతును నొక్కే ప్రభుత్వాలకు ప్రజలే తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధమైన తీర్పు ఇస్తారని ఇటి.నర్సింహ్ అన్నారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని, లాఠీచార్జికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎన్‌టిఎలో సమగ్ర సంస్కరణలు చేపట్టి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఢిల్లీలో విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జ్ అమానుషం : ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్**

ఢిల్లీలో ‘చలో పార్లమెంట్’ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం దమనకాండకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇది నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఎన్‌టిఎలో అవినీతి, పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లాఠీఛార్జీలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు లాఠీచార్జికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు – యువత న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు కోరారు.

**నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి : డిహెచ్‌పిఎస్**

నీట్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ఖండించారు. నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడి విద్యార్థులకు సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, లాఠీచార్జికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో నీట్ పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, భద్రత కల్పించేలా సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.




# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం

జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పేపర్ లీకేజీపై న్యాయం కోరుతూ ఢిల్లీలో శాంతియుతంగా పార్లమెంట్ మార్చ్‌ను చేపట్టిన విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జీ అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోనమ్ వాంగ్‌చుక్ దీక్షకు సంఘీభావంగా సోమవారం హైదరాబాద్‌లో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు.విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, నీట్ నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని, లాఠీఛార్జీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ అవకతవకల వల్ల లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ న్యాయం కోసం దేశ యువత రోడ్ల మీదికొచ్చి ఆందోళన చేస్తుంటే ప్రధాని మోడీ మౌనం వహిచటం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా విద్యార్థులతో చర్చించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మరో కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జీ చేయటం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు డిజి.నర్సింహారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్, ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి , కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, సిపిఐ(ఎం) హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటరమేశ్, అనగంటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని సూచనలు అందిస్తాం

నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి అవసరమైన అన్ని సూచనలను ప్రభుత్వానికి అందిస్తామని ఎల్‌నినో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి సోమవారం బిఆర్‌కె భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ బృందంతో సమావేశమై ఆయన రాష్ట్ర వ్యవసాయ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ రైతు కమిషన్ ప్రభుత్వానికి అందిస్తున్న సూచనలు, సిఫార్సులపై డాక్టర్ చిన్నారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై రైతు కమిషన్ రూపొందించిన రెండు నివేదికలను నిపుణుల కమిటీకి అందజేశారు. ఈనెల 22న ప్రజాభవన్‌లో నిపుణుల కమిటీ తొలి సమావేశం నిర్వహించనున్నట్లు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు కెవిఎన్ రెడ్డి, భవానీ రెడ్డి డాక్టర్ చిన్నారెడ్డికి స్వాగతం పలికి సన్మానించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ ఇన్‌చార్జ్ మెంబర్ సెక్రటరీ సంధ్యారాణి, స్పెషల్ ఆఫీసర్ కేశవులు, వ్యవసాయ రంగ నిపుణులు విష్ణువర్ధన్ రెడ్డి, కమిషన్ అధికారులు పాల్గొన్నారు.

# 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుచేయాలి

మహిళా సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాల్సిందేనని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ప్రగతిశీల మహిళా సంఘం, చైతన్య మహిళా సంఘం తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో లోక్ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పి.ప్రేంపావని మాట్లాడుతూ 1994లో యునైటెంట్ ఫ్రంట్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించిందని గుర్తుచేశారు. బిసి మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ నేపథ్యంలో ప్రముఖ సిపిఐ నాయకురాలు, మాజీ ఎంపి గీతా ముఖర్జీ నేతృత్వంలో పార్లమెంటరీ కమిటీ ఏర్పాటై, నిర్దేశిత గడువుకు ముందుగానే తన నివేదికను సమర్పించిందని చెప్పారు.

అప్పటి ప్రతిపక్ష నాయకురాలు సుష్మాస్వరాజ్ కూడా మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉందని పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రకటించారని ఆమె గుర్తు చేశారు. అనంతరం కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయినా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. మహిళల రాజకీయ సాధికారతపై బిజెపికి చిత్తశుద్ధి ఉంటే 2029 ఎన్నికలకల్లా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఫైమీదా మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తమ పోరాటం కొనసాగుతుందని, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే మహిళలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాలు పడాల నళిని, అంజూమ్, జ్యోతి శ్రీమాన్, ఐద్వా జాతీయ నాయకురాలు జ్యోతి, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అనసూయ, స్వరూప తదితర మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యమా.. అరాచకమా?

నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ మౌనం వీడాలి

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

విద్యార్థులపై లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నా

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీ ఘటనలతో లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ వ్యవహారానికి రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ పరిస్థితిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. దేశ యువతకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రధానమంత్రిపై ఉందన్నారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ శాంతియుతంగా పార్లమెంట్ వైపు మార్చ్ నిర్వహించిన విద్యార్థులు, యువజన సంఘాలపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత దురదృష్టకరం, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మంత్రి తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# కొడంగల్ నియోజకవర్గంలో నేటి నుంచి సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నుంచి రెండు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలన, నియోజకవర్గ అభివృద్ధి పనులు, ‘సర్’పై సమీక్షించనున్నారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు దుద్యాల్ మండలం, హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్‌ను సిఎం పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తారు. రాత్రి కొడంగల్‌లోనే ముఖ్యమంత్రి బస చేయనున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ స్థానిక నాయకులు, బిఎల్‌ఎలతో ‘సర్’పై సమావేశం కానున్నారు. ఈ సమావేశం అనంతరం సిఎం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

# అనుభవజ్ఞులైన నర్సులకు విదేశీ ఉద్యోగాల బాట

మంత్రి వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూరప్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లో నైపుణ్యం కలిగిన భారతీయ నర్సులకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోందని, ఆ అవకాశాలను తెలంగాణ యువతకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్), గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆయన సమక్షంలో టామ్‌కామ్‌గ్లోబల్ నర్స్ ఫోర్స్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఇతర దేశాల్లో నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమన్నారు. తెలంగాణ నైపుణ్యాన్ని ప్రపంచ ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేసే విశ్వసనీయ వేదికగా టామ్‌కామ్ ఎదుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, టామ్‌కామ్ జిఎం, గ్లోబల్ నర్స్ ఫోర్స్ ప్రతినిధి పరమానంద సంత్రా తదితరులు పాల్గొన్నారు.

# ఆయు‘ర్వేదన’



**నిర్వేదంలో..ఆయుర్వేదం..**

**204 బెడ్స్‌లో 20కి దాటని ఇన్‌పేషంట్ల సంఖ్య ...?**

**ఆక్యుపెన్సీ తగ్గితే.. వైద్య సీట్లు లేదా ఏకంగా కళాశాలే రద్దు..!**

**నిర్లక్ష్యానికి గురవుతున్న ‘ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి’**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించడంలో ఎంతో ఆదరణ ఉన్న ‘ఆయుర్వేద వైద్యం’ ప్రస్తుతం ‘నిర్వేదం’లో పడింది. అనేక దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స నందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆయుర్వేద ఆస్పత్రిని పట్టించుకునేవారే కరువయ్యారు. ఆ ఆస్పత్రిలో రోగులు లేక (ఇన్‌పేషంట్లు) తీవ్ర దీనావస్థకు చేరుతోంది. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలోని మొత్తం 204 బెడ్స్‌లలో కేవలం 15 నుంచి 20 మంది కూడా ఇన్‌పేషంట్ల సంఖ్య మించడం లేదు. వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఈ ఆస్పత్రిలో ఇన్‌పేషంట్ల సంఖ్య తగ్గడంతో భవిష్యత్తులో హైదరాబాద్‌లోని ఆయుర్వేద కళాశాల సీట్ల సంఖ్య కూడా తగ్గే ప్రమాదం ఉన్నట్టు వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆయుర్వేద వైద్య కళాశాలనే పూర్తిగా రద్దయ్యే ప్రమాదం లేకపోలేదనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

హైదారబాద్, ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి రోజురోజుకూ దీనంగా మారుతోంది. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఇన్‌పేషంట్లుగా చేరి చికిత్సను పొందేవారు. కానీ గత ఒకటి, రెండు నెలల నుంచి ఈ ఆస్పత్రిని పట్టించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. వచ్చిన కొందరు పేషంట్లను కూడా ఇన్‌పేషంట్లుగా చేరడం లేదు. దీంతో రోజు రోజుకూ ఇన్‌పేషంట్లు చేరడం లేదు. ఆస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాల విషయంలో ఆస్పత్రి వర్గాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడంలో విఫలమైందా? లేదా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదా? అనేది వైద్య వర్గాల్లో చర్చనీయంశంగామారింది. ఉన్నతాధికారులు కూడా పెద్దగా దృష్టి కేంద్రీకరించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆస్పత్రిలో కావాల్సిన నీరు, మంచినీళ్లు, డ్రేనేజీ సమస్యతో పాటు సరిపడ మందులు కూడా సరఫరాకావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌పేషంట్లుగా చేరేవారికి సమయానికి మందులను సరఫరా చేయకపోయినా, వారికి కనీస మౌలిక సదుపాయాలను కల్పించకపోతే రోగులకు పరిస్థితి ఆందోళనకరంగా ఉంటుందని, వైద్యం అందించడం పెద్ద సమస్యగా మారుతుందనే వైద్య వర్గాలు చెబుతున్నాయి.

ఆయుర్వేదంలో పంచకర్మ చికిత్సలో భాగంగా మందులను ఉపయోగిస్తే మరుగుదొడ్డికి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే శరీరానికి ఎక్కువగా నూనెను రుద్దడం వల్ల కూడా వేడినీళ్ల వాడకం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ ఆస్పత్రిలో కాయచికిత్స, పంచకర్మ, శల్య, శాలక్య, ప్రసూతి తంత్రస్త్రీరోగ, కౌమారభృత్య (పెడియాట్రిక్స్), రీసెర్చ్ (పరిశోధన) ప్రధాన విభాగాల ఉన్నాయి. ఆస్పత్రి మౌలిక సదుపాయాలు, వైద్యుల సమన్వయం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపిస్తే ఆయుర్వేద ఆస్పత్రి నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొన్నది.

**50 శాతం మించి ఇన్‌పేషంట్లు లేకపోతే.. ఇక వైద్య కళాశాల రద్దు..!**

నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ (ఎన్‌సిఐఎస్‌ఎం) ప్రకారం వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న వైద్య ఆస్పత్రిలో కనీసం 50 నుంచి 60 శాతం ఇన్‌పేషంట్లు (ఆక్యుపెన్సీ) ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. తద్వారా వైద్య విద్యార్థులకు శిక్షణకు అనుగుణంగా ఉంటుందని, పరిశోదనలు సాఫీగా సాగుతాయని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయుర్వేద వైద్య కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్‌లో 63 సీట్లు, పిజిలో 48 సీట్లు ఉండగా, ఈ కళాశాలకు అనుబంధమైన ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఆక్యుపెన్సీ శాతం చాలా తక్కువగా ఉన్నది. 204 బెడ్స్‌కుగాను కేవలం 20 బెడ్స్‌లలోనే ఇన్‌పేషంట్లుగా ఉన్నారు. దీంతో వైద్య విద్యార్థులకు కూడా శిక్షణకు అనుకూల వాతావరణం కనిపించడంలేదు. నిబంధనల ప్రకారం వైద్య కళాశాల సీట్లను తగ్గించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇలాగే ఇన్‌పేషంట్ల సంఖ్య గణనీయంగా తగ్గితే మాత్రం వచ్చే వైద్య విద్యా సంవత్సరంపైన తీవ్ర ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదు. ‘ఎన్‌సిఐఎస్‌ఎం’ నిబంధనల ప్రకారం సీట్లు సంఖ్య తక్కువ కావడం వల్ల వైద్య కళాశాలనే రద్దు చేసే అవకాశాలు ఉంటాయని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో కేవలం హైదరాబాద్, వరంగల్‌లో రెండు ఆయుర్వేద వైద్య కళాశాలలు ఉన్న విషయం తెలిసిందే. ఇన్‌పేషంట్ల సంఖ్య, మౌలిక సదుపాయాల విషయంలో ఉన్నతాధికారులు ఇప్పటి వరకు కనీసం సమీక్ష సమావేశాన్ని కూడా నిర్వహించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించి, ఆయుర్వేద ఆస్పత్రిపైన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పలువురు కోరుతున్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ–II (60–మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్.
‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No. 16/EE-60/QBZ/CMC/2026-27, Dt: 20.07.2026 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ప్రచురించబడినది. వివరాలకు @https://tender.eprocurement.gov.inలో లాగ్‌ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల తేదీ వివరాలు క్రింది విధముగా ఉన్నాయి.

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం / బిడ్ దాఖలు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 16/EE-60/ QBZ/ CMC/ 2026-27, Dt: 20.07. 2026 | 1. అంతర్గత మురుగునీటి పైప్‌లైన్లు మరియు మ్యాన్‌హోల్ ఛాంబర్ల మరమ్మతులు - 3 పనులు. 2. సి.సి. రోడ్ల నిర్మాణం - 2 పనులు. 3. బోర్‌వెల్ మోటార్లు మరియు పంప్‌సెట్ల మరమ్మతులు - 1 పని. | రూ. 82.50 లక్షలు | 22.07.2026 02.00 PM to 29.07.2026 02.00 PM | ఇ.ఇ., సర్కిల్-60, సిఎంసి, కుత్బుల్లాపూర్. సెల్ నెం. 7995468066 / 7331181426 |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.
మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-60, క్యూబిజెడ్, సిఎంసి.
DIPR R.O. No. : 6382-PP/CL/ADVT/2026-27, Date: 20-07-2026

## చిన్న వర్షానికే రోడ్డు జలమయం



ప్రజాపక్షం /గన్నేరువరం : గన్నేరువరం మండల కేంద్రం నుండి ఖాసీంపేట, పారువెళ్లకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో కాలినడకన లు, గ్రామ ప్రజలతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు అంతా నీటితో నిండిపోవడంతో బురద మధ్యనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టడంతోపాటు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కాలినడకలతోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

## సిసి కెమెరాలతో భద్రతకు భరోసా

ప్రజాపక్షం/ధర్మపురి : శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని దీనికోసం ప్రతి ఇల్లు,వ్యాపార సంస్థల వద్ద సిసికెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ధర్మపురి సిఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి సూచించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి పట్టణంలో సోమవారం ఎస్ఐమహేష్ తో కలిసి పలు కూడళ్లు,దుకాణాల సముదాయాల వద్ద సిసి కెమెరాల పనితీరును వారు పరిశీలించారు.ఈ సందర్భంగా వ్యాపారులకు కీలక సూచనలు చేశారు. ఏర్పాటు చేసుకున్న కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని,రికార్డింగును కనీసం 30 రోజులపాటు భద్రపరిచే చర్యలు తీసుకోవాలని సిఐ రాం నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

## సప్తగిరి రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాపక్షం / జమ్మికుంట : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో సివిల్ సప్లై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సోమవారం సప్తగిరి రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఆర్వోఈఓ బస్వరెడ్డి, డిఎస్పీ సీతారెడ్డి, తహసీల్దార్ దినేష్ రెడ్డి, ఇన్స్‌పెక్టర్ అనిల్ ప్రశాంత్, డిఈ విజయశేఖర్, ఏసీ సురేశ్, ఎస్సై రాజేశ్ ఏఎస్సై ప్రవళికతో పాటు విజిలెన్స్ , సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం, బియ్యం నిల్వలు, రికార్డులు, ప్రభుత్వ నిబంధనల అమలు, నిల్వల వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా మిల్లులు నిర్వహణ ఉండాలని అక్రమ నిల్వలు, నాణ్యత లోపాలు ఇతర ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సప్తగిరి రైస్ మిల్లులో తనిఖీలు అనంతరం పై అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. జిల్లాలో ఈ తనిఖీలు ఇతర రైస్ మిల్లులలో కూడా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం / చందుర్తి : రాష్ట్ర ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం మండల కేంద్రం లోని రైతు వేదిక భవనం లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు రూపాయలు 12 లక్షల 59 వేలు విలువ గల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి , సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తుందన్నారు.మండలంలోని దేవుని తండా గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ ,బిజెపి నాయకులు పార్టీలో చేరగా వారిని కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ శ్రేణులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ డే



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి అశోక్ కుమార్ సోమవారం ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 21 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రతీ ఫిర్యాదుదారుడి సమస్యను జిల్లా ఎస్పి తెలుసుకొని సంబంధిత పత్రాలను పరిశీలించి ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా,పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని,ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని ఎస్పితెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,తదితరులు ఉన్నారు.

## ఘనంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర జన్మదిన వేడుకలు




ప్రజాపక్షం/పెద్దపల్లి : సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ వలీవుల్లా ఖాద్రి,రామగుండం కార్పొరేషన్ సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపూర్ సూర్య లు మాట్లాడుతూ పేదల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి సమస్యలను తీర్చడంలో ఎల్లప్పుడూ కృషి చేస్తున్న పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆరెపల్లి మానస్ కుమార్,మాచర్ల అంజి,తాళ్లపల్లి సురేందర్, ఆసాల నవీన్, కల్లేపల్లి నవీన్,చంద్రగిరి ఉదయ్,సాదుల శివ,ఖాజా, శివ,సుధీర్, పాల్గొన్నారు.

## గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం / చొప్పదండి : గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత పల్లెల ప్రగతిపైనే ఉంటుందని నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. గుమ్లాపూర్ గ్రామంలో మొదలుపెట్టిన ఓటి కాలువల నిర్మాణం వేగంగా జరుగుతుందని త్వరలోనే గుమ్లాపూర్, కాట్నపల్లి, సాంబయ్యపల్లి, మల్లన్నపల్లె గ్రామల ప్రజల చిరకాల వాంఛ త్వరలోనే తీరబోతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్, ప్యాక్స్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, గుమ్మాపూర్ గ్రామ సర్పంచ్ లింగాల ఆనంద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, కొలపురి శ్రీకాంత్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, చొప్పదండి మున్సిపల్ పాలకవర్గం, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ నాయకులు, మండల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ఉద్యమంలా తెలంగాణ జలసిరి

కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా




ప్రజాపక్షం/కరీంనగర్: ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు పిలుపునిచ్చారు. వీబీజీ రామ్–జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జలసిరి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డిపిఒ జగదీశ్వర్, డిఆర్‌డిఒ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని అన్నారు. వీబీజీ రామ్–జీ పథకం కింద ప్రభుత్వం ఇంకుడుగుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులు చేపడుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన గ్రామాభివృద్ధి లక్ష్యంగా వీబీజీ రామ్–జీ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, గనులు–భూగర్భ శాస్త్రం, మత్స్య, ప్రణాళిక, విద్యుత్ శాఖలతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) అధికారులు పరస్పర సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సత్వరమే అర్జీల పరిష్కారం: కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ బి.శ్రీరాముల తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరం రూమ్ నెంబర్ 105 లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.గోదావరిఖని కు చెందిన ఎం. శ్రీలత తనకు నర్సింగ్ రంగంలో విద్యా అర్హత అనుభవం ఉన్నాయని, ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ పోస్ట్ ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సోసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.జూలపల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన గడ్డం పద్మ, కోట ఉషశ్రీ తమ తల్లి పేరు మీద దూళికట్ట గ్రామ శివారు సర్వేనెంబర్ 591 లో ఉన్న ఎకరం 12 గుంటల భూమి తమ చెల్లెలు తమకు తెలియకుండా విక్రయించిందని ఆ పొలాలను తమ పేరు మీద విరాసత్ కింద చేయాలనే కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన తంగళ్ళ కుమారస్వామి గ్రామపంచాయతీ కార్యాలయం మిగులు పనులు, గ్రామంలో చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు 2023 నుంచి పెండింగ్ ఉన్నాయని, ఆ నిధులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి పట్టణానికి చెందిన బొడ్డుపల్లి శ్యామల తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనం కోసం పోరాడుదాం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రజిత



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భోజనం పెట్టే పథకం అయిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్ఎఐటియుసిజిల్లా ప్రధాన కార్యదర్శి కె.రజిత మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 50 వేల మంది కార్మికులు పనులు చేయుచున్నారని వీరికి ప్రస్తుతం కేవలం నెలకు రూ.3 వేలు మాత్రమే జీతం చెల్లిస్తున్నారని వారంలో మూడు రోజులు విద్యార్థులకు కోడిగుడ్లు ఇవ్వాలని నిబంధన ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం గుడ్డుకు ఆరు రూపాయలే చెల్లిస్తున్నారని కానీ మార్కెట్లో గుడ్డు ధర ఎనిమిది రూపాయలు ఉన్నదని ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు తమ జీతంలో నుంచి వెచ్చించి విద్యార్థులకు భోజనం అందిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనీస సోయి లేకుండా కార్మికుల జీతాల పెరుగుదల కానీ, వంటకు సరిపడా వస్తువులు సరఫరాకు గానీ ముందుకు రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎఐటియుసిజిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులకు అల్పాహారం కూడా అందిస్తామని, మధ్యాహ్న భోజనం ప్రభుత్వ కాలేజీల్లో కూడా అమలు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణ సాధ్యం కావడం లేదని విమర్శించారు. మధ్యాహ్న భోజనం పథకంలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి నేటికి కూడా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనారని మండిపడ్డారు. కేంద్ర కార్మిక సంఘాలుగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని కానీ ఈ కార్మికుల జీతాలు ఏ మూలకు సరిపోకుండా కేవలం రూ.3 వేలు చెల్లిస్తూ అందులో గుడ్డు ధర అధికంగా ఉండడం కూరగాయల ధరలు అధికంగా ఉండడం గ్యాస్ సిలిండర్ సరఫరా చేయకపోవడం వలల కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు, ఏఐటియూసీ నాయకులు అల్లపు రాజు, హల్య తదితరులు పాల్గొన్నారు.

## షుగర్ ఫ్యాక్టరీ ఆరోపణలు నిరూపిస్తే పదవికి రాజీనామా

బిఆర్ఎస్ నాయకులు




ప్రజాపక్షం /మెట్‌పల్లి : మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, నిన్న కోరుట్లలోని కావేరి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రఘు చేసిన వ్యాఖ్యలు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుపై పూర్తిగా అనుచితమని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ అంశంపై డాక్టర్ రఘు చేసిన ఆరోపణలు నిజమని ఆధారాలతో నిరూపిస్తే, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గత 20 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ నిరంతరం ప్రజాసేవ చేస్తున్నారని తెలిపారు. ప్రజాసేవ అంటే మాటలు కాదు, చేతలని నిరూపిస్తూ మెట్‌పల్లి గ్రంథాలయంలో ప్రతిరోజూ చదువుకునే విద్యార్థులకు ఎమ్మెల్యే సంజయ్ పూర్తిగా ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నారని తెలిపారు. అలాగే టీహబ్, టీవర్క్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలకు విద్యార్థులను తీసుకెళ్లి ఆధునిక సాంకేతికత, స్టార్టప్‌లపై అవగాహన కల్పిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని తెలిపారు.ప్రజాసేవలను విస్మరించి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని, ప్రజలు వాస్తవాలు, అభివృద్ధి, సేవలను చూసే తీర్పు ఇస్తారని బిఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

## అన్నదాతల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్

ప్రభుత్వంపై బిజెపి తీవ్ర ఆగ్రహం



ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్: జిల్లాలో సాగునీరు ,విద్యుత్ అందక రైతన్నలు తీవ్ర నిరాశలో కూరుకుపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జిల్లాలోని డి83, డి86 కాలువల ద్వారా రైతులకు సకాలంలో సాగునీరు అందించడంలో,అలాగే వ్యవసాయానికి సరిపడా విద్యుత్‌ను సమృద్ధిగా సరఫరా చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీరు,నిరంతర విద్యుత్ సరఫరాను కల్పించి ఆందోళనలో ఉన్న రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.రైతుల సంక్షేమం,హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, అన్నదాతలకు అండగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం,జిల్లా వైస్ ప్రెసిడెంట్ శనిగరం రమేష్,జిల్లానాయకులు ,తదితరులు పాల్గొన్నారు

## నిర్ణీత గడువులోగా భూ రీ సర్వే పూర్తి

జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం /మల్లాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం భూభారతి లో భాగంగా చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియ పనులను పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా సోమవారం నడికుడ గ్రామంలో నాన్ కేడస్ట్రాల్ రీ సర్వే,ఎంజాయ్మెంట్ రీ సర్వే పనులను పరిశీలించారు.కాగా గ్రామంలో ఇప్పటివరకు రీ సర్వే ద్వారా ఎంత విస్తీర్ణంలో సర్వే పూర్తయిందని, ఎంత మేరకు చేపట్టాల్సి ఉందో అడిగి తెలుసుకుని త్వరతరిగదన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.సర్వే నెంబర్ల వారిగా ఏలాంటి అవకతవకలు లేకుండా ఖచ్చితంగా రీ సర్వే నిర్వహించలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అత్యాధునిక సర్వే పరికరాల సాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు పూర్తయిన అనంతరం భూమి వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే యుద్ధ ప్రాతికన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశాల తో జిల్లా వ్యాప్తంగా మొదటి విడుతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేయాలని ఆదేశించిందని, ప్రస్తుతం ఏడు గ్రామా ల్లో ఎంజాయ్మెంట్ రీ సర్వే కొనసాగుతుందని తెలిపారు.కలెక్టర్ వెంట ఆర్‌డిఒ నరసింహారావు,గ్రామ సర్పంచ్ తూర్పు సమత రాజన్న,తహసిల్దార్,రెవిన్ ఇన్స్‌పెక్టర్ అశోక్, సర్వేర్ కుమారస్వామి,గ్రామస్తులున్నారు.

## తిమ్మాపూర్ పిహెచ్‌సి తనిఖీ



ప్రజాపక్షం/దుబ్బాక: దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, ఎన్‌సిడిస్క్రీనింగ్, ఓపి సేవలు, సిబ్బంది హాజరు, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారి, సిబ్బందికి సూచించారు. దీనికి మెడికల్ ఆఫీసర్ స్పందిస్తూ ఉదయం సాయంత్రం వేళల్లో రోగుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, విధి వేళలను కచ్చితంగా పాటిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన ఓ బాలికలను కలెక్టర్ పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఐదు రోజులుగా జర్వం తగ్గడం లేదని, తాను చింతమడక మహాత్మ జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలో చదువుతున్నట్లు బాలిక తెలిపింది. డాక్టర్లు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని అధైర్యపడవద్దని, త్వరలోనే కోలుకుంటావని కలెక్టర్ బాలికకు ధైర్యం చెప్పారు. చింతమడక బిసి గురుకుల పాఠశాలలోబాలికలకు గత ఐదు రోజులగా జర్వాలు వస్తున్నాయని తెలుసుకున్న కలెక్టర్, వెంటనే డిఎంహెచ్ఒకు ఆదేశించారు.

## ఉద్యోగాలు,ఉపాధి కల్పించడంలో కేంద్రం విఫలం

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్




ప్రజాపక్షం/కరీంనగర్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వారి ఆకాంక్షలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని, కేంద్ర ప్రభుత్వ యువజన వ్యతిరేక విధానాలపై యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని యుగంధర్ పిలుపునిచ్చారు.అఖిల భారత యువజన సమాఖ్య( ఎఐవైఎఫ్) జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు పోలోజు రంజిత్ అధ్యక్షతన సోమవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా యువతకు ఉపాధి ఉద్యోగం కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి 12 సంవత్సరాలైనా కానీ కనీసం కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ నియామకలలో జాప్యం, విద్యా వైద్య రంగాల వాణిజ్యకరణ వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుస్తుందన్నారు. ఎఐవైఎఫ్ యువజన సంఘాన్ని కరీంనగర్ జిల్లాలో గ్రామ గ్రామాన నిర్మాణం చేసి యువతను ఎఐవైఎఫ్ లో చేర్పించాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం యువజన సంక్షేమానికి ప్రత్యేకమైన సమగ్ర విధానం అమలు చేయలేదని బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో నూతన ఉద్యోగాల కల్పన లేదని బిఆర్ఎస్ పాలనలో ఉద్యోగాల కల్పన లేకపోవడం వల్ల నిరుద్యోగం తెలంగాణ రాష్ట్రంలో పెరిగిపోయిందని కానీ యువజన సమ్మేళనం పెట్టి మేము ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం సిగ్గుచేటైన చర్య అని ఆయన విమర్శించారు. ఢిల్లీ లో నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారకుడు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని యువత పార్లమెంట్ కి తరలితే వారిపై పోలీసులు భాష్ప వాయువులు ప్రయోగించి, వాటర్ క్యాన్లను ఉపయోగించి లాఠీఛార్జ్ చేయడాన్ని ఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కసిభోసుల సంతోష్ చారి,ఉపాధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి పినమల్ల ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తరగతులకు రోజూ హాజరుకావాలి



ప్రజాపక్షం/వేములవాడ: విద్యార్థులు తరగతులకు రోజూ హాజరుకావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కిచెన్ లోకి వెళ్లి పరిసరాలు, మెనూ చార్ట్ ప్రకారం భోజనం సిద్ధం చేశారా అని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో బియ్యం, పప్పులు గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, రిజిస్టర్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు అందరూ రోజూ తరగతులకు హాజరు కావాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం చదవాలని, గత ప్రశ్న పత్రాలు సాధన చేయాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని తెలిపారు. రోజు తీరిక సమయంలో ఆటలు ఆడాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తినకముందు తిన్న తర్వాత చేతులు కడుక్కోవాలని తెలిపారు.

# నిర్మల్ జిల్లావ్యాప్తంగా యథేచ్ఛగా రేషన్ దందా

### పక్కదారి పడుతున్న పేదల బియ్యం
### సరిహద్దులు దాటుతున్న నల్లబజారు నెట్‌వర్క్



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో నిరుపేదల ఆకలి తీర్చడం కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ (పిడిఎస్) బియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు రోజు రోజుకూ బలపడుతున్నాయి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా అనేది కేవలం ఏదో ఒక గ్రామానికో లేక ఒక నిర్దిష్ట మండలానికో పరిమితం కాలేదు. ఒక వ్యవస్థీకృత ముఠాలా ఏర్పడిన అక్రమార్కులు జిల్లా వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను విస్తరించి, పేదల బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తూ రూ. కోట్లు గడిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా లోపం, పౌరసరఫరాల శాఖ అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని, దళారులు ఏకంగా పక్క రాష్ట్ర సరిహద్దులు దాటించి మరీ ఈ దందాను సాగిస్తున్నారు. ఇటీవల ఖానాపూర్ పట్టణ శివారులో జరిగిన ఒక రోడ్డు ప్రమాదం ఈ అక్రమ రవాణా తీవ్రతను కళ్లకు కట్టింది. వేగంగా వెళ్తున్న ఒక డెలివరీ వ్యాన్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి, డ్రైనేజీ కాలువలో ఇరుక్కుపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారవగా, స్థానికులు పరిశీలించగా అందులో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం బస్తాలు కనిపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, అక్రమంగా తరలిస్తున్న సుమారు 42 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని చుట్టుపక్కల గ్రామాల నుండి సేకరించి, ఒక రహస్య నిల్వ కేంద్రానికి తరలిస్తున్నట్లు తేలింది. ఈ ఒక్క ఘటన చాలు జిల్లాలో రేషన్ దందా ఎంత గుట్టుచప్పుడు కాకుండా, ఏ స్థాయిలో సాగుతోందో చెప్పడానికి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా రేషన్ పంపిణీ జరిగే సమయంలో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. లబ్ధిదారుల బలహీనతలను ఆసరాగా చేసుకుని, కొందరు దళారులు నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి కిలోకు కేవలం పది నుండి పదిహేను రూపాయల లోపు చాలా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా రేషన్ డీలర్ల పరోక్ష సహకారంతోనే ఈ దందా నడుస్తోందన్న విమర్శలు ఉన్నాయి. లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకున్న అనంతరం, వారికి బియ్యం ఇవ్వకుండా నేరుగా దళారుల వాహనాల్లోకే లోడ్ చేస్తున్నట్లు సమాచారం. ఇలా సేకరించిన బియ్యాన్ని గ్రామాల్లోని చిన్న చిన్న ఇళ్లలో, పశువుల పాకలలో లేదా రహస్యంగా నిర్మించిన షెడ్లలో గుట్టలుగా నిల్వ చేస్తున్నారు.అనంతరం అర్ధరాత్రి వేళల్లో చిన్న వాహనాల ద్వారా ఈ బియ్యాన్ని జిల్లా కేంద్రంలోని ప్రధాన రహస్య గోదాములకు చేరవేస్తున్నారు. అక్కడ నుండి ఈ బియ్యం స్థానిక రైస్ మిల్లులకు చేరుకుంటోంది. అక్కడ పిడిఎస్ బియ్యాన్ని పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్చి, ఆకర్షణీయమైన బ్రాండెడ్ సంచులుగా మార్చి తిరిగి బహిరంగ మార్కెట్ లోకి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మరికొన్ని ముఠాలు ఒక అడుగు ముందుకు వేసి, ఈ బియ్యాన్ని ఏకంగా పొరుగున ఉన్న మహారాష్ట్ర సరిహద్దులు దాటించి భారీ లాభాలు పొందుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.ఈ అక్రమ రవాణాపై పౌర సరఫరా శాఖ అధికారుల వివరణ కోరగా, జిల్లాలో అక్రమ బి య్యం రవాణాకు సంబంధించిన ఎటువంటి వ్యవహారాలు జరగడం లేదని వారు స్పష్టం చేశారు. ఆరోపణలు నిరాధారమని, జిల్లాలో పంపిణీ వ్యవస్థ అంతా పారదర్శకంగా సాగుతోందని తెలిపారు. ఎక్కడైనా అక్రమ రవా ణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అధికారులు ఈ వ్యవహారాన్ని నిరాకరిస్తున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో తరచుగా దొరుకుతున్న అక్రమ బియ్యం వాహనాలు, తాజా గా ఖానాపూర్‌లో పట్టుబడిన 42 క్వింటాళ్ల బియ్యం ఘ టన అధికారుల ప్రకటనలపై ప్రజల్లో అనుమానాల ను రేకెత్తిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, క్షేత్రస్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ నిఘా విభాగాలను ఏర్పాటు చేయాలని ప్ర జలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడో, నామమాత్రపు తనిఖీల్లోనో కేసులు నమో దు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, జిల్లావ్యా ప్తం గా ఉన్న అనుమానిత గోదాములు, రైస్ మిల్లుల పై ఆకస్మిక దాడులు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు.ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న సూ త్రధారులు,పాత్రధారులపై పీడీ యాక్ట్ కింద కఠినమైన కే సులు నమోదు చేయాలని,అప్పుడే ఈ దోపిడీకి అడ్డుకట్ట పడి ప్రభుత్వ ఉచిత బియ్యం పథకం నిజమైన పేదలకు అందుతుందని ప్రజలు గట్టిగా అభిప్రాయపడుతున్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** వచ్చే ఏడాది గోదావరి వద్ద ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న పుష్కరాల ఏర్పాట్లను మంచిర్యాల డిసిపి భాస్కర్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ శాఖల అధికారులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలని, పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ స్థలాలను నదికి కాస్త దూరంలో ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలు అమర్చి నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎసిపి ప్రకాష్, లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి, ఎస్ఐ గోపతి సురేష్ పాల్గొన్నారు.

## భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు

**ప్రజా పక్షం/భైంసా :** గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసాలో 2026–27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకం చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.తెలుగు,ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయుటకు, కంప్యూటర్ సైన్స్ & అప్లికేషన్స్, అర్థశాస్త్రం, వాణిజ్య శాస్త్రం, భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, చరిత్ర సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి.ఉర్దూ మాధ్యమంలో బోధన చేయుటకు జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం, రసాయన శాస్త్రం, రాజనీతి శాస్త్రం, చరిత్ర, ఉర్దూ, సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున నియామకాలు చేపట్టనున్నారు.అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది. నెట్, సెట్, పీహెచ్.డి. అర్హతలు మరియు బోధనా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. నియామకాలు కళాశాల విద్యా కమిషనర్ నిబంధనల మేరకు చేపట్టబడతాయి.దరఖాస్తు సమర్పించే సమయంలో విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రం, అనుభవ ధ్రువీకరణ పత్రం తదితర అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారి సంతకంతో సమర్పించాలని ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ జులై 22, 2026 సాయంత్రం 4:30 గంటలు. అనంతరం జులై 23, 2026 ఉదయం 11:00 గంటలకు కళాశాల ఆవరణలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం / కాసిపేట :** ఆగస్టు 2న మంచిర్యాలలో నిర్వహించే ఎఐటియుసి జిల్లా 4వ మహాసభలను జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. సోమవారం కాసిపేట మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత చట్టాల ప్రకారం కార్మికులకు నష్టం జరిగినప్పుడు లేబర్ అధికారులకు విచారణ జరిపి న్యాయం చేసే అధికారం ఉండేదని, నూతన లేబర్ కోడ్‌ల వల్ల అధికారులు కేవలం అనుసంధానకర్తలుగా మాత్రమే మిగిలిపోయారని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని విధానం పోయి యాజమాన్యాలకు అనుకూలంగా పది నుండి పన్నెండు గంటల పని విధానం అమల్లోకి వచ్చిందని, ఇది కార్మిక వర్గానికి ఎంతో నష్టదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణానికి కృషి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ప్రజాపక్షం / కెరమెరి :** కెరమెరి మండలంలోని అనార్‌పల్లి వాగుపై శాశ్వత వంతెన నిర్మాణానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ హామీ ఇచ్చారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి ఆమె అనార్‌పల్లి వాగును ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో అనార్‌పల్లి, పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ, సమస్యను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు వివరించి, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ‘సర్’ పరిశీలన



**ప్రజాపక్షం/బాల్కొండ :** నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ మండల కేంద్రంలో సర్‌పై బూత్‌ల వారిగా తిరిగారు. ఈ సందర్భంగా రివ్యూ సమావేశాలు నిర్వహించి ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు నింపని ఓటర్లను గుర్తించి త్వరితగతిన 100 శాతంపూర్తయ్యేలా పని చేయాలని బిఎల్‌ఒలను, పార్టీ బిఎల్‌ఎలను, అధికారులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముందస్తు చర్యలతో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం

### వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు..
### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
### మంత్రి వివేక్ వెంటస్వామి



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** మెదక్, సంగారెడ్డి జిల్లాలో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్ర గనుల, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంటస్వామి సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి , జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్, నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని తగ్గించే దిశగా ముందుస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన , పశుసంవర్థక గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా భూగర్భజలాలు, విద్యుత్, తదితర శాఖల పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలలో పలుచోట్ల కోతుల బెడద ఉన్నందున దానిని నివారించే చర్య చేపడితే రైతులు పంటల మార్పిడి వైపు మరింతగా మొగ్గ చూపే అవకాశం ఉంటుందని అన్నారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రత పెరిగేతే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు, ఉన్నందున నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భజలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ.వాణి ప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌నినోను ముందుస్తుగా అంచనా వేసి ప్రభుత్వం ప్రతీ శాఖను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఈ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. అనంతరం మంత్రి జలసిరి ప్రచార పోస్టర్లను జిల్లా కంటెంజెన్సీ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతాప్రభాకర్ సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునితా లక్ష్మారెడ్డి, రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్‌జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి మున్సిపాలిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ప్రజాప్రతినిదులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఎంపిడిఓలు, ఆత్మ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

## సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నిరసన

### కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లడఖ్ హక్కుల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ పోరాటానికి మద్దతుగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నంది రామయ్య మాట్లాడుతూ ఢిల్లీ పోలీసులు సోనమ్ వాంగ్ చుక్‌ను బలవంతంగా నిరసన వేదిక నుంచి తరలించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. వాంగ్ చుక్ పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని స్పష్టం చేశారు.అలాగే, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని నంది రామయ్య డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీల కారణంగా మానసిక వేదనకు గురై ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని,బాధితుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కేంద్ర మంత్రి రాజీనామా చేసేంత వరకు తమ పార్టీ పోరాటాన్ని ఆపబోదని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నిర్మల్ జిల్లా కమిటీ సభ్యులు ఎం. బక్కన్న, ఎస్. గంగన్న, వి.మహేందర్, పార్టీ నాయకులు ఎండి. గఫూర్, వర్మ,గిరే మియా,మనోహర్,పి.కిరణ్, గంగామని, లక్ష్మి , వి.గోదావరి,లలిత, కమల,లత,తదితరులు పాల్గొన్నారు.

## ‘జన జాగరణ యాత్ర’ పోస్టర్ ఆవిష్కరణ

### 24న ఆదిలాబాద్‌లో భారీ బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/నేరడిగొండ:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించాలనే డిమాండ్‌తో చేపట్టనున్న జన జాగరణ యాత్ర పోస్టర్‌ను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బాలక్ మందిర్ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం భోజన విరామ సమయంలో టిఎస్‌సిపిఎస్‌ఇయు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సెర్వార్ సత్యనారాయణ మాట్లాడుతూ.. సిపిఎస్ రద్దు కోసం సాగుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్క ఉద్యోగి, ఉపాధ్యాయుడు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 24న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ పోరాటానికి అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ మాతృ సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించాలంటే పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చరణ్ దాస్, చిలుక పోచన్న, కలిముద్దీన్, భూమేష్, వివేక్, భవాని, విజయ్ మోహన్ రావు, దేవిదాస్, గీతేశ్వర్, హరిచరణ్, విష్ణు తదితర ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఉత్తమం

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సూపర్ ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఎంతో శ్రేయస్కరమని ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి హితవు పలికారు. ఈ మేరకు గ్రామగ్రామాన క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్షా సమావేశం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరగగా ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్‌రెడ్డి, తోట లక్ష్మీ కాంత్‌రావు, తారిక్ అన్సారీ, నగర మేయర్ ఉమారాణి, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్, సిపి సాయిచైతన్య, ఎస్పీ రాజేష్‌చంద్ర, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యానవన, ఆర్‌డబ్ల్యుఎస్ భూగర్భజలాలు, తదితర శాఖల అధికారులు రైతులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగర్, నిజాంసాగర్, కౌలాస్‌నాల, పోచారం, సింగీతం, కల్యాణి, రామడుగు, అలీసాగర్, మంచిప్ప, మాసాని తదితర ప్రాజెక్టులు రిజర్వాయర్లలో అందుబాటులోని నీటి నిల్వలు, భూగర్భ జలాల స్థితి తాగునీటి సరఫరా తీరుతెన్నులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆరుతడి పంటలకు అందిస్తున్న ప్రోత్సాహం, విద్యుత్ డిమాండ్, సరఫరా తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో సమగ్రంగా చర్చించారు. తక్కువ నీటితో ఏఏ పంటలను సాగు చేయవచ్చు, ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేయవచ్చనే విషయాలను వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు ఆదర్శ రైతులు తమ అనుభవపూర్వక అంశాలను వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో చేపట్టనున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్న నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. శాసనమండలి సభ్యులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులు కొత్త కాకపోయినప్పటికీ దాని ప్రభావం బారి నుండి రైతులను, ప్రజలను కాపాడేలా పజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇప్పటికే 45 శాతం లోటు వర్షపాతం నెలకొన్నందున ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను కార్యోన్ముఖులను చేశారు. ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను నిలువరించే శక్తి ఎవరికి ఉండదని, అయితే ముందస్తుగానే అప్రమత్తమైన ప్రత్యామ్నాయ కార్యాచరణనుచేపడితే చాలా వరకు విపత్తు ద్వారా చేకూరే నష్టం నుండి బయట పడగలుగుతామన్నారు. సమీక్షా సమావేశంలో తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, కవితారెడ్డి, కేశవేణు, అదనపు కలెక్టర్లు భుజంగరావు, వెక్టర్, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆహార భద్రత చట్ట సవరణలు విరమించుకోవాలి




**ప్రజాపక్షం/మెదక్ :** జాతీయ ఆహార భద్రత చట్టానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సవరణలను వెంటనే విరమించుకోవాలని, అంత్యోదయ అన్న యోజన కింద ప్రస్తుతం అందిస్తున్న కుటుంబానికి 35 కిలోల బియ్యం విధానాన్ని కొనసాగించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య డిమాండ్ చేశారు. ఎన్‌పిఆర్‌డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మెదక్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడివయ్య, ఎఐఎడబ్లుయు జిల్లా కార్యదర్శి కె. మల్లేశం మాట్లాడుతూ ఆహార భద్రత పేదల హక్కు, కేంద్ర ప్రభుత్వం అర్హుల సంఖ్యను తగ్గించడం, అంత్యోదయ పథకంలో మార్పులు చేయడం పేదలు, వికలాంగులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. వికలాంగులు కుటుంబాలకు 35 కిలోల బియ్యం కొనసాగించడంతో పాటు, పోషకాహార మద్దతు, తీవ్ర వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టంలోని సెక్షన్66 ప్రకారం రాష్ట్ర వికలాంగుల సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్ట సవరణలను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ పిఆర్డీ జిల్లా కార్యదర్శి కే యశోద, వర్కింగ్ ప్రెసిడెంట్ వై దుర్గ, జిల్లా ఉపాధ్యక్షులు టి. యాదగిరి, కవిత, కె.చంద్రం గుమ్మడిదల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు సంతోష్, పి. శ్రీనివాస్, ఎల్లం, వెంకన్న జిల్లాల నాయకులు దాసు, సాయిలు, జిల్లా నాయకులు యేసయ్య, నహీం, అజహర్, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన తండాలకు తీరని రహదారి కష్టాలు

### చిరుజల్లులకే చిత్తడిగా మారుతున్న రోడ్లు
### కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో
### నిలిచిపోయిన రహదారి పనులు



**ప్రజాపక్షం/రామాయంపేట:** దేవుడు కరుణించినా...పూజారి వరమివ్వనట్లు ఉన్నది గిరిజన తండాల ప్రజల పరిస్థితి..ప్రభుత్వం రహదారుల కోసం నిదులు మంజూరు చేసినా..కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. రామాయంపేట మండలం పర్వతాపూర్ నుండి కిషన్ తండా, జమ్లా తండా పంచాయతి పరిదిలోని పలు గిరిజన తండాలను కలుపుతూ బీటీ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. టెండర్‌లో కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి కొద్ది రోజుల క్రితం మట్టి పోసి వదిలేశాడు. దీంతో వర్షం చినుకు పడగానే ఆమార్గమంతా చిత్తడిగా మారుతుంది. అసలే మట్టి రోడ్డు దానికి తోడు ఆదారి గుండా కేజీవీల్ ట్రాక్టర్లు నడుస్తుండడంతో రహదారి పూర్తిగా ద్వంసమై బురదమయంగా తయరైంది. గిరిజన తండాలకు వెళ్లాలంటేనే పాదాచారులు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. దశాబ్ధాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న తండాల ప్రజలకు కొత్త రహదారి కలగానే మిగిలిపోయెలా ఉంది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా ఈ బురద రోడ్డుపైనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మొద్దునిద్ర నటిస్తున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, నిలిచిపోయిన రహదారి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి తమ కష్టాలను తీర్చాలని గిరిజన తండాల ప్రజలు కోరుతున్నారు.

# రైతులు వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపాలి

• 10లక్షల ఎకరాల ఆయిల్‌పామ్ సాగు విస్తరణే లక్ష్యం • డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతుల ఆదాయం పెరగాలంటే సాంప్రదాయ పంటలతోపాటు ఆదాయం వచ్చే వాణిజ్య పంటలసాగువైపు మొగ్గుచూపాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మండల పరిదిలోని అంజనాపురంలో 113 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత గోద్రెజ్ ఆయిల్‌పామ్ పరిశ్రమను డిప్యూటిసిఎం భట్టివిక్రమార్క రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్, గోద్రెస్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి గోద్రెజ్, గోద్రెజ్ చీఫ్ ఎగ్జిక్యూటి ఆఫీసర్ సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్‌దత్ లతో కలిసి సోమవారం ప్రారంబించారు. తొలుత పరిశ్రమలోనే ఉత్పత్తి విభాగాలు, ఆయిల్‌పామ్ గెలలు, ప్రాసెసింగ్ యూనిట్లు నాణ్యత, నియంత్రణ వ్యవస్థను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు 1991–92 లోనే అప్పటి ముఖ్యమంత్రి నెదురుమల్లి జనార్థన్ రెడ్డి హయాంలోనే ఈప్రాంతం ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. జిల్లా విభజన తర్వాత ప్రస్తుత ఖమ్మం జిల్లా పూర్తిగా వ్యవసాయం పైనే ఆధారపడుతోందని అన్నారు. నాగార్జునసాగర్ ఎడమకాలువ, పాలేరు రిజర్వాయర్, వైరా రిజర్వాయర్ ఈ ప్రాంతా రైతాంగానికి జీవనాధారమని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో మాత్రమే ఆయిల్‌పామ్ సాగు జరుగుతుందని, దేశ అవసరాలకు సుమారు 70 ఎకరాల సాగు



అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని రానున్న రెండు, మూడేళ్లలో 10 లక్షల ఎకరాలకు సాగు పెంచడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రైతులకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎకరాకు సుమారు రూ 52 వేల ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. సమీకృత పరిశ్రమ ఏర్పాటు వలన యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి (జిఎస్‌డిపి) సుమారు 17 లక్షల కోట్లు ఉండగా వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని సూచిస్తోందని అన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వాణిజ్య పంటల విలువ ఆధారిత పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు. ఇటీవల 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో 9 వేల కోట్ల పెట్టు



బడి సాయం జమచేశామని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం కాలువలద్వారా లభించే నీటిని వినియోగించుకొని జిల్లాలో ఉద్యానవన పంటలు సాగును మరింత విస్తరింపచేయాలని అన్నారు. కొణిజర్ల మండలాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతామని అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతు దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణాను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దేశంలో ఇప్పటివరకు సీడ్‌గార్డెన్ లేకపోవడంతో ఆయిల్‌పామ్ విత్తనాల కోసం ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సి వస్తోందని అన్నారు. గోద్రెజ్ సంస్థ మలేషియా భాగస్వామ్యంతో దేశంలో ఖమ్మంలోనే తొలి ఆధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. సీడ్ గార్డెన్‌తో పాటు పరిశోధనాకేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శనా కేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన విభాగాలు, శిక్షణా కార్యక్రమాలు, నాణ్యమైన నర్సరీల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు నేటినుంచే శ్రీకారం చుడుతున్నామని వివరించారు. ఈ సమీకృత ఆయిల్‌పామ్ కేంద్రం రైతులకు అన్ని విధాల ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితిల్లో కూడా పంట దిగుబడి కొంచెం తగ్గొచ్చుగాని రైతులకు మాత్రం ఏమాత్రం నష్టం చేకూరదని తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల్లో కంది, పత్తి, పప్పు ధాన్యాల వంటి అంతర పంటలు సాగునుచేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్, అంజనాపురం సర్పంచ్ అంబడిపూడి కమలమ్మ, గద్దలగూడెం సర్పంచ్ భూక్యా సునీత, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ నాదిర్ బి గోద్రెజ్, గోద్రెజ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్రమోహన్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్, బాషా, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ యరగర్ల హనుమంతురావు, వైరా వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మన్ బోళ్ల గంగారావు, కొణిజర్ల మండల తహశీల్దార్ అరుణకుమారి, ముదిగొండ తహశీల్దార్ దొడ్డారపు సైదులు, ఆర్‌ఐ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాలలో 2026 27 సంవత్సరానికి వివిధ సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. బిబిఎ, బిసిఎ, బిఎఫ్ఎస్ఐ, బయోటెక్నాలజీ, బిజినెస్, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, డేటా సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, ఇంగ్లీష్, గణితం, పొలిటికల్ సైన్స్, తెలుగు సబ్జెక్టులలో ఖాళీల భర్తీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు విద్యార్హతకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో ఈనెల 23లోపు దరఖాస్తులను సమర్పించాలని ఈనెల 25 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన తెలిపారు. పిహెచ్‌డి నెట్ సెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందని తెలిపారు.

## ఆదివాసి మహిళా రైతుపై దాడులు సరికాదు



**ప్రజాపక్షం/మణుగూరు:**అశ్వాపురం మండలం మనుబోతులపాడు ఆదివాసి రైతులపై అటవీ శాఖ అధికారులు చేసిన దాడి దుర్మార్గమని భారత మహిళ సమాఖ్య భద్రాద్రి జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి అన్నారు. గిరిజన మహిళలపై పురుష అధికారులు చేయి చేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. తిరిగి ఆదివాసి రైతులపైనే కేసులు నమోదు చేయడం వీరి అసమర్ధ కు నిదర్శనం అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన పోడు హక్కుల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలు సాగు చేస్తున్న సమయంలో వాటిని ధ్వంసం చేసి, ఆపై మహిళలని కూడా చూడకుండా కొట్టడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి చర్యలను మానుకోవాలని ఇతవు పలికారు.

## డిసిసిబి శాఖ మేనేజర్ స్రవంతికి ప్రతిభా పురస్కారం



**ప్రజాపక్షం/కూసుమంచి:**ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్వహించిన శాఖ మేనేజర్ల సమీక్ష సమావేశంలో కూసుమంచి డిసిసిబి శాఖ మేనేజర్ మల్లెల స్రవంతి అత్యుత్తమ పనితీరును గుర్తింపుగా అవార్డు అందుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో శాఖ సాధించిన వ్యాపార వృద్ధి, గోల్డ్ లోన్ల మంజూరు, రికవరీలు, ఖాతాదారులకు అందించిన మెరుగైన సేవలను పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారం ప్రదానం చేశారు. కూసుమంచి శాఖకు ఈ గౌరవం దక్కడం పట్ల బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు హర్షం వ్యక్తం చేయగా, స్రవంతి విజయం ఇతర శాఖల అధికారలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## ఆకతాయిల హల్‌చల్




**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలంలో ఆకతాయిల రాత్రివేళల్లో హల్ ఛల్ చేస్తున్నారు. డబ్బులు కోసం బెదిరింపులకు పాల్పడుతూ ఇవ్వకుంటే కత్తులతో పొడిచి పారిపోతున్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు శనివారం అర్థరాత్రి ఓ వ్యక్తి ఇంటికి వెళుతుండగా అటుగా వచ్చిన ఆకతాయులు ఆ యువకున్ని ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు లేవంటూ ఆయన చెప్పడంతో ఇస్తావా ఇవ్వవంటూ ముందు పిడిగుద్దులు గుద్ది వారి ఆవేశం ఆగక చేతిలో ఉన్న కత్తితో వీపుపై విచక్షణా రహితంగా పొడిచి అక్కడి నుండి ఎంపిడిఓ కార్యాలయం గేటు నుండి లోపలివైపు పరారయ్యారు. ఈలోగా అటుగా వస్తున్న పోలీసులు గాయాలపాలైన వ్యక్తిని గమనించి విషయం తెలుసుకుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్చి చికిత్సలు అందిస్తున్నారు. ఈ విషయంపై వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్థరాత్రి వేళ యువకులు గంజాయి, మద్యం వంటివి సేవిచి డబ్బుల కోసం దాడులకు పాల్పడుతున్నారు. దీంతో రాత్రివేళల్లో రోడ్లపై తిరిగేందుకు ప్రజలు జంకుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భయటకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి నెలకొంది.

## ప్రజావాణి వినతులు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. ఐడిఓసిలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ఆయన జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి పలురకాల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన వినతులను ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేశారు. ప్రతీ వినతిని సకాలంలో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని పరిష్కారానికి సాధ్యం కానివాటిపై సవివరంగా నివేదికలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఓ, బిఎల్ఎల సమావేశం



**ప్రజాపక్షం/తల్లాడ:** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠాలలో సోమవారం బిఎల్ఓ, బిఎల్ఎల సమన్వయ సమావేశంలో నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల అంశాలపై సమగ్రంగా చర్చించారు. రానున్న'సర్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కావల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేసే విధానం, ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేట్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలోబిఎల్ఓ సత్యవతి, బీఎల్ఏలు షేక్ జమాల్, తమ్మిశెట్టి శ్రీను, పెరికి కిరణ్ పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా తమ పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు.

### ఎఐటియుసి పోరాట ఫలితం..

# సింగరేణి డిస్పెన్సరీ పునఃప్రారంభం

వైద్యుడితోపాటు పూర్తిస్థాయి సిబ్బందిని వెంటనే నియమించాలని ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) చేపట్టిన నిరంతర పోరాటానికి ఫలితంగా రామవరం సింగరేణి డిస్పెన్సరీ సోమవారం పునఃప్రారంభమైంది. డైరెక్టర్ (పర్సనల్ అండ్ ప్లానింగ్) కే.వెంటేశ్వర్లు, ఏరియా జనరల్ మేనేజర్, ప్రధాన ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి (సిఎంఒ) డా॥ కిరణ్ రాజ్ ఆధ్వర్యంలో డిస్పెన్సరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లాడుతూ రామవరం డిస్పెన్సరీని యథానిధిగా కొనసాగించడంతోపాటు పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతూ ఈ ఏడాది మే 31న సీఎంఓ డా॥ కిరణ్ రాజ్, ఏరియా జీఎం షాలెం రాజుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఎఐటియుసి చేసిన నిరంతర



కృషి, యాజమాన్యంపై తీసుకొచ్చిన ఒత్తిడి వల్లే డిస్పెన్సరీ తిరిగి ప్రారంభమైందని పేర్కొన్నారు. రామవరం ప్రాంతంలోని సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కాంట్రాక్టు కార్మికులకు ఈ డిస్పెన్సరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అయితే డిస్పెన్సరీ ప్రారంభించడం మాత్రమే సరిపోదని, వెంటనే శాశ్వత వైద్యుడిని నియమించి అవసరమైన వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని, తగిన మందుల నిల్వలు అందుబాటులో ఉంచి నాణ్యమైన వైద్య సేవలు అందిచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే డిస్పెన్సరీ నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ భవనాన్ని ఏర్పాటు చేసి పునఃప్రారంభానికి సహకరించిన ఏరియా జనరల్ మేనేజర్, ప్రధాన ఆసుపత్రి సీఎంఓను ఏఐటీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఉపాధ్యక్షుడు కత్తెర్ల రాములు, నాయకులు హుమాయూన్, మండల రాజేశ్వరరావు, మల్లికార్జున్, అప్పారావు, సిపిఐ నాయకులు కంచర్ల జమలయ్య, కార్పోరేటర్ శంకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారునికి పరిహారమివ్వండి

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** నాణ్యత లేని చెప్పులను విక్రయించినందుకు వినియోగదారునికి ఐదువేల పరిహారం చెల్లించాలని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సోమవారం తీర్పునిచ్చారు. లింగాల ప్రవీణ్ అనే వ్యక్తి ఖమ్మం కోర్టులో న్యాయవాద క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది ఆగస్టు నెలలో రూ.1599 వెచ్చించి చెప్పులు కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన కొద్ది రోజులకే చెప్పులు పాడైపోవడంతో సదరు దుకాణదారున్ని ఆశ్రయించాడు. బిల్లు చూపి వాటి స్థానంలో కొత్త చెప్పులు ఇవ్వాలని కోరినా స్రెటో షోరూం యజమాని అందుకు సమ్మతించలేదు. చివరకు న్యాయవాదులు యల్లంపల్లి నరేంద్రస్వరూప, కొల్లికొండ శరత్‌బాబు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో వాదనలు వినిపించారు. ఫిర్యాదు దారునికి ఐదువేలు చెల్లించడంతో పాటు న్యాయ ఖర్చులకు గాను 45 రోజుల లోపు మొత్తం పరిహారాన్ని చెల్లించాలని తీర్పునిచ్చింది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నీట్ పేపర్ లీకేజీకి కారణమైన కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని ఏఐఎస్ఎఫ్ కేంద్ర కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులపై లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతి, నిర్లక్ష్యం, అధికార యంత్రాంగం కుమ్మక్కు కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది కేవలం పరీక్షా వైఫల్యం కాదని మోడీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. లేని గొప్పలను ప్రభుత్వానికి అపాదించుకుని కేంద్ర ప్రభుత్వం కాలం గడుపుతుందని రామకృష్ణ ఆరోపించారు. లక్షలాది మంది ప్రజల జీవితాలతో చెలగాటమాడిన పేపర్ లీకేజీలో ఎవరు బాధ్యులుగా ఉన్నారో వారిని కఠినంగా శిక్షించాలని లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రావ్య, సుస్మిత, శ్రీనిధి, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్టు

• 24 గ్రాములు బంగారం, కేజిన్నర వెండి, నేరాలకు ఉపయోగించిన కారు, మోటార్ సైకిల్ స్వాధీనం
• నేరస్థుల పై పిడి యాక్ట్‌కు నమోదు • విలేకరుల సమావేశంలో ఎసిపి వసుంధర యాదవ్ వెల్లడి

**ప్రజాపక్షం/పెనుబల్లి:**దేవాలయాల్లోని దేవుళ్ళ విగ్రహాల పై ఉన్న వెండి బంగారాన్ని లక్ష్యంగా దోచుకునే ముగ్గురు దొంగల ను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు పంపిస్తున్నట్లు సోమవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం... తల్లాడ మండలానికి చెందిన షేక్ జానీ, ఆంధ్రప్రదేశ్ ఎటపాక మండలానికి చెందిన పేరాల నరసింహారావు, కొత్తగూడెం గౌతమ్ పూర్ కాలనీకి చెందిన అరవ ఉదయ్ కుమార్ అనే వ్యక్తులు దేవాలయాల్లో చోరీలకు పాల్పడేందుకు ముఠాగా ఏర్పడి పెనుబల్లి, తల్లాడ, వేంసూరు, కల్లూరు, కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గోకవరం గ్రామాల్లో వివిధ ఆలయాల్లో ఏడు చోట్ల చోరీకి పాల్పడి 24 గ్రాముల బంగారం 1.536 గ్రాముల వెండి దోచుకున్నారన్నారు. ఈ ప్రాంతాల్లో దొంగతనానికి పాల్పడేందుకు ఒక కారును మోటార్ సైకిల్ ని దొంగతనంగా కొట్టేసి రవాణా కోసం వాడారు అన్నారు. ఆ రెండు వాహనాలను కూడా సీజ్ చేశామని తె



లిపారు. దేవాలయాల్లో దొంగతనానికి పాల్పడిన సొత్తును రికవరీ చేయడం జరిగిందన్నారు. వీరంతా పాత నేరస్తులేనని వీరిపై డేకాయేట్, ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన కేసులు కూడా హైదరాబాద్ ఎల్బీనగర్, గోకవరం, నేలకొండపల్లి, ములకలపల్లి పోలీస్ స్టేషన్లో వీరిపై కేసులు నమోదై ఉన్నాయన్నారు. తరచూ దొంగతనానికి పాల్పడుతున్న వీరు ముగ్గురిపై పీడి యాక్ట్ నమోదు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని ఏసిపి తెలిపారు. ఈ దొంగల్ని ఆచూకీ కనిపెట్టడంలో పట్టుకోవడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బంది కి నగదు రివార్డు లు అందజేశారు.

**దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు బీటీ రహదారిపై సంచరిస్తే కఠిన చర్యలు....**

దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు బీటీ రహదారిపై సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసిపి తెలిపారు. దమ్ము చక్రాలపై బీటీ రోడ్లపై సంచరిస్తున్న 10 ట్రాక్టర్లకు పైగా కేసు నమోదు అయ్యాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ ముత్తి లింగయ్య, పెనుబల్లి ఎస్ఐ వెంకటేష్, కల్లూరు ఎస్సై హరిత, సిబ్బంది పి. నాగేందర్, వెంకటేశ్వరరావు నరసింహారావు, ఎస్.కె మజీద్ పాష, రాజమల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూ.కళాశాలల సమస్యలు పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి
అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అడిమాండ్ చేశారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అధ్యాపకులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ప్ర.జూ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాల్సిన పాలకులు ఆ దిశగా అడుగులు వేయడం లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్మెంట్లు వెంటనే విడుదల చేసి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

**కళాశాల నూతన కమిటీ ఎన్నిక:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎఐఎస్ఎఫ్ నూతన సమితి ఏకగ్రీవంగా ఎంపికైంది. అధ్యక్షులుగా ఇస్మాయేల్, కార్యదర్శిగా బి నిఖిల్‌తో పాటు 23 మందితో కమిటీని నియమించారు.

# పోలీస్ స్టేషన్‌లోనే భార్యపై కత్తితో దాడి

• తీవ్రంగా గాయపడిన మహిళ • ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపులు

**ప్రజాపక్షం/ఏన్కూరు:**ఖమ్మం జిల్లా ఏన్కూరు పోలీస్ స్టేషన్‌లోనే ఓ భర్త తన భార్యపై కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన ఈ ఘటనతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తీవ్రంగా గాయపడిన మహిళలను పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఏన్కూరు ఎస్ఐ సంధ్య తెలిసిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఎర్రబోడు తండాకు చెందిన భూక్య రాంబాబు, తన భార్య రజినిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ విభేదాలు కొనసాగుతుండటంతో రజిని తన పుట్టింటైన సాతాని గూడెం గ్రామంలో నివసిస్తోంది. ఈ క్రమంలో గ్రామ సంఘం ద్వారా తీసుకున్న రుణం చెల్లించాలని సంఘ సభ్యులు కోరడంతో రజినిని ఏన్కూరులోని భారతీయ స్టేట్ బ్యాంకుకు తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రాంబాబు అక్కడికి చేరుకుని భార్యతో వాగ్వాదా






నికి దిగాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బ్యాంకు ఫీల్డ్ అధికారి అత్యవసర సేవలకు సమాచారం ఇవ్వగా, పోలీసులు అక్కడికి చేరుకుని రజినిని భద్రత నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే భార్యను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన విషయం తెలుసుకున్న రాంబాబు కొద్ది సేపటికే అక్కడికి చేరుకుని తన వెంట తెచ్చుకున్న కత్తితో రజినిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె ఎడమ భుజం, ఎడమ చేతి మణికట్టు వద్ద తీవ్ర గాయాలయ్యాయి. అధిక రక్తస్రావం కావడంతో అక్కడే ఉన్న పోలీసులు, స్థానికులు వెంటనే స్పందించి ఆమెను ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ సంధ్య తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ వివాదాలే దాడికి కారణమా,లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లో ఈ దాడి జరగడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజలు, ప్రత్యక్ష సాక్షులు ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### తట్టు, రూబెల్లా నిర్మూలనకు రెండో విడత

# ప్రత్యేక టీకా కార్యక్రమం ప్రారంభం

• జిల్లా వ్యాప్తంగా క్యాచ్‌అప్ డ్రైవ్
• పిల్లలు, గర్భిణీలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి
• డిఎంహెచ్ఒ డాక్టర్ డి.రామారావు



**ప్రజాపక్షం/ఖమ్మంవైద్యవిభాగం:** తట్టు, రూబెల్లా(ఎంఆర్) వ్యాధులను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ఖమ్మం జిల్లాలో రెండో విడత ప్రత్యేక క్యాచ్ అప్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను సోమవారం ప్రారంభించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. జూలై 20 నుంచి 27 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 210 వ్యాక్సినేషన్ సెషన్లను విజయవంతంగా నిర్వహించి, లక్ష్యంగా ఉన్న 443 మంది పిల్లల్లో 431 మందికి(97.3)శాతం టీకాలు అందించినట్లు తెలిపారు. ఎంఆర్ 1, ఎంఆర్ 2 తోపాటు బిసీజీ, పెంటావాలెంట్, డీపీటీ టీకాలు కూడా అందించగా, లక్ష్యంగా ఉన్న 86 మంది గర్భిణీలకు శాతం 100 టిడీ టీకాలు వేసినట్లు వెల్లడించారు. రెండో విడతలో గతంలో టీకాలు మిస్ అయిన లేదా మధ్యలో ఆపేసిన పిల్లలు, గర్భిణీలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపట్టాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. వలస కార్మికులు, సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక మైక్రో యాక్షన్ ప్లాన్ అమలు చేసి వంద శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. అర్హులైన పిల్లల తల్లిదండ్రులు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లను సంప్రదించి రెండో విడత ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎంహెచ్ఓ డాక్టర్ డి రామారావు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులపై బలప్రయోగం ప్రజాస్వామ్య ధిక్కారం

జవాబుదారీ వహించకుండా
బ్యారికేడ్స్ వెనుక నక్కిన ప్రధాన్

సిపిఐ ప్రధానకార్యదర్శి
డి.రాజా విమర్శ

సిపిఐ(ఎం) ఇతర వామపక్షాల
ఖండన:మంత్రి రాజీనామాకు డిమాండ్

**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ''సంసద్ చలో'' మార్చ్ సందర్భంగా ప్రదర్శకులకు వ్యతిరేకంగా పోలీసు అణచివేత చర్యను భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) సహా వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. విద్యార్థులపై బలప్రయోగం ప్రజాస్వామ్యంపట్ల కేంద్ర ప్రభుత్వ తీవ్ర ధిక్కారాన్ని ప్రతిబింబిస్తోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నిశితంగా విమర్శించారు.''విద్యార్థులపై క్రూరంగా లాఠీచార్జి చేశారు, పార్లమెంటు వైపు రాకుండా ఏడు అడుగుల బ్యారికేడ్‌లను వెల్డింగ్ చేయడం, విద్యార్థులు లోపల ఉండగానే మెట్రోస్టేషన్లను మూసివేయడం,శాంతియుత ప్రదర్శకులకు వ్యతిరేకంగా అసాధారణస్థాయిలో పోలీసు బలగాలను మోహరించడం వంటి చర్యలన్నీ ప్రజాస్వామ్యంపట్ల బిజెపి ప్రభుత్వ ధిక్కార చర్యలకు నిదర్శనంగా నిలిచాయి, దేశంలో ప్రజాస్వామ్యం ఎప్పుడూ చర్చలు, సంభాషణల ద్వారా మాత్రమే మనుగడ సాగిస్తుంది తప్ప, అణచివేతవల్ల ప్రజాస్వామ్యం వర్ధిల్లదు'' అని డి.రాజా హెచ్చరిక చేశారు. పోటీ పరీక్షలలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలపై విద్యార్థుల్లో పెల్లుబికిన ఆందోళనను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభు త్వం తిరస్కరించడంవల్లనే ఈనాడు భారీసంఖ్యలో విద్యార్థులు, యువకులు అనివార్యంగా వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని, విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జవాబుదారి వహించకుండా పోలీసు బలగాల వెనుక, బ్యారికేడ్స్ వెనుక దాక్కుంటున్నారని విమర్శించారు. ''శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై జంతర్ మంతర్ వద్ద అత్యంత క్రూరంగా లాఠీచార్జి చేశారు, దేశ విద్యావ్యవస్థను నాశనం చేసినవారు ఈరోజున పోలీసు బ్యారికేడ్ల వెనుక దాక్కుంటున్నారు'' అని సిపిఐ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్‌లో నిశితంగా విమర్శించింది. కాగా పరీక్షల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతాపార్టీ నాయకత్వాన జరుగుతున్న ఆందోళనోద్యమానికి వామపక్షాలు పూర్తి



మద్దతు ఇచ్చాయి. ధర్మేంద్ర ప్రధాన్ ఈ పరిణామాలకు జవాబుదారీ వహించాలని కోరాయి. కేంద్ర ప్రభుత్వ ప్రేరేపిత క్రూర పోలీసు చర్యను తీవ్రంగా ఖండించాయి. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీసహా ఆపార్టీలోని ఇతర సీనియర్ నాయకులు బృందాకారత్,పొలిట్ బ్యూరో సభ్యులు విజూ కృష్ణన్,అరుణ్ కుమార్,మరియం ధవాలే కూడా జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలకు తమ సంఘీభావం ప్రకటించారు. పరీక్షల్లో అవకతవకలకు జవాబుదారీ వహించాలని కోరారు. సిపిఐ(ఎం) కూడా ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, శాంతియుతంగా జరుగుతున్న ప్రదర్శకులపై ప్రభుత్వం బలప్రయోగంతో ప్రతిస్పందించిందని విమర్శించింది. ''ప్రతి లాఠీచార్జీ దెబ్బ, ప్రయోగించిన ప్రతిబాష్పవాయుగోళం, వెల్డింగ్ చేసిన ప్రతి ఎత్తైన బ్యారికేడ్, మూసివేసిన ప్రతి మెట్రోస్టేషన్ బిజెపి భయానికి చిహ్నం,తన సొంత దేశ యువకులను ఎదుర్కోలేని, వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని, వారి డిమాండ్లను ఎంతమాత్రం పట్టించుకోని ప్రభుత్వం ఒక పిరికి ప్రభుత్వం'' అని సిపిఐ(ఎం) ఎక్స్ వేదికగా విమర్శించింది.

# దేశ చరిత్రలో యువతను వ్యతిరేకించిన ప్రధాని మోదీనే

తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన
రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ:** దేశ యువతను అత్యంత తీవ్రంగా వ్యతిరేకించే ప్రధానమంత్రి భారత చరిత్రలో నరేంద్ర మోదీ మాత్రమేనని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహించలేక విఫలమైన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుండి రాజీనామా లేఖను మోదీ తీసుకోలేకపోయారని,ఆయన దేశ యువత వ్యతిరేకి అని విమర్శించారు. ''152 ప్రశ్నాపత్రాలు పరీక్షల నిర్వహణకు ముందుగానే వెలుగుచూశాయి, 7.50 కోట్ల మంది విద్యార్థులు బలైపోయారు, ఈ విషయంలో కనీసం ఒక్క వ్యక్తిని కూడా శిక్షించలేదు, ఎవరికి శిక్ష విధిస్తారు? ఎంతో కష్టపడి చదుకున్న యువతరానికి శిక్ష విధిస్తారా'' అని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హిందీలో ఒక పోస్టింగ్ పెట్టారు. ఆయన పోస్టింగ్‌కు ఒక వీడియో సందేశాన్ని కూడా అనుసంధానించారు. విద్యార్థులు న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన డిమాండ్లు చేస్తున్నారని సమర్థించారు.
పోలీసులు విద్యార్థులను తీవ్రంగా కొడుతున్న దృశ్యాలను కూడా ఆయన అప్‌లోడ్ చేశారు. మన విద్యార్థులు విద్యావ్యవస్థ గురించి న్యాయబద్ధమైన ప్రశ్నలు అడుగుతున్నారు, కానీ వారికి ప్రభుత్వం పోలీసు దెబ్బలతో సమాధానం చెప్పింది, ప్రశ్నాపత్రాలను లీక్ చేసిన నేరస్థులు స్వేచ్ఛగా వీధుల్లో తిరుగుతున్నారు,న్యాయసమ్మతమైన ప్రశ్నలు అడిగిన విద్యార్థులను మాత్రం రోడ్లమీద ఈడ్చి ఈడ్చి కొడుతున్నారు, ఈ ప్రభుత్వం విద్యార్థులను పరీక్షల్లో కేవలం ఫెయిల్ చేయడం మాత్రమేకాదు, ప్రభుత్వం వారిపై లాఠీలతో దాడులు చేస్తోంది'' అని రాహుల్‌గాంధీ విమర్శించారు. ''మనదేశంలో మెజార్టీ వర్గం విద్యార్థులు,యువకులే ఉన్నారు, కానీ మోదీ మాత్రం భారత చరిత్రలో అందరికంటే యువతరానికి తీవ్రమైన వ్యతిరేకి'' అని ఆ వీడియో సందేశంలో రాహుల్ విమర్శించారు.
ఢిల్లీ వీధుల్లో తిరిగే విద్యార్థులు,విద్యార్థినులు నేరస్థులు కాదు, వారు తమ హక్కులను డిమాండ్ చేస్తున్నారు, ఒక మంచి విద్యావ్యవస్థను కలిగి ఉండటం,విద్యార్థులకు గౌరవం ఉండటం,న్యాయబద్ధమైన విద్యావ్యవస్థలో పరీక్షలు అవకతవకలు లేకుండా నిర్వహించడం వంటివన్నీ విద్యార్థులు కోరుతున్న హక్కులు,ప్రభుత్వం చేస్తున్న చేష్టలు, పోలీసులు చర్యలు విద్యార్థులకు తీవ్ర నిరాశా, నిస్పృహలు, అసహ్యాన్ని కలిగిస్తున్నాయి, వారికి అంతకంటే ప్రవర్తించడానికి మరోమార్గం లేదు, విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్నారు, లాఠీచార్జి చేస్తున్నారు, ఇది ప్రజాస్వామ్య చర్య కాదు, ఇది భారతదేశ విధానం కాదు, ఇది దేశంలో విద్యార్థులపట్ల అనుసరించే విధానం కాదు, విద్యార్థులు న్యాయబద్ధమైన డిమాండ్లు చేస్తున్నారే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థుల డిమాండ్లను సమ్మతించాలి, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల అసమ్మతిని తొలగించడానికి ఏదో ఒకటి చెయ్యాలి'' అని రాహుల్ గాంధీ తన సందేశంలో పేర్కొన్నారు. దేశంలో విద్యావ్యవస్థ తీరుపట్ల ప్రతిఒక్కరూ విసిగిపోయారు, అలసిపోయారు, ఆర్‌ఎస్‌ఎస్ మన విద్యావ్యవస్థను తన గుప్పెట్లోకి తీసుకుంది, ఇన్ని వ్యవస్థలను ఒకేఒక్క సంస్థచేత నడిపిస్తున్నారు, అందువల్ల భారతదేశంలో యువకులు ఈ విధంగా స్పందించడం సహజం, దేశంలో యువకులను గౌరవించాలి అని పేర్కొన్నారు. దేశంలో విద్యార్థులు ఈ సమస్యలను కేవలం వారాల తరబడి మాత్రమే లేవనెత్తడం లేదు, అనేక సంవత్సరాలుగా ఈ మౌలిక సమస్య మనదేశంలో కొనసాగుతోంది, మోదీ దేశ ప్రజలను గౌరవించడం లేదు, దేశంలో యువతకు ఎంతమాత్రం గౌరవం ఇవ్వడంలేదు, వారి సమస్యలను పట్టించుకోవడంలేదు, వారికి అసత్యాలమీద, హింసమీదే విశ్వాసం ఎక్కువ, వారు భారతదేశ మౌలిక సూత్రాలకు విరుద్ధం అని రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో నరేంద్రమోదీపై విమర్శల దాడి చేశారు.

# విద్యార్థులపై లాఠీఛార్జ్ ప్రజాస్వామ్యంపై దాడి

మోదీ సర్కార్‌పై విపక్షాల ఫైర్



**న్యూఢిల్లీ :** విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ప్రజాస్వామ్యంపై దాడిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, నీట్ ప్రశ్న పత్రం తో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయని తెలిపారు. అయోధ్యలో విరాళాల చోరీపై ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యత వహించాలని ఖర్గే డిమాండ్ చేశారు. విద్యా విధానంలో అనేక సమస్యలు ఉన్నాయని ఎంపి ప్రియాంక గాంధీ అన్నారు. వాటిపై చర్చ జరపకుండా విద్యార్థులపై ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపి శశి థరూర్ కూడా స్పందిస్తూ సిజెపి నిరసనలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతపై లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. చర్చలకు ప్రభుత్వం నిరాకరించడం వల్లే ఈ ఆందోళనలు, అవాంతరాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో యువత తమ అసంతృప్తిని, కోపాన్ని వ్యక్తం చేయడానికి ఒక వేదిక ఉండాలని, ఆందోళనలను బలప్రయోగంతో అణచివేయడం సరికాదని ఆయన హితవు పలికారు. యువతలో పేరుకుపోయిన నైరాశ్యానికి ఈ ఆందోళనలు అద్దం పడుతున్నాయని చెప్పారు.

**యువత డిమాండ్లు వినాలి : కేజ్రీవాల్**
ఈ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. లక్షలాది మంది యువత న్యాయం కోసం వీధుల్లోకి వస్తే వారి మాట వినాల్సిందిపోయి లాఠీచార్జ్‌కు ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం అహంకారాన్ని విడిచిపెట్టి యువత డిమాండ్లను వినాలని, ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం, పార్లమెంట్ వైపు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా నిరసనకారుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. యువత లేవనెత్తుతున్న అంశాలపై చర్చించి పరిష్కారం చూపాలని సూచించారు.

# మా డిమాండ్లు నెరవేర్చాల్సిందే

కేంద్రమంత్రి జెపి నడ్డాకు సిజెపి
ప్రతినిధి బృందం మెమోరాండం

**న్యూఢిల్లీ :** కాక్రోజ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'చలో పార్లమెంట్' ఉద్రిక్తంగా మారిన వేళ కేంద్రం దిగివచ్చింది. నిరసనకారులు సెంట్రల్ ఢిల్లీలోకి చొచ్చుకెళ్లి పార్లమెంటు వరకు పాదయాత్రకు ప్రయత్నించిన నేపథ్యంలో, ప్రభుత్వం తరఫున కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి జెపి నడ్డా సంప్రదింపులను ప్రారంభించారు. దీంతో సిజెపికి ఇద్దరు సభ్యుల ప్రతినిధి బృందం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాను కలిసింది. 'సోనమ్ వాంగ్‌చుక్‌ను తక్షణమే విడుదల చేయడం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థులందరికీ కోటి రూపాయల పరిహారం' వంటి డిమాండ్లు నెరవేర్చాలని వినతిపత్రం అందజేశారు. లేదంటే మళ్లీ నిరసన తెలియజేస్తామన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల్లో అవకతవకల కారణంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో సహా సిజెపి డిమాండ్లపై ప్రభుత్వ నాయకత్వంతో ఏకీభవించడానికి కొంత సమయం కావాలని కోరడంతో పాటు, అంతర్గత చర్చలు జరుపుతానని నడ్డా తమకు హామీ ఇచ్చారని సిజెపి తెలిపింది. నిరసనకారులతో ప్రభుత్వ సంప్రదింపులను ప్రారంభించిన నడ్డాను సిజెపి ప్రతినిధులు కలిసినట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి. సిజెపి నిరసనపై ప్రభుత్వంలో చర్చలు జరుగుతున్నాయని, ప్రభుత్వం అధికారిక ప్రకటన జారీ చేసే అవకాశం ఉందని వారు తెలిపారు. సిజెపి ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, తాను, సిజెపి జాతీయ అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా ఆరోగ్యశాఖ మంత్రిని ఆయన నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు కలిసినట్లు చెప్పారు. తమ డిమాండ్లతో కూడిన లిఖితపూర్వక లేఖను సమర్పించగా, ఆయన ఈలోగా అంతర్గతంగా మాట్లాడతానని తమకు హామీ ఇచ్చారని, ఆ ప్రక్రియలోనే ఉన్నామని దాస్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. వాటిపై తమ నాయకత్వంతో ఏకీభవించడానికి నడ్డా కొంత సమయం కోరారని రాంకా తెలిపారు. ప్రభుత్వంతో సంప్రదింపుల మార్గాన్ని తెరవడానికి ఆదివారం రాత్రి ఆలస్యంగా న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంప్రదించారని రాంకా చెప్పారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచే మరింత తీవ్రమైన చర్చలు జరిగాయని, సుమారు 11:45 గంటల ప్రాంతంలోనే నడ్డాజీని కలవడంపై ఏకాభిప్రాయం కుదిరిందని ఆయన అన్నారు.



# ఎంపిలను కలిసేందుకు యూత్ లీడర్లను అనుమతించేదాకా దీక్ష

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్
మరో సందేశం విడుదల

**న్యూఢిల్లీ :** పార్లమెంటులో ఎంపిలను కలిసేందుకు తమ యూత్ లీడర్లను అనుమతించే వరకూ తన ఆమరణ దీక్ష కొనసాగుతుందని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మరో సందేశాన్ని విడుదల చేశారు. వాంగ్‌చుక్ రాసిన చీటీని ఆయన భార్య గీతాంజలి ఎక్స్ వేదికగా పంచుకున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాన్కే కేంద్ర మంత్రి జెపి నడ్డాను కలిసిన తరువాత సోనమ్ వాంగ్‌చుక్ ఈ సందేశాన్ని విడుదల చేశారు. ఆమరణ దీక్ష చేస్తున్న సోనమ్ ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. న్యూఢిల్లీలో జరిగిన నిరసనలపై వాంగ్‌చుక్ స్పందించారు. శాంతియుత నిరసనలు తెలుపుతున్న వారితో భద్రతా దళాలు క్రూరంగా వ్యవహరించడం చూశాక తాను దీక్షను కొనసాగించేందుకు నిర్ణయించుకున్నట్టు చెప్పారు. యూత్ లీడర్లు పార్లమెంటులో ఎంపిలను కలిసేందుకు అనుమతించే వరకూ లేదా ఆసుపత్రిలో తనను కలిసేందుకు వారిని అనుమతించే వరకూ ఈ దీక్ష కొనసాగుతుందని అన్నారు. విద్యారంగంలో లోపాలకు విద్యాశాఖ మంత్రి బాధ్యత తీసుకునేలా కేంద్రం చర్యలు తీసుకుంటుందనే తాను ఆశిస్తున్నట్టు వాంగ్‌చుక్ తెలిపారు. ఎంతగా రెచ్చగొడుతున్నా యువత సంయమనం పాటించడం తనను కదిలించిందని అన్నారు. తమ సమస్యలను పార్లమెంటులో చెప్పుకునేందుకు యువతకు అవకాశం కల్పించి ఈ సమస్యకు కేంద్రం ముగింపు పలకాలని కోరారు. రేపు కూడా నిరసనకారులు ఇదే తరహా సంయమనంతో ఉండాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఇదిలా ఉంటే, వాంగ్‌చుక్‌కు సంబంధించి మెడికల్ రిపోర్టులు, ఇతర రికార్డులను తమకు సమర్పించాలని ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిని, ఎయిమ్స్, మరో ప్రైవేటు లేబోరేటరీని ఆదేశించింది. ఆసుపత్రి నుంచి వాంగ్‌చుక్ డిశ్చార్జ్ కుదరదని ఢిల్లీ హైకోర్టు సింగిల్ జడ్జ్ ధర్మాసనం ఆదేశించిన నేపథ్యంలో వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డివిజన్ బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది.



# ప్రభుత్వ జవాబుదారీతనానికి పట్టుబడతాం

ప్రజల హక్కుల కోసం
పూర్తి శక్తితో పోరాడుతాం

ఇండియా కూటమి నేతల ప్రకటన



**న్యూఢిల్లీ :** రామమందిర విరాళాల దోపిడీ, విద్యా వ్యవస్థ క్రమబద్ధమైన పతనం వంటి అంశాలపై ప్రభుత్వం నుండి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తామని, ప్రజల హక్కుల కోసం పూర్తి శక్తితో పోరాడుతామని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సోమవారం ప్రకటించింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో 'ఇండియా' కూటమి ఫ్లోర్ లీడర్ల సమావేశమై, ప్రతిపక్ష వ్యూహంపై చర్చించారు. ఈ సమావేశానికి ఖర్గేతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ గౌరవ్ గొగోయ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, టిఎంసికి చెందిన సౌగతా రాయ్, సాగరిక ఘోష్, శివసేన (యుబిటి)కి చెందిన సంజయ్ రౌత్, జెఎంఎంకి చెందిన మహువా మాజీ, సిపిఐకి పి. సందోష్ కుమార్, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్ తదితరులు హాజరయ్యారు. సమావేశం తర్వాత ఎక్స్ వేదికగా స్పందించిన ఖర్గే, పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ప్రజల గొంతుకగా నిలుస్తాయని, ప్రతి అంశంపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తాయని పేర్కొన్నారు. 'శ్రీ రామమందిర విరాళాల దోపిడీ, విశ్వాసానికి సంబంధించిన మోసం విషయం కావచ్చు కోట్లాది మంది భక్తులు ఆలయ నిర్మాణం కోసం తమ కష్టార్జితాన్ని భక్తితో సమర్పించారు; వారికి న్యాయం జరగాలి, తక్షణమే స్వతంత్ర విచారణ జరపాలి, పూర్తి వివరాలను బహిర్గతం చేయాలి. పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థ క్రమబద్ధమైన పతనం, 2014 నుండి ఇప్పటి వరకు 152 పేపర్ లీకేజీలు జరిగాయి, 25 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుండి తొలగించాలి' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం ప్రయోగం అని పిలుస్తున్న ఇథనాల్ మిశ్రమాన్ని 3.5 కోట్ల మంది వాహన యజమానులపై బలవంతంగా రుద్దే అంశం కూడా తమ గళాన్ని వినిపిస్తామన్నారు. ప్రజల కష్టార్జితాన్ని దోచుకోవడమే బిజెపికి ఉన్న ఏకైక మార్గమా అని ఖర్గే ప్రశ్నించారు. ఈ అంశాలతో పాటు, దేశ ప్రజలపై ప్రభావం చూపే ఇతర ముఖ్యమైన విషయాలు, రాబోయే బిల్లుల గురించి కూడా ప్రశ్నలు లేవనెత్తుతామని ఆయన తెలిపారు. ప్రతి అంశంపై ప్రభుత్వం నుండి జవాబుదారీతనాన్ని 'ఇండియా' ప్రతిపక్ష కూటమి డిమాండ్ చేస్తుందని, ప్రజల హక్కులు, ప్రజల గొంతుక, ప్రజల విశ్వాసం కోసం పోరాటం పూర్తి శక్తితో సాగుతుందని ఖర్గే వివరించారు.

# జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ఢిల్లీలో ఎన్‌సి నిరసన

జమ్ముకశ్మీర్ ప్రజల హక్కులు,
గౌరవాన్ని పునరుద్ధరించాలని
నినాదాలు

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) సోమవారం ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసింది. పార్లమెంటు, సుప్రీంకోర్టులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజున, ఎన్‌సి అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు 'జమ్ముకశ్మీర్ హౌస్' వద్ద సమావేశమయ్యారు. 'అప్నా వాదా పూరా కరో (మీ హామీని నెరవేర్చండి)', 'జమ్ముకశ్మీర్ ప్రజల హక్కులు, గౌరవాన్ని పునరుద్ధరించండి, 'పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించండి' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. నిరసనకారులు 'మోదీ కా వాదా, క్యున్ రహా ఆధా? (మోదీ హామీ ఎందుకు అసంపూర్తిగా మిగిలిపోయింది?)' వంటి నినాదాలు కూడా చేశారు. జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్' వైపు నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది; అక్కడ జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణపై ఒక సదస్సు జరుగుతోంది. ప్రధానమంత్రి, హోంమంత్రి పార్లమెంటులోనూ, సుప్రీంకోర్టులోనూ, అలాగే జమ్ముకశ్మీర్ ప్రజలకు ఇచ్చిన పూర్తి స్థాయి రాష్ట్ర హోదా హామీ కోసం తాము పోరాడుతున్నామని ఫరూక్ అబ్దుల్లా విలేకరులతో అన్నారు. 'ప్రభుత్వం ఈ దేశ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తుందని ఆశిస్తున్నాను. వారు దేశ శ్రేయస్సు కోసం పనిచేస్తారని, లఢాఖ్ సమస్యలు పరిష్కారమవుతాయని, జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరించబడుతుందని ఆశిస్తున్నాను' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. కేంద్రానికి అది ఇచ్చిన హామీని గుర్తు చేయడానికి జమ్ముకశ్మీర్ ప్రజలు ఢిల్లీకి రావాల్సి రావడం దురదృష్టకరమని జమ్ముకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి అన్నారు. 'ఎన్నికల తర్వాత రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని మీరు జమ్ముకశ్మీర్ ప్రజలకు హామీ ఇచ్చారు. నేటికి దాదాపు ఏడాదిన్నర గడిచింది, కానీ ప్రధానమంత్రి గానీ, హోంమంత్రి గానీ ఆ హామీని నెరవేర్చలేదు' అని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్ ప్రజలకు ఇచ్చిన హామీని కేంద్రానికి గుర్తు చేయడానికి ఎన్‌సి, కాంగ్రెస్, వారి మిత్రపక్షాలు ఢిల్లీలో సమావేశమయ్యాయని చౌదరి తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, 2019 ఆగస్టులో జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్ముకశ్మీర్, లఢాఖ్ అనే కేంద్రపాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరించారు. 2023 డిసెంబరులో, రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని పేర్కొంటూనే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు సమర్థించింది.




# 9 మంది రాజ్యసభ సభ్యులు ప్రమాణం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం వేళ కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ తొమ్మిది మంది సభ్యులతో ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వర్షాకాల సమావేశాల తొలి రోజున ప్రమాణం చేసిన కొత్తగా ఎన్నికైన సభ్యుల్లో ముఖేష్‌భాయ్ జె రత్వా (బిజెపి–గుజరాత్), పవన్ ఖేరా (కాంగ్రెస్–కర్ణాటక), మహేష్ కేవత్ (బిజెపి–మధ్యప్రదేశ్), జమేష్ పాంగ్‌సాంగ్ కొంగ్‌కల్ సంగ్మా (ఎన్‌పిపి– మేఘాలయ) ఖియాంగ్టే లాల్ట్‌లుగ్కిమా (మిజోరం), సతీష్ పూనియా (బిజెపి–రాజస్థాన్), ప్రకాష్ చిక్ బరాక్ (బిజెపి–పశ్చిమ బెంగాల్), సుస్మితా దేవ్ (బిజెపి–పశ్చిమ బెంగాల్), సుఖేందు శేఖర్ రే (బిజెపి–పశ్చిమ బెంగాల్) ఉన్నారు. అంతకుముందు ఎన్నికైన మరి కొందరు సభ్యులు సమావేశాల మధ్య కాలంలో అప్పటికే ప్రమాణ స్వీకారం చేశారు.

# వర్షాలు, వర్షాకాల సమావేశాలు ఫలప్రదమైతే.. దేశం, జీవరాశి శ్రేయస్సుకు దోహదం

ప్రధాని మోదీ ఆశాభావం

**న్యూఢిల్లీ :** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఫలప్రదంగా సాగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం పిలుపునిచ్చారు. సభలో చర్చలు తర్కం, వాస్తవాల ఆధారంగా జరిగితే గందరగోళానికి లేదా గొంతు పెంచాల్సిన అవసరానికి తావుండదని ఆయన పేర్కొన్నారు. సమావేశాల ప్రారంభానికి ముందు మోదీ పార్లమెంటు ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. రుతుపవనాలు తమ సానుకూల ప్రభావాన్ని చూపడం మొదలుపెట్టాయని, అదే సమయంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కూడా ప్రారంభమవుతున్నాయని ప్రధాన మంత్రి అన్నారు. 'ఈ రెండూ ఫలప్రదంగా ఉన్నప్పుడు, అవి దేశం, సమస్త జీవరాశి శ్రేయస్సుకు దోహదపడతాయి. రుతుపవనాలు అనుకూలంగా ఉండాలని, అలాగే పార్లమెంటు సమావేశాలు కూడా అంతే ఫలప్రదంగా సాగాలని మనం ఆశిద్దాం' అని ఆయన అన్నారు. సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో దేశం అభివృద్ధి పథంలో వేగం పుంజుకుందని, పార్లమెంటు స్ఫూర్తి ఈ వేగానికి కొత్త శక్తిని ఇవ్వగలదని, జాతీయ లక్ష్యాలను సాధించడానికి సానుకూల దృక్పథం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. సభలో అర్థవంతమైన చర్చలు జరగాలని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టి నిర్ణయాలు తీసుకోవాలని మోదీ నొక్కి చెప్పారు. దేశభక్తి, దేశం పట్ల అంకితభావంతో కూడిన గొంతుకలకు పార్లమెంటులో సరైన వేదిక లభించాలని, తద్వారా యువత గళాన్ని వినిపించి దేశానికి దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను రూపొందించిన యువ ఆవిష్కర్తలను అభినందిస్తూనే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి మోదీ పరోక్ష వ్యాఖ్యలు చేశారు; తాను '56 ఏళ్ల యువకుడి' గురించి మాట్లాడటం లేదని ఆయన అన్నారు. గత ఏడాది రుతుపవనాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోవడం, అలాగే మొన్ననే ఒక యువ భారతీయ స్టార్టప్ అద్భుతమైన ఘనతను సాధి ంచడం వంటివి ఎంతో గర్వించదగ్గ క్షణాలని ఆయన అన్నారు. పశ్చిమాసియాలో జరుగుతున్న సంఘర్షణ గురించి ప్రస్తావిస్తూ, ఇంధన అవసరాల కోసం ఇతరులపై ఆధారపడే భారతదేశం వంటి దేశాలకు ఈ యుద్ధం పెద్ద సంక్షోభాన్ని సృష్టించిందని మోదీ అన్నారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి, ఎరువులు, రసాయనాల సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పటికీ, భారతదేశం 7.7 శాతం వృద్ధి రేటును కొనసాగిస్తూ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధా న ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఆయన పేర్కొన్నారు.



# త్రిపుర డిజిపి అనుమానాస్పద మృతి

**అగర్తలా :** త్రిపుర డిజిపి అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందారు. అగర్తలాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఆయన తన సర్వీస్ పిస్టల్‌తో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. ఆయనను గమనించిన సిబ్బంది వెంటనే అగర్తలాలోని గోవింద్ బల్లభ్ పంత్ ఆసుపత్రికి తరలించారు. 'డిజిపి అనురాగ్ ధన్‌ఖడ్‌ను మధ్యాహ్నం 12 గంటలకు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆయన నాడి కొట్టుకోవడం ఆగిపోయింది, రక్తపోటు లేదు. మేము 40 నిమిషాలకు పైగా సిపిఆర్ ఇచ్చి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరకు 12.48 గంటలకు ఆయన మరణించినట్లు ధ్రువీకరించాం. పోస్టుమార్టం తర్వాతే మరణానికి గల కచ్చితమైన కారణం తెలుస్తుంది' అని గోవింద్ వల్లభ్ పంత్ హాస్పిటల్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ప్రదీప్ భౌమిక్ తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఆయన మరణానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై పోలీసులు ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ఈ వార్త గురించి తెలియగానే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సాహా, ప్రధాన కార్యదర్శి జికె సిన్హా సహా ఇతర సీనియర్ ప్రభుత్వాధికారులు డిజిపి కార్యాలయానికి వెళ్లారు. రాష్ట్ర పోలీస్ చీఫ్ బలవన్మరణానికి పాల్పడినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నేత జితేంద్ర చౌదరి న్యాయ విచారణకు డిమాండ్ చేశారు. 'ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి బలవన్మరణానికి పాల్పడడం రాష్ట్రంలోని శాంతి భద్రత పరిస్థితిని సూచిస్తోంది. డిజిపి మరణానికి గల అసలు కారణాలు, దాని వెనుకున్న పరిస్థితులను తెలుసుకోవడానికి మేము న్యాయ విచారణ కోసం డిమాండ్ చేస్తున్నాం' అని అన్నారు.


(ఫైల్)

## గయానాలో ఫెర్రీ బోల్తా: 66 మంది గల్లంతు



**జార్జ్‌టౌన్:** దక్షిణ అమెరికా ఉత్తర తీర ప్రాంత దేశం గయానా తీరంలో ప్రయాణం చేస్తున్న ఒక ప్రయాణికుల ఫెర్రీ బోల్తా పడింది. సహాయబృందాలు 67 మందిని రక్షించారు. కానీ మరో 66 గల్లంతయ్యారు. వారికోసం తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కొన్ని మృతదేహాలు లభ్యమయ్యాయి. గాలింపు కొనసాగుతోంది. సహాయ సిబ్బంది రక్షించినవారిలో ఆరుగురు బాలురు, తొమ్మిదిమంది బాలికలు, 11 మహిళలు, 41 మంది పురుషులు ఉన్నారు. ఉత్తర అట్లాంటిక్ తీరానికి ఏడు మైళ్ళదూరంలో బోల్తా పడిన ఈ ఫెర్రీలో 17 మంది సిబ్బంది ఉండగా, 116 మంది ప్రయాణికులున్నారు. 1939లో తయారు చేసిన ఈ ఫెర్రీకి 2024లో ఒకసారి మరమ్మతులు చేశారు. మరోసారి దీనికి మరమ్మతులు నిర్వహించాల్సి ఉండగా ఈ ప్రయాణం జరిగింది. ఐతే ఈ ఫెర్రీ నడిపే సిబ్బందిలో కొందరు భారీగా గంజాయి సేవించారన్న నిర్ధారణలు వచ్చాయి.ఐతే ఈ ఫెర్రీ ప్రమాణంలోగానీ, ప్రయాణ సమయంలోగానీ అక్రమాలు,దుర్మార్గాలు ఏమైనా జరిగితే తీవ్ర చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు. ఈ దిశగా దర్యాప్తు కూడా ప్రారంభించారు.

ఈ ఘటన వాస్తవానికి శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగినప్పటికీ ఇంతవరకూ మృతదేహాల జాడ తెలియలేదు. నిపుణులైన డైవర్లను ప్రభుత్వం రంగంలోకి దింపింది. ఈ సమీపంలో ఉన్న చమురు గ్యాస్ కంపెనీ నౌకలు కూడా తమ సిబ్బందిని రంగంలోకి దింపాయి.జార్జ్ టౌన్ నుండి బయలుదేరిన తర్వాత నాలుగు గంటలు ప్రయాణం చేశాక ఫెర్రీ మునిగిపోయింది. ఐతే కొందరు లైఫ్ జాకెట్లతో ఒడ్డుకు ఈదుకువచ్చి సమాచారం తెలియజేశారు. ఈ ప్రమాదంలో ముర్రే అనే ఒక వ్యక్తితోపాటు ఆయన కుమారుడు బ్రతికారు. వారి కుటుంబంలో ఆయన భార్య, మనువలు, మనవరాళ్ళు ఆరుగురు జాడ తెలియకుండాపోయారు.

## హమాస్ అధినేతగా ఖలీల్ హయ్యా



**గాజా:** హమాస్ ఉగ్రవాద సంస్థ సర్వాధిపతిగా ఖలీల్ హయ్యా బాధ్యతలు చేపట్టారు. హమాస్ ఉన్నత పదవికి జరిగిన అంతర్గత ఎన్నికల్లో ఆయన గెలిచారు. అమెరికా మధ్యవర్తిత్వంతో పాలస్తీనా–ఇజ్రాయెల్ మధ్య జరిగిన చర్చల్లో ఖలీల్ హయ్యా ప్రధాన అనుసంధానకర్తగా, నిర్దేశకుడుగా బాధ్యతలు నిర్వహించారు. గతంలో ఆయన గాజాలో హమాస్ రాజకీయ విభాగం పొలిటికల్ బ్యూరో అధిపతిగా పనిచేశారు. ఇప్పుడు ఆయన హమాస్ ఉగ్రవాద ఉద్యమానికి సంపూర్ణస్థాయి అధిపతిగా ఎన్నికయ్యారని ఇజ్రాయెల్ పత్రిక ప్రకటించింది. హమాస్ అధిపతి యాహ్యా సిన్వర్ హతమైనప్పటినుండి గడిచిన రెండు సంవత్సరాలుగా హమాస్ సంస్థను ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత బృందం నడిపిస్తోంది. ఈ ఉన్నతబృందంలో ఖలీల్ హయ్యా కూడా ఒకరుగా ఉన్నారు. గాజాస్ట్రిప్‌లో జన్మించిన ఖలీల్ హయ్యా తన జీవితంలో ఎక్కువభాగం అక్కడే గడిపారు. కానీ 2023 అక్టోబరులో ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి ప్రణాళిక అమలు చేయడానికి ముందుగా ఖలీల్ హయ్యా ఖతార్‌కు తరలివెళ్ళారు. ఇప్పుడు అక్కడి నుండే ఆయన కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

# ఇరాన్ దాడిలో మరో అమెరికా సైనికుడు మృతి

- ●హోర్ముజ్‌లో రెండు చమురు ట్యాంకర్లు పేల్చివేత
- ●ఇరాన్ కమాండ్ సెంటర్, క్షిపణి, డ్రోన్ కేంద్రాలపై అమెరికా దాడులు
- ●దాడులను అడ్డుకున్న బ్రహైన్, కువైట్



**దుబాయ్:** పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్ చేస్తున్న దాడులలో మరో అమెరికా సైనికుడు ఉత్తర ఇరాక్‌లో హతుడయ్యాడు. దీంతో ఇప్పటివరకూ యుద్ధంలో మరణించిన అమెరికా సైనికుల సంఖ్య 17కు పెరిగింది. గడచిన మూడు రోజుల్లో నలుగురు సైనికులను అమెరికా కోల్పోయింది. ఇద్దరు సైనికులు ప్రత్యక్ష దాడిలో మరణించగా, ఒక సైనికులు గల్లంతయ్యాడు. మరో సైనికుడు తాజా దాడిలో మరణించాడు. రో 450 మంది అమెరికా సైనికులు ఇప్పటివరకూ గాయపడ్డారు. ఇరాక్‌లో ఇరాన్ ఐఆర్‌జిసి సైన్యాలు చేసిన దాడిలో అమెరికా సైనికులు మరణించాడు. హోర్ముజ్ జలసంధిలో రెండు చమురు ట్యాంకర్లను ఇరాన్ పేల్చివేసింది. ఇరాన్ ప్రాదేశిక జలాలలోంచి కాకుండా అక్రమ మార్గంలో దొడ్డిదారిన వెళ్ళేందుకు యత్నించిన రెండు చమురు ట్యాంకర్లను పేల్చివేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. తాము నిర్దేశించిన మార్గాలలోనే నౌకలు ప్రయాణం చేయాలని మరోసారి ఐఆర్‌జిసి హెచ్చరిక జారీ చేసింది. అమెరికాకు చెందిన ఐదు ఎంక్యూ–9 డ్రోన్లను కూల్చివేసినట్లు పేర్కొంది. జోర్డాన్‌లో విమానాశ్రయాలపై దాడులు చేసింది. అమెకాగా ఒమన్ తీరానికి 15 కి.మీ దూరంలో ఒక నౌకపై గుర్తు తెలియని ప్రొజెక్టైల్ దాడి చేసినట్లు బ్రిటన్ సముద్ర పర్యవేక్షణ సంస్థ ప్రకటించింది. మరోవైపు అమెరికా సెంట్‌కామ్ సైనికబలగాలు సోమవారం తెల్లవారకముందుగానే ఇరాన్‌పై వరుసగా తొమ్మిదోరోజు కూడా భారీ దాడులను పూర్తిచేశాయి. ఇరాన్ కమాండ్ సెంటర్, గగనతల రక్షణ వ్యవస్థ, ఇరాన్ కోస్తాతీర ప్రాంత నిఘా కేంద్రాలు, సముద్ర సామర్థ వ్యవస్థలు, ఆయుధ నిల్వ కేంద్రాలు, క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించే వేదికలు ఉండే స్థావరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, రేవు నగరం బుషెర్‌లపై అమెరికా సైన్యాలు భారీస్థాయిలో గగనతల దాడులతో విధ్వంసం సృష్టించాయి. మరోవైపు బ్రహైన్, కువైట్‌లలో వరుస పేలుళ్ళు సంభవించాయి. దక్షిణ ఇరాన్ నగరాలలో పేలుళ్ళు సంభవించాయి. ఇరాన్ డ్రోన్లను అడ్డుకున్నామని జోర్డాన్, కువైట్ దేశాలు ప్రకటించాయి. జోర్డాన్‌లో ఇరాన్ వరుస దాడులతో తీవ్ర విధ్వంసం సృష్టిస్తూ ఉండటంతో ఆ దేశంలో ఉన్న ఇరాన్ రాయబారిని పిలిపించి జోర్డాన్ ప్రభుత్వం తీవ్ర నిరసన తెలియజేసింది. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ చమురు మార్కెట్ తీవ్ర అనిశ్చితికి గురైంది. బ్రెంట్ క్రూడాయిల్ ఒక బ్యారెల్ ధర 90 డాలర్లు దాటిపోయింది. భారత స్టాక్ మార్కెట్లు కూడా పతనమయ్యాయి.

# స్పెయిన్ వీధుల్లో లక్షలమంది సెలబ్రేషన్స్


- ●జట్టు సభ్యులకు మాడ్రిడ్‌లో వీరోచిత ఆహ్వానం
- ●ఫౌంటెన్ కూలి మైనర్ బాలుడు దుర్మరణం



**మాడ్రిడ్:** న్యూజెర్సీలో జరిగిన 2026వరల్డ్ కప్ ఫైనల్‌లో అర్జెంటీనాపై స్పెయిన్ జట్టు ఘన విజయం సాధించడంతో ఆ దేశంలో లక్షల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఉత్సవం చేసుకుంటున్నారు. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్, రాజు ఫెలిప్ మాడ్రిడ్‌లో తమ దేశ జట్టుకు వీరోచిత ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో లెక్కలేనంతమంది పాల్గొన్నారు. స్పెయిన్‌లో ఫుట్‌బాల్ ఆటపై అమితమైన అభిమానం ఉన్న ఆ దేశ ప్రజలు ఘన స్వాగతం ద్వారా దేశ గర్వాన్ని చాటిచెప్పారు. అర్జెంటీనాపై 1–0 తేడాతో ఘన విజయం సాధించిన కోచ్ లూయిస్ డిలా ఫ్యుంటే బృందం సోమవారం మధ్యాహ్నం 12.50 గంటలకు బంగారు ట్రోఫీని చేతబట్టుకుని మాడ్రిడ్‌పై కాలుమోపారు. ఈ జట్టు ప్రధానమంత్రి మోంక్లోవా ప్యాలెస్ అధికార నివాసం సమీపం నుండి సిబెల్స్ స్క్వేర్ వరకు ఊరేగింపుగా వెళ్ళారు. లక్షలమంది ఈ వేడుకలలో పాల్గొన్నారు.ఆ సంప్రదాయ వేడుకల ప్రాంగణంలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. కాని అంతకుముందు ప్రజలు స్వచ్ఛందంగా చేసుకున్న భారీ వేడుకలలో ఒక విషాదం చోటు చేసుకుంది. ఒక ఫౌంటెన్ కూలిపోవడంతో ఈ వేడుకల సందర్భంగా 13 సంవత్సరాలు వయసుగల మైనర్ బాలుడు దుర్మరణం చెందాడు. చారిత్రక నగరం సియుడాడ్ రోడ్రిగోలో అభిమానులు ఆదివారం అర్ధరాత్రి దాటాక సంబరాలు చేసుకుంటున్న సమయంలో ప్రమాదంలో ఈ బాలుడు మరణించాడు. పోలీసులు ఫౌంటెన్ శిథిలాలు తొలగించి బాలుణ్ణి ఆరోగ్యకేంద్రానికి తరలించారు. కానీ అప్పటికే అతడు మరణించాడు. దీంతో ప్రజలు ఆ కుటుంబానికి తమ సంఘీభావం ప్రకటించి వారికి అండగా నిలబడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో స్థానిక కౌన్సిల్ మూడు రోజులు సంతాప దినాలు ప్రకటించింది. దీంతో సియుడాడ్ రోడ్రిగోలో ప్రజలకు ఈ ఘన విజయ వేడుకలు ఒక విషాదంగా మారాయి.

## చంద్రుడిపై కాలుమోపి 57 ఏళ్ళు

### అంతర్జాతీయ మూన్ డే వార్షికోత్సవం



**వాషింగ్టన్:** క్రూర మృగాలను జయించి గొప్ప మానవ సమాజాన్ని నిర్మించిన మనిషి ఎవరెస్టు శిఖరాగ్రాన్ని అధిరోహించాడు. ఇప్పుడు పూర్తిగా బాహ్య అంతరిక్షాన్ని శోధిస్తూ, ఇతర గ్రహాలలో నగరాలు ఎలా నిర్మించాలా అని ఉద్ధృత పరిశోధనలు చేస్తున్నాడు. ఈ విజయాలకు నాందిగా మనిషి మొదటిసారి చంద్రుడిపై కాలుమోపి జులై 20వ తేదీ నాటికి 57 సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు కొత్త లక్ష్యాలను ఉద్ఘాటించారు. 2027 నాటికి నాసా 30 రోబోలను చంద్రుడిమీద దింపాలని ప్రణాళిక చేస్తోంది. చంద్రుడిపై కాలనీలు నిర్మించి మార్స్ గ్రహాన్ని మానవ నివాసానికి అనుకూలంగా మలచుకునేందుకు అక్కడి నుండే తదుపరి పరిశోధనలకు శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టబోతున్నారు. అంటే ఒకరకంగా రాబోయే రెండు దశాబ్దాలలో చందమామ కుడా మరో భూగోళంగా మారి, మానవ ఆవాసాలకు, భూమి–చంద్రుడి మధ్య సాధారణ రాకపోకలకు ఒక ప్రధాన కేంద్రంగా మారనున్నది.

1969లో అపోలో–11 ద్వారా విజయవంతంగా జరిగిన చంద్రయాత్రలో వ్యోమగామి నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి దక్షిణ ధృవంపై కాలుమోపారు. ఆ రోజును ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మూన్ డే గా పాటించాలని ఐక్యరాజ్య సమితి ఏనాడో ప్రకటించింది.సమస్త మానవాళి బాహ్య అంతరిక్షాన్ని ప్రపంచ దేశాలు దుర్వినియోగం చేయకుండా శాంతియుత ప్రయోజనాలకు ఉపయోగించాలనే లక్ష్యంలో భాగంగా కూడా ఈ అంతర్జాతీయ చంద్ర దినోత్సవం ఏటా పాటించాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశించింది. వీటన్నింటికీ ముందుగానే 1967లో అంతర్జాతీయ అంతరిక్ష మాగ్నాకార్టా అమలులోకి వచ్చింది. బాహ్య అంతరిక్ష శోధనలో అంతర్జాతీయ సహకారం,అంతరిక్ష కార్యకలాపాల నియంత్రణ,శాంతియుత ప్రయోజనాలు వంటివన్నీ ఈ మాగ్నాకార్టాలో ఉన్నాయి.

చంద్రుడిపై నీటి జాడలున్నాయని భారత్ ప్రపంచానికి తెలియజేసింది. చంద్రుడి రాళ్ళను తెచ్చి పరిశోధనలు చేస్తున్నారు. 2035 నాటికి చంద్రుడిపై మానవ ఆవాసాలు నిర్మించి అనంత రోదసీని జల్లెడ పట్టేందుకు అగ్రదేశాలు పోటీ పడుతున్నాయి. రాబోయేకాలంలో ఇస్రో గగన్‌యాన్‌కు విజయవంతంగా సన్నాహాలు చేస్తోంది. ఈ విషయంలో ముఖ్యంగా అమెరికా, చైనా, భారత్ నిర్దిష్ట లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు వెళుతున్నాయి. 2026 ఏప్రిల్ 1–11 వ తేదీ వరకూ ఆర్టెమిస్–2 అంతరిక్ష యాత్ర,సుదూరంగా ఉన్న చంద్రుడి వెనుక చీకటి లోకాన్ని నలుగురు నాసా వ్యోమగాములు చుట్టి వచ్చి ఒక అపూర్వమైన విజయాన్ని సాధించడం మానవజాతి చరిత్రలో మరో మైలురాయి ఘట్టంగా మారింది. 2028 నాటికి ఆర్టెమిస్ 4–5 మిషన్స్‌తోపాటు చైనా కూడా 2030 నాటికి వ్యోమగాములను పంపేందుకు సిద్ధమైంది.

ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ కూడా చంద్రుడిపైకి యాత్రికుల్ని తీసుకువెళ్ళి సురక్షితంగా తిరిగి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ విధంగా దాదాపు 60 దేశాలు చంద్రుడిపై దృష్టి సారించాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ సందర్భంగా అంతరిక్ష శోధకులు పలు వ్యాఖ్యలు విడుదల చేశారు. వందల కోట్ల సంవత్సరాలక్రితం ఒక భారీ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టడంతో భూమి నుండి ఒక పెద్ద భాగం విడిపోయిన చంద్రుడు ఒక సహజసిద్ధ ఉపగ్రహంగా అవతరించాడు. ప్రతి సంవత్సరం భూమికి 3.8 సెంటీమీటర్లు దూరంగా జరుగుతున్న చంద్రుడు అనంత కాలగమనంలో ఏదో ఒకనాటికి పూర్తిగా స్థిరకక్ష్య నుండి దూరమైపోయి సూర్యుడిచుట్టూ పరిభ్రమించే ఒక స్వతంత్ర గ్రహంగా ఆవిర్భవించనున్నాడని శాస్త్రవేత్తలు అంచనావేశారు.

# ‘ఇందిరమ్మ ఇళ్లు’

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నెరవేరేవరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. హైదరాబాద్ పరిధిలో గజం రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల వరకు, ఎకరం రూ.300 కోట్లు పలికే అత్యంత విలువైన కోర్ ప్రాంతాలలో సైతం పేదలకు టవర్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ పథకం కింద నిర్మించే ఇళ్ల నుంచి వచ్చే ఏడాది లబ్ధిదారులతో బోనాలు ఎత్తిస్తామని ఆయన హామీనిచ్చారు.

**తొలి విడతలో 16 నియోజకవర్గాలు**

మొదటి దశలో క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాలను ఎంపిక చేసి, నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున మొత్తం 7,680 నుండి 8,000 ఫ్లాట్లను నిర్మిస్తామన్నారు. త్వరలోనే మరో 8 నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి ఈ పథకాన్ని విస్తరిస్తామని మంత్రి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గత పాలకులు హైదరాబాద్ నగరానికి 3035 కిలోమీటర్ల దూరంలో ఉపాధికి దూరంగా ఇళ్లను నిర్మించడం వల్ల పేదలు అక్కడకు వెళ్లలేకపోయారని మంత్రి పొంగులేటి విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం పేదలు నివసించే నియోజకవర్గాన్నే యూనిట్‌గా తీసుకుని ఇళ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. త్వరలోనే మధ్యతరగతి ప్రజలకు కూడా ఇళ్ల విషయంలో ఒక శుభవార్త అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు.

**ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటున్నాం : మంత్రులు**

ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ గుడిసెలు లేని తెలంగాణే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే అత్యంత పారదర్శకంగా ఇళ్ల కేటాయింపులు జరుపుతున్నామన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన హౌసింగ్ విభాగాన్ని తాము పునరుద్ధరించామని, ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా ఉచిత బస్సు, ఉచిత కరెంట్, రేషన్ కార్డులతో పాటు ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల హామీని కూడా నెరవేరుస్తున్నామని చెప్పారు. మంత్రి మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ హైదరాబాద్ కోర్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, శాసనసభ్యులు దానం నాగేందర్, మల్ రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేష్, ప్రకాష్ గౌడ్, శ్రీగణేష్, ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి, హౌసింగ్ ఎం.డి. వి.పి. గౌతమ్, కలెక్టర్, ప్రియాంక ఆల పాల్గొన్నారు.



**నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ**

క్యూర్ పరిధిలో ఫ్లాట్ల కోసం నేటి నుండి ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హులైన లబ్ధిదారులు మీసేవ, అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ (నెంబర్ : 8096958096) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.100 కాగా, ఈఎండి కింద రూ.10,000 టోకెన్ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ లాటరీలో ఇల్లు రాని పక్షంలో ఈ రూ.10 వేల మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే లబ్ధిదారునికి తిరిగి చెల్లిస్తుంది.

**పథకం విధివిధానాలు..**

**మొత్తం ఖర్చు – సబ్సిడి :** ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, ఇందులో రూ.5 లక్షలను ప్రభుత్వం సబ్సిడి (ఉచితంగా) రూపంలో అందిస్తుంది.

లబ్ధిదారుని వాటా : మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడు నాలుగు విడతల్లో ప్రభుత్వానికి చెల్లించాలి. (గతంలో కట్టిన రూ.10 వేల ఈఎండిని ఇందులో మినహాయిస్తారు).

**ఉచిత రిజిస్ట్రేషన్ :** సుమారు రూ.4060 లక్షల విలువైన 525 చదరపు అడుగుల స్థలాన్ని లబ్ధిదారులైన ఆడపడుచుల పేరిట ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తుంది.

**నిబంధనలు :** ఈ ఫ్లాట్లను 10 ఏళ్ల వరకు అమ్ముకోవడానికి లేదా అద్దెకు ఇవ్వడానికి వీల్లేదు. అయితే అత్యవసరాల కోసం బ్యాంకుల్లో రుణం పొందేందుకు తణఖా పెట్టుకోవచ్చు.

**ఫ్లాట్ వివరాలు :** ప్రతిపాదిత 525 చదరపు అడుగుల ఫ్లాట్‌లో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్ ఉంటాయి.

**అర్హతలు – ఎంపిక విధానం**

దరఖాస్తుదారుడి కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలి. క్యూర్ పరిధిలో దరఖాస్తుదారుడి పేరిట ఎలాంటి సొంత స్థలం కానీ, ఇల్లు కానీ ఉండకూడదు. కుటుంబం నుండి ఒకే దరఖాస్తును స్వీకరిస్తారు.

లబ్ధిదారుల ఎంపికలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు రిజర్వేషన్లు వర్తించనున్నాయి. రాజకీయాలకు అతీతంగా, పూర్తి పారదర్శకంగా 360 డిగ్రీల వడపోత అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. దరఖాస్తులు ఎక్కువగా వస్తే బహిరంగంగా లాటరీ (డ్రా) పద్ధతి ద్వారా ఇళ్లను కేటాయిస్తారు.

**తొలి విడతలో ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రాంతాలు..**

1. రాజేంద్రనగర్ : మైలార్‌దేవ్ పల్లి
2. మహేశ్వరం : జల్‌పల్లి
3. శేరిలింగంపల్లి : రాయదుర్గం
4. ఇబ్రహీంపట్నం : తట్టిఅన్నారం, బండ్లగూడ
5. మల్కాజిగిరి : కౌకూర్
6. నాంపల్లి : రెడ్‌హిల్స్, నీలోఫర్ ఆసుపత్రి సమీప పోలీస్ క్వార్టర్స్
7. ఖైరతాబాద్ : హకీంపేట్ దర్గా, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ
8. కార్వాన్ : కుల్సుంపురా సమీప పోలీస్ క్వార్టర్స్
9. బహదూర్‌పురా : నందిముసలిగూడ
10. అంబర్‌పేట్ : సిటీ పోలీస్ లైన్స్
11. కూకట్‌పల్లి : కెపిహెచ్‌బి కాలనీ
12. మేడ్చల్ : పోచారం ఎల్‌ఐజి కాలనీ
13. కుత్బుల్లాపూర్ : గాజులరామారం
14. సనత్ నగర్ : పాటిగడ్డ
15. సికింద్రాబాద్ కంటోన్మెంట్ : మారేడ్‌పల్లి మహేంద్రహిల్స్
16. మలక్‌పేట్ : గడ్డిఅన్నారం ఆర్ అండ్ బి క్వార్టర్స్.

## మారిన ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)

పట్టుకుని గుంపులుగా పార్లమెంటు వైపు వెళ్లే రహదారుల గుండా నినాదాలు చేస్తూ కవాతు చేయడంతో సెంట్రల్ ఢిల్లీ జనసముద్రంగా మారిపోయింది. రాత్రంతా రైలు, బస్సుల్లో ప్రయాణించి వచ్చిన చాలామంది వీపున బ్యాక్ ప్యాక్‌లు మోయగా, నగరాన్ని వర్షం ముంచెత్తుతున్నా మరికొందరు గొడుగులతో నడిచారు. వారి చుట్టూ, అల్లర్ల నిరోధక దుస్తులు ధరించిన పోలీసులు రహదారుల వెంబడి బారులు తీరారు, నిరసనకారులను అదుపులోకి తీసుకోవడానికి బస్సులు సిద్ధంగా ఉంచారు. పార్లమెంటుకు వెళ్లే ప్రతి మార్గాన్ని పొడవైన బారికేడ్ల వరుసలు అడ్డుకున్నాయి. నిరసనకారులు పార్లమెంటు వైపు కదులుతుండగా, ఢిల్లీ పోలీసులు పలుచోట్ల బహుళ అంచెల బారికేడ్లను ఉపయోగించి వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. నిరసనకారులు బారికేడ్లను ఛేదించుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో, పార్లమెంట్ స్ట్రీట్, పటేల్ చౌక్, రైల్ భవన్, ఇతర ప్రాంతాల సమీపంలో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి, లాఠీఛార్జ్‌కు పాల్పడ్డారు. ఈ ఘర్షణల్లో పోలీసు సిబ్బంది, నిరసనకారులు ఇద్దరూ గాయపడగా, సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. జూన్ 20 నుంచి సిజెపి ధర్నా చేస్తున్న జంతర్ మంతర్ నుంచి ఈ యాత్ర ప్రారంభమైంది. పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, వయోవృద్ధులు పాల్గొన్నారు. కొందరు పిల్లలు పాఠశాల యూనిఫాంలో రాగా, మరికొందరు బొద్దింకల వేషధారణలో వచ్చారు. ప్రధాన రహదారులను మూసివేసిన తర్వాత పార్లమెంట్‌కు చేరుకునేందుకు చాలా మంది నిరసనకారులు పోలీసు బారికేడ్లను తప్పించుకోవడానికి, షార్ట్‌కట్‌ల కోసం ఇరుకైన సందులను ఎంచుకున్నారు. పరిస్థితి తీవ్రమవుతున్న కొద్దీ, రిజర్వ్‌లో ఉంచిన అనేక పారామిలిటరీ బలగాల కంపెనీలను కూడా రంగంలోకి దించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఐదు స్టేషన్లను మూసివేయడంతో ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్లలో గందరగోళం నెలకొంది. దీంతో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోగా, చాలా మంది నిరసనకారులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోయారు. రాజధానిలోని అత్యంత రద్దీగా ఉండే ఇంటర్‌చేంజ్ స్టేషన్లలో ఒకటైన రాజీవ్ చౌక్‌లో, మూసివేసిన ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద ప్రయాణికులు గుమిగూడటం కనిపించింది. పటేల్ చౌక్ స్టేషన్‌లో, జంతర్ మంతర్ వద్ద ఉన్న సిజెపి నిరసన ప్రదేశానికి వెళ్తున్న వారిని చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది లాఠీచార్జ్ చేశారు. ప్రవేశ మార్గాలను మూసివేసిన తర్వాత, పలువురు ప్రయాణికులు బారికేడ్లు, తాళం వేసిన గేట్లను దాటి స్టేషన్ నుండి బయటకు వెళ్తున్న వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నాయి. నిరసనకారులు మండి హౌస్, రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ల లోపల గుమిగూడి ‘భారత్ మాతా కీ జై‘, ‘వందే మాతరం‘ నినాదాలు చేశారు. రాజీవ్ చౌక్ వద్ద వందలాది మంది ప్రజలు గుమిగూడి, చప్పట్లు కొడుతూ, దేశభక్తి నినాదాలు చేశారు.

### పోలీసుల అదుపులో అభిజీత్ దీప్కే

పరీక్ష పత్రాల లీకేజీలతో మొదలై, కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షతో ఊపందుకున్న ఈ నిరసన తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో వారిపై పోలీసులు బాష్పవాయువు, లాఠీఛార్జీలు ప్రయోగించారు. నిరసనలు ఊపందుకోవడంతో సెంట్రల్ ఢిల్లీలోని చాలా ప్రాంతాలు స్తంభించిపోయాయి. సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. శాంతియుత నిరసనకారులపై పోలీసులు క్రూరంగా అణచివేస్తూ, కొడుతున్నాని, వీధుల్లోని విద్యార్థులకు మద్దతుగా నిలవాలని ఎంపిలను కోరుతున్నానని సౌరవ్ దాస్ అన్నారు. కొన్ని కిలోమీటర్ల దూరంలో, సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేరిన కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, తాను చాలా బాగున్నానని, తన ఆరోగ్య సూచికలు సాధారణంగా ఉన్నాయని పేర్కొంటూ, సిజెపి పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనడానికి తాత్కాలికంగానైనా తనను వెళ్లనివ్వాలని వైద్య సూపరింటెండెంట్‌ను అభ్యర్థించారు. వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించినప్పటి నుండి నిరాహార దీక్ష చేస్తున్న సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే మాట్లాడుతూ, ‘మా డిమాండ్లు స్పష్టం: ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆత్మహత్య చేసుకున్న పిల్లల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందాలి, మరియు సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలి’ అని అన్నారు.

### ప్రధాన్‌తో అమిత్ షా భేటీ

పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపై ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిజెపి ఇచ్చిన నిరసన పిలుపులో భాగంగా వేలాది మంది పార్లమెంటు వైపు పాదయాత్రకు ప్రయత్నించిన నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని తన కార్యాలయంలో ప్రధాన్, షాను కలిసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఏమి జరిగిందో వెంటనే తెలియరాలేదు.

## స్తంభించిన పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడింది. అంతరాయాల నేపథ్యంలో సభలు ఆరుసార్లు తిరిగి సమావేశమైన తర్వాత, మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మరుసటి రోజుకు వాయిదా వేశారు. అంతకుముందు, లోక్‌సభ కార్యవిధాన నియమాలలోని రూల్ 377 ప్రకారం ప్రజా ప్రాముఖ్యత గల అంశాలను చేపట్టేందుకు సభకు అనుమతించాలని అధ్యక్షత వహించిన జగదంబిక పాల్ విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రతిపక్ష ఎంపిలు తమ నిరసనను కొనసాగించడంతో, మధ్యాహ్నం 2.30 గంటలకు సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు, సభా కార్యకలాపాలు నిర్వహించడానికి తగినంత మంది సభ్యులు ఉన్నారని పాల్ చెప్పినప్పటికీ, కొంతమంది ప్రతిపక్ష ఎంపిలు తమను సభలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ అంతరాయాలు కొనసాగితే సభ సజావుగా పనిచేయలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైన వెంటనే, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో, ప్రశ్నోత్తరాల సమయం జరుగుతుండగా స్పీకర్ ఓం బిర్లా సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేయవలసి వచ్చింది. ఆరుగురు మాజీ ఎంపిల మృతిపై సంతాప తీర్మానాలను చదువుతున్నప్పుడు ఇద్దరు సభ్యులు నినాదాలు చేయడాన్ని బిర్లా అభ్యంతరం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగడంతో సభను మధ్యాహ్నం 12:30 గంటల వరకు వాయిదా వేశారు. కార్యకలాపాలు వాయిదా పడటానికి ముందు, భారత ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుండి 38కి పెంచిన ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లును న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అయితే మధ్యాహ్నం 12:30 గంటలకు కూడా సభలో అంతరాయమే కనిపించింది. జీరో అవర్‌ను చేపట్టాలని సభాపతి పదేపదే చేసిన విజ్ఞప్తులకు ప్రతిపక్ష సభ్యుల నుండి సానుకూల స్పందన రాలేదు. సభాపతిగా ఉన్న దిలీప్ సైకియా, కార్యకలాపాలను మధ్యాహ్నం 1 గంట వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 1 గంటకు సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్షాల నిరసనలు కొనసాగాయి. సభాపతిగా ఉన్న సైకియా, ప్రతిపక్ష సభ్యులను వారి వారి స్థానాలకు తిరిగి వెళ్లి కార్యకలాపాలలో పాల్గొనాలని కోరారు. ‘మీరు పదేపదే సభకు అంతరాయం కలిగిస్తున్నారు. బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శించడం ఆమోదయోగ్యం కాదు’ అని ఆయన అన్నారు. ప్రతిపక్షం ఆయన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో, సైకియా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

### రాజ్యసభలోనూ విపక్షాల ఆందోళనలు

మరోవైపు వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో దోషులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో రాజ్యసభను మంగళవారానికి వాయిదా వేశారు. సభ నిబంధనలను గౌరవించాలని తాను పదేపదే చేసిన విజ్ఞప్తి ఫలించకపోవడంతో సభను వాయిదా వేసినట్లు డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తెలిపారు. రాజ్యసభ ఉదయం ప్రారంభం కాగానే పేపర్ల సమర్పణ, ఆ తర్వాత కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, సంతాప తీర్మానాల అనంతరం సభను మొదట వాయిదా వేశారు. పేపర్ల సమర్పణ అనంతరం, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే నీట్‌యుజి 2026 పేపర్ లీక్‌పై మాట్లాడుతూ ఈ సమస్య లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినదని అన్నారు. వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ (నిరసన జరుగుతున్న ప్రదేశానికి) చేరుకున్నారని, వారిపై లాఠీఛార్జ్ చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం వారిని అణచివేసి, ఈ సమస్యను అణగదొక్కడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ సమయంలో ప్రతిపక్ష సభ్యులు ‘సిగ్గు, సిగ్గు‘ అని నినాదాలు చేశారు. ఈ గందరగోళం మధ్య, ఛైర్మన్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. సభ కార్యకలాపాలను రెండోసారి మధ్యాహ్నం 12.30 గంటకు, ఆ తర్వాత సభను మధ్యాహ్నం 12.50 గంటకు, మళ్లీ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12.50 గంటలకు సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు నిరసన చేస్తున్న విద్యార్థులకు, వారిపై పోలీసులు తీసుకున్న చర్యకు అనుకూలంగా నినాదాలు కొనసాగించారు. వారు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఉన్న రామ మందిరంలో విరాళాల దొంగతనానికి వ్యతిరేకంగా కూడా నినాదాలు చేశారు. నినాదాలు కొనసాగుతుండటంతో, రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, సోమవారం జరిగిన సమావేశంలో ప్రభుత్వ శాసన వ్యవహారాలకు సమయాన్ని కేటాయించిన వ్యాపార సలహా కమిటీ నిర్ణయం గురించి డిప్యూటీ ఛైర్మన్ సభ్యులకు తెలియజేశారు. ప్రతిపక్ష సభ్యులు నినా సభ్యులు తమ పట్టు వీడకపోవడంతో సభను మధ్యాహ్నం 2:30 గంటల వరకు అరగంట పాటు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2:30 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, డిప్యూటీ స్పీకర్ ప్రతిపక్ష సభ్యులను శాంతింపజేయడానికి ప్రయత్నిస్తూ, వారు తమ స్థానాలకు తిరిగి వెళ్లి సభ సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. అయితే ప్రతిపక్షం ఆయన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో, హరివంశ్ సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు.

# ఫుట్‌బాల్ విశ్వవిజేత స్పెయిన్

ప్రపంచ ఫుట్‌బాల్ మహా సమరంలో స్పెయిన్ మొనగాళ్లే రారాజులుగా నిలిచారు. అద్వితీయ ప్రదర్శనతో ఆకట్టుకున్న స్పానిష్ టీమ్ 16 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత రెండోసారి జగజ్జేతగా అవతరించింది. కోట్లాది మంది అభిమానులు ఉత్కంఠతో ఊపిరి బిగబట్టి చూసిన ఫైనల్ పోరులో స్పెయిన్ జట్టు తిరుగులేని ఆటతో ప్రత్యర్థిని ముంచెత్తింది. మైదానంలో ప్రతి అంగుళాన్ని తమ అద్భుతమైన పాస్‌లతో శాసిస్తూ, భీకర దాడులతో అర్జెంటీనా రక్షణ శ్రేణిని ముక్కలు చేసింది. హోరాహోరీ తప్పదనుకున్న సాకర్ కురుక్షేత్రాన్ని పూర్తిగా ఏకపక్షం చేసింది. మెస్సీ నాయకత్వంలోని ఫార్వర్డ్స్ పూర్తిగా తేలిపోయిన వేళ నిర్ణీత 90 నిమిషాల పాటు అర్జెంటీనా కీపర్ ఎమిలియానో అడ్డుగా నిలిచినా, ఎక్స్‌ట్రా టైమ్‌లో సాగిన స్పెయిన్ దండయాత్రను ఆపలేకపోయాడు. 106వ నిమిషంలో ఫెర్రన్ టోరెస్ కొట్టిన బుల్లెట్ లాంటి గోల్‌తో అర్జెంటీనా కోట బద్దలైంది. ఈ చరిత్రాత్మక విజయంతో పురుషుల, మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్ టైటిళ్లను ఒకేసారి కైవసం చేసుకున్న తొలి దేశంగా స్పెయిన్ సాకర్ చరిత్రను తిరగరాసింది. మరో కప్పు నెగ్గి కెరీర్‌ను ఘనంగా ముగించాలని ఆశించిన మెస్సీ కన్నీళ్లతో తన పోరాటం ముగించాడు.



క్రీడా ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన ఫిఫా సాకర్ మహా సంగ్రామంలో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాపై యూరోపియన్ కింగ్ స్పెయిన్‌దే పైచేయి అయింది. మెగా టోర్నీలో స్పానిష్ టీమ్ రెండోసారి విజేతగా నిలిచింది. ఆఖర్లో అద్భుతాలు నమోదు చేస్తూ వరుసగా రెండోసారి ఫైనల్‌కు వచ్చిన అర్జెంటీనాను స్పానిష్ టీమ్ అడ్డుకుంది. మెస్సీ మ్యాజిక్ చేయకుండా నిలువరించింది. అసలు ఆ జట్టుకు గోల్ కొట్టే అవకాశమే రాకుండా చేసి.. చరిత్ర సృష్టించింది. 80 వేల మంది ప్రేక్షకులతో కిక్కిరిసిన మెట్‌లైఫ్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి మొదలై తెల్లవారుజాము వరకూ సాగిన ఫైనల్లో స్పానిష్ టీమ్ 1–0తో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాను ఓడించింది. 2010లో తొలిసారి కప్పు నెగ్గిన ఆ జట్టు మళ్లీ ఇన్నేండ్ల తర్వాత రెండో ట్రోఫీని అందుకుంది. ఈమ్యాచ్‌లో స్పెయిన్ ఎంతలా ఆధిపత్యం చెలాయించిందంటే.. ఒక దశలో స్పెయిన్ 16 షాట్లు కొట్టగా, అర్జెంటీనా కనీసం ఒక్క షాట్ కూడా టార్గెట్ వైపు కొట్టలేకపోయింది. స్పానిష్ టీమ్ టార్గెట్‌పై 11 సహా మొత్తంగా 20షాట్లు కొడితే అర్జెంటీనా కేవలం రెండే షాట్లు అది కూడా చివర్లో కొట్టగలిగింది.

**చప్పగా మొదలై...** రెండు మేటి జట్ల మధ్య ఆఖరాట తొలుత చప్పగా సాగింది. ఫస్ట్ ఆఫ్ స్పెయిన్ జట్టు బంతిపై పూర్తి నియంత్రణ ప్రదర్శించింది. అర్జెంటీనా కంటే రెట్టింపు పాస్‌లు పూర్తి చేస్తూ వరుస దాడులతో ఒత్తిడి పెంచింది. అయితే, మెస్సీ సేన డిఫెన్స్ లైన్ అంతే ధీటుగా స్పందించి స్పెయిన్ దాడులను తిప్పికొట్టింది. ఐదో నిమిషంలో స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్ రైట్ ఫ్లాంక్‌లో బంతిని అందుకొని టార్గెట్‌పై దాడి చేసినా.. గోల్ కొట్టలేకపోయాడు. ఆ వెంటనే మెస్సీసేన సైతం కౌంటర్ ఎటాక్ ప్రారంభించింది. ఓ దశలో మెస్సీ బంతిని ప్రత్యర్థి బాక్స్ వద్దకు తీసుకెళ్లినా.. స్పెయిన్ కీపర్ చాకచక్యంగా అడ్డుకున్నాడు.

**స్పెయిన్ షాట్స్.. మార్టినెజ్ సేవ్స్..** సెకండాఫ్ మొదలైన వెంటనే స్పెయిన్ పూర్తిగా ఎటాకింగ్ మోడ్లోకి వెళ్లింది. బంతిని అర్జెంటీనా బాక్సోనే ఉంచిన రొడ్రి నేతృత్వంలోని ఆ జట్టు ఫార్వర్డ్స్ వరుస దాడులతో హోరెత్తించారు. కానీ, అర్జెంటీనా గోల్ కీపర్ మార్టినెజ్ అడ్డుగోడల నిలబడటంతో ఆజట్టు ప్రయత్నాలు ఫలించలేదు. విరామం నుంచి వచ్చిన వెంటనే స్పెయిన్ ఆటగాడు బేనా బాక్స్ వెలుపల నుంచి కొట్టిన ప్రమాదకర షాట్తో పాటు 64వ నిమిషంలో ఓల్మో షాట్, 67వ నిమిషంలో యామల్ క్రాస్ను టోర్రెస్ హెడర్ ద్వారా గోల్ కొట్టే ప్రయత్నాన్ని నిలువరించాడు. ఇక, 77వ నిమిషంలో స్పెయిన్ ఒక్కసారిగా దాడుల మోత మోగించింది. పెడ్రి, యమామల్, కుబార్సి వేసిన వరుస షాట్లు కొట్టినా అవి మార్టినెజ్ పెట్టని గోడను దాటలేదు. స్పెయిన్ దాడులను నిలువరించడంలో మునిగిన మెస్సీసేన గోల్ కోసం కనీస ప్రయత్నం కూడా చేయలేకపోయింది.

**ఎంజోకు రెడ్ కార్డ్...** నిర్ణీత సమయంలో టార్గెట్ ఒక్క షాట్ కూడా కొట్టలేకపోయినా అర్జెంటీనాకు ఇంజూరీ టైమ్లో షాక్ తగిలింది. స్పెయిన్ ప్లేయర్ కుబార్సిని ఫౌల్ చేసిన ఎంజో ఫెర్నాండెజ్కు రిఫరీ రెండో ఎల్లో కార్డు చూపించాడు. ఫలితంగా అతడు రెడ్ కార్డ్ అందుకుని మైదానాన్ని వీడాడు. దాంతో డిఫెండింగ్ చాంపియన్ పది మందితోనే ఆడాల్సి వచ్చింది. ఈ తరుణంలో ఫెర్రన్ టోర్రెస్ను పారడెస్ ఫౌల్ చేయడంతో స్పెయిన్కు డీ బాక్స్ వెలుపల ఫ్రీ కిక్ రూపంలో మరో అద్భుత అవకాశం లభించింది. దీనికి స్పానిష్ వండర్ కిడ్ యమాల్ గోల్ పోస్ట్‌కు కుడి అంచువైపు కొట్టినా..అర్జెంటీనా కీపర్ మార్టినెజ్ ఊహించని రీతిలో డైవ్ చేసి బంతిని ఆపాడు. ఇరు జట్లు నిర్ణీత సమయంలో గోల్ చేయకపోవడంతో విజేత ఎవరో తేలడానికి మ్యాచ్ ఎక్స్‌ట్రా టైమ్‌కు చేరింది.

**టోరెస్ విన్నింగ్ గోల్...** ఎక్స్‌ట్రా టైమ్ మొదలైన వెంటనే స్పెయిన్ ఆటగాడు నికో విలియమ్స్ (96వ నిమిషంలో) బంతిని గోల్ పోస్ట్లోకి పంపి సంబరాల్లో మునిగిపోయాడు. అయితే, గోల్ ప్రయత్నంలో స్పానిష్ ప్లేయర్ మైకెల్ మెరినో.. అర్జెంటీనా డిఫెండర్ నికోలస్ ఒటామెండి కాలిని తొక్కి ఫౌల్ చేసినట్టు గుర్తించిన రిఫరీ ఆ గోల్‌ను నిరాకరించడంతో స్పెయిన్ ఆటగాళ్లు నిరుత్సాహపడ్డారు. కానీ, ఎక్స్‌ట్రా టైమ్‌లో బ్రేక్ నుంచి వచ్చిన వెంటనే స్పెయిన్ సంచలన గోల్ సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 106వ నిమిషంలో నికో విలియమ్స్ ఎడమవైపు నుంచి అర్జెంటీనా డిఫెన్స్‌ను ఛేదిస్తూ ఒక అద్భుతమైన క్రాస్ అందించాడు.దాన్ని అందుకున్న ఫెర్రన్ టోరెస్ ఏమాత్రం తడబడకుండా అర్జెంటీనా కీపర్ మార్టినెజ్, ముగ్గురు డిఫెండర్లను ఛేదిస్తూ బంతిని నెట్లోకి పంపాడు. దీంతో స్పెయిన్ 1–0తో ముందంజ వేసింది.

**ఎంబాపెదే గోల్డెన్ బూట్...** టోర్నీ ఆసాంతం రాణించిన ఎంబాపెనే గోల్డెన్ బూట్ (అత్యధిక గోల్స్ చేసినవారికి ఇచ్చే అవార్డు) వరించింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో అతడు రెండుగోల్స్ చేయడంతో టోర్నీలో అతడి గోల్స్ సంఖ్య 10కు చేరడంతో గోల్డెన్ బూట్ దక్కించుకున్నాడు.

## యువతరంగం

# సమాజం వినాల్సిన నిశ్శబ్ద కేక

ప్రభుత్వ ఉద్యోగం కోసం దాదాపు యాభై సార్లు పరీక్షలు రాసినా విజయం దక్కలేదు. తండ్రి ఆశలను నిలబెట్టలేకపోయాననే బాధతో 'క్షమించండి నాన్నా... నేను ప్రయత్నించాను' అనే ఐదు పంక్తుల లేఖ రాసి, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన 23 ఏళ్ల బిటెక్ గోల్డ్ మెడలిస్ట్ ఆనంద్ కుమార్ తన జీవితాన్నే ముగించుకున్న ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించిన ప్రతిభావంతుడైన యువకుడు కూడా ఉద్యోగం దొరకక తీవ్ర మానసిక ఒత్తిడికి గురై చివరకు ఆత్మహత్యను ఎంచుకోవడం కేవలం ఒక కుటుంబ విషాదం మాత్రమే కాదు... దేశ యువత ఎదుర్కొంటున్న తీవ్రమైన సామాజిక, ఆర్థిక, మానసిక సంక్షోభానికి ప్రతీక. ఈ ఘటనలో బాధ కలిగించేది అతని మరణం మాత్రమే కాదు. 'నేను ప్రయత్నించాను' అనే చివరి మాటలు. ఓ కుమారుడు తన వైఫల్యానికి తండ్రికి క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఈ ప్రశ్నకు సమాధానం అందరూ వెతకాల్సిందే. ప్రభుత్వం, సమాజం, విద్యా వ్యవస్థ, తల్లిదండ్రులు, మన మందరం స్పందించాలి.

**ప్రభుత్వ ఉద్యోగమే జీవితమా?**

దేశంలో ప్రభుత్వ ఉద్యోగానికి ఉన్న గౌరవం, ఉద్యోగ భద్రత, స్థిరమైన వేతనం, సామాజిక గుర్తింపు కారణంగా లక్షలాది మంది యువత అదే లక్ష్యంగా సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్నారు. ఒక పోస్టుకు లక్షల మంది పోటీ పడుతున్న పరిస్థితి ఏర్పడింది. కొద్దిమంది మాత్రమే ఎంపిక అవుతారు. మిగిలిన వారిలో చాలామంది తమను తాము వైఫల్యంగా భావించడం ప్రారంభిస్తారు. దీనికి మరో కారణం కుటుంబాల అంచనాలు. చిన్నప్పటి నుంచే 'ప్రభుత్వ ఉద్యోగమే జీవిత విజయానికి గుర్తు' అనే భావన పిల్లల మనసుల్లో నాటబడుతోంది. ఇంజినీరింగ్, వైద్యం, మేనేజ్‌మెంట్ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చివరకు ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితమవుతున్నారు. ప్రైవేట్ రంగంలో అవకాశాలు ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రతపై ఉన్న సందేహాలు, తక్కువ వేతనాలు, అస్థిరత కారణంగా చాలామంది వాటిని అంగీకరించడానికి ఇష్టపడడం లేదు. ఫలితంగా నిరంతర పోటీ, నిరాశ, ఒత్తిడి పెరుగుతున్నాయి.

**స్పందన అనవసరం**

ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వాలు కేవలం సంతాపం ప్రకటించడం సరిపోదు. ఉపాధి వ్యవస్థలో సమగ్ర మార్పులు అవసరం. మొదటిగా, ప్రభుత్వ ఖాళీలను సంవత్సరాల తరబడి ఖాళీగా ఉంచకుండా నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం భర్తీ చేయాలి. పరీక్షల ప్రకటన నుంచి నియామకం వరకు జరిగే ఆలస్యాలను తగ్గించాలి. ఒక పరీక్ష కోసం రెండేళ్లు, మూడేళ్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి యువతలో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. రెండవది, ప్రభుత్వ ఉద్యోగాలపై మాత్రమే ఆధారపడకుండా ప్రైవేట్ రంగంలో నాణ్యమైన ఉపాధి అవకాశాలను పెంచే విధానాలు అమలు చేయాలి. పరిశ్రమలు, స్టార్టప్‌లు, తయారీ రంగం, గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి చెందితే లక్షలాది కొత్త ఉద్యోగాలు సృష్టించవచ్చు. మూడవది, ప్రతి జిల్లాలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఉచిత మానసిక ఆరోగ్య సలహా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. పరీక్షల్లో విఫలమవడం జీవిత వైఫల్యం కాదని చెప్పే కౌన్సెలింగ్‌ను విద్యార్థులకు అందించాలి. నాలుగవది, ఉన్నత విద్యాసంస్థల్లో కెరీర్ గైడెన్స్‌ను తప్పనిసరి చేయాలి. ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే అందుబాటులో ఉన్న ఇతర కెరీర్ అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల గురించి విద్యార్థులకు ముందుగానే అవగాహన కల్పించాలి.





**సమాజం, కుటుంబం కూడా బాధ్యత వహించాలి**

ఈ సమస్యకు ప్రభుత్వం ఒక్కటే బాధ్యురాలు కాదు. సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి. ఒక వ్యక్తి విలువను ఉద్యోగంతో కొలవడం మానుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన వారినే గొప్పవారిగా చూడడం, మిగిలిన వారిని తక్కువగా అంచనా వేయడం వంటి మనస్తత్వం మారాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలపై అధిక ఒత్తిడి పెట్టకూడదు. 'నువ్వు విజయం సాధించాలి' అనే ప్రోత్సాహం అవసరం. కానీ 'ఇది సాధించకపోతే జీవితమే వ్యర్థం' అనే భావన ప్రమాదకరం. పిల్లల మానసిక స్థితిని గమనిస్తూ వారితో తరచూ మాట్లాడాలి. వారి బాధలను వినాలి. అపజయాలను అంగీకరించే ధైర్యాన్ని నేర్పాలి. విద్యాసంస్థలు కూడా మార్కులు, ర్యాంకులు మాత్రమే కాకుండా భావోద్వేగ పరిపక్వత, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం, జీవన నైపుణ్యాలను బోధించాలి. పోటీ పరీక్షల్లో పదేపదే విఫలమవుతున్న విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారికి కౌన్సెలింగ్ అందించాలి. అలాగే మీడియా, సామాజిక మాధ్యమాలు కూడా విజయ కథలతో పాటు అపజయాన్ని అధిగమించిన వారి జీవితాలను ఎక్కువగా పరిచయం చేయాలి. 'ఒక పరీక్షలో విఫలమైతే జీవితం ముగిసిపోదు' అనే సందేశాన్ని సమాజంలో బలంగా తీసుకెళ్లాలి.

**ఉద్యోగం కంటే జీవితం విలువైనది**

కాన్పూర్ యువకుడు ఆనంద్ తన చివరి లేఖలో 'క్షమించండి నాన్నా... నేను ప్రయత్నించాను' అని రాశాడు. నిజానికి అతను క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రయత్నించిన వ్యక్తి ఎప్పుడూ ఓడిపోయినవాడు కాదు. కానీ అతను తన జీవిత విలువను ఒక ప్రభుత్వ ఉద్యోగంతో సమానంగా భావించే పరిస్థితికి చేరుకున్నాడు. అదే మన సమాజం ఎదుర్కొంటున్న అసలు విషాదం. ప్రతి యువకుడు, ప్రతి తల్లి తండ్రి, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి పాలకుడు ఈ ఘటనను ఒక హెచ్చరికగా తీసుకోవాలి. ఉద్యోగం అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే; జీవితం అంతా కాదు. విజయం అనేక రూపాల్లో వస్తుంది. అపజయం అంతిమ గమ్యం కాదు. కష్టకాలంలో సహాయం కోరడం బలహీనత అనుకోవడం తప్పు. నిజానికి సాయం కోరడం పరిపక్వతకు చిహ్నం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ఉపాధి అవకాశాల విస్తరణ, పారదర్శక నియామక వ్యవస్థ, మానసిక ఆరోగ్య సేవలు, కుటుంబాల ప్రోత్సాహం, సమాజ దృక్పథంలో మార్పు వంటి అంశాలు కలిసి పనిచేయాలి. ఒక యువకుడి చివరి లేఖను మరో యువకుడి చివరి మాటగా మారనివ్వకుండా చూడడం మనందరి సామూహిక బాధ్యత.

# 'మధ్యాహ్న' కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్



**ప్రజాపక్షం/ములుగు :** మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అల్పాహార పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించకుండా వంట కార్మికులతోనే కొనసాగించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జంపాల రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో వంట కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. అల్పాహార పథకాన్ని అక్షయ పాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే వేలాది మంది వంట కార్మికులు ఉపాధి కోల్పోయి ప్రమాదం ఉందన్నారు. కోడిగుడ్ల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తున్న రూ.6 సరిపోవడం లేదని, కోడిగుడ్లు, గ్యాస్, ఇతర నిత్యావసర సరుకులను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని కోరారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించి అల్పాహార పథకాన్ని వంట కార్మికుల ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, మాతంగి శ్యాంసుందర్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి, పోరెడ్డి ప్రమీల, గున్నాల రాజకుమారి, సామ సమ్మక్క, కుడుముల సమ్మక్క, అంకం పద్మ, జనగాం శోభ, అల్లి అమృతతో పాటు పలువురు వంట కార్మికులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు జీతాలివ్వాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్




**ప్రజాపక్షం/నర్సంపేట :** హమాలీ కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సివిల్ సప్లై హమాలీ కార్మికుల యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు దేవన బోయిన రాంబాబు ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు వేతనాలు ప్రతినెల సమయపాలన పాటిస్తూ చెల్లించాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని సివిల్ సప్లై గోదాములలో హమాలీ కార్మికులకు మూడు నెలలుగా జీతాల జాప్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రతినెల కార్మికుల అకౌంట్లో జీతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జలగం బిక్షపతి, ముద్రబోయిన మహేందర్, కందిక చెన్నకేశవులు, గోవర్ధన్ మియాపురం, దేవన బోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో బిజెపిది నియంతృత్వ పాలన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాస్తుందని, నీట్ పేపర్ లీకేజీపై దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఆందోళన జరుగుతుంటే ప్రధాని మోదీ నియంతలా వ్యవహరిస్తూ కళ్ళుండి చూడలేని కాబోధిలా దుర్మార్గంగా పరిపాలిస్తున్నాడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సోమవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యుడు పిట్టల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైె చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోదీ పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ పరిపాలన కొనసాగిస్తున్నాడన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారి సంక్షేమానికి కొమ్ముకాస్తున్నాడన్నారు. విచ్చలవిడిగా దేశ సంపదను, వనరులను కొల్లగొడుతూ, పేదల సంక్షేమాన్ని విస్మరించి వారిని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా బిజెపి ప్రభుత్వం అధికారం చెలాయిస్తుందన్నారు. అవినీతి పరులకు, అక్రమార్కులకు అండగా నిలవడమే కాకుండా వారిని అక్కున చేర్చుకోవడం హేయమైన చర్య అని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారం వేస్తుందని, గ్రామీణ ప్రజల బతుకులకు వరప్రసాదం లాంటి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి గార్చేందుకే మహాత్మా గాంధీ పేరు తొలగించిందని, రాష్ట్రాలపై భారం వేసిందని ఇలా అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న బిజెపి విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్ట్ నెలలో పాదయాత్రలు నిర్వహిస్తామని, సెప్టెంబర్‌లో ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చినట్లు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. దేశంలోని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ నీట్ పేపర్ లీక్ చేసిన దోషులను శిక్షించలేదని, నైతిక బాధ్యత వహించి సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేయలేదని, లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులను శిక్షించాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఆందోళన కారులపై లాఠీచార్జీ చేయడం, బాష్పావాయువు ప్రయోగించడం దుర్మార్గపు చర్య... అని దీనిని సిపిఐ ఖండిస్తుందని, విద్యార్థులతో, నిరుద్యోగులతో చెలగాటం ఆడితే ప్రభుత్వం కుప్పకూలక తప్పదని వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కూలీలకు సంక్షేమ బోర్డు

సుతారి రాములు డిమాండ్

**ప్రజాపక్షం/ధర్మపురి :** హమాలీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్మపురి సివిల్ సప్లై గోదాములో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సాదారణ సమావేశం మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ముక్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కూలీ రేట్లు సవరించి అమ లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కా ర్యక్రమంలో ముడుగం రాజలింగం, కొడారి శం కర్, గుర్రం నరేష్, ఎస్.రాజు, కుడుకల శంకర్, జి.తిరుపతి, ఎం.అనిల్, జి.రమేష్, ఎం.రాజశేఖర్, సాయిబాబా పాల్గొన్నారు.




# విద్యార్థులకు కేంద్రప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రీ, సిపిఐ జిల్లా కార్యదర్శి సదానందం డిమాండ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ వలివుల్లా ఖాద్రీ, సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారత యువజన సమాఖ్య పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభలు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆరేపల్లి మానస్ కుమార్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చలో పార్లమెంట్ కార్యక్రమంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు జరిపిన అమానుష లాఠీచార్జీ, అక్రమ నిర్బంధాలు, దమనకాండను తీవ్రంగా ఖండించారు. తమ రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకుంటూ నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను అడ్డుకునేందుకు 7 అడుగుల ఇనుప బ్యారికేడ్లను వెల్డింగ్ చేయడం, మెట్రో స్టేషన్లను విద్యార్థులు లోపల ఉండగానే మూసివేయడం, వేలాది మంది పోలీసు బలగాలను మోహరించడం, విద్యార్థులను ఈడ్చుకెళ్లి బలవంతంగా అదుపులోకి తీసుకోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం పోలీసు లాఠీలతో స్పందించడం మోదీ ప్రభుత్వ నిరంకుశ, ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఎన్‌టిఎలో చోటుచేసుకున్న అవినీతి, వరుస పరీక్షా కుంభకోణాలు, పారదర్శకత లోపం కారణంగా దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని, ఈ కుంభకోణాల నేపథ్యంలో ఇప్పటికే 17 మంది యువ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా, కేంద్ర ప్రభుత్వం వారి కుటుంబాల ఆవేదనను, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉన్నప్పటికీ, దీనికి రాజకీయ బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించకుండా కాపాడేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు అని, ఆ హక్కును కాలరాసే ప్రతి చర్యను ఎఐవైఎఫ్ ప్రతిఘటిస్తుందన్నారు. విద్యార్థి–యువజన ఉద్యమాలకు ఎఐవైఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే విద్యార్థులపై నమోదు చేసిన అన్ని కేసులను బేషరతుగా ఎత్తివేసి, అక్రమంగా నిర్బంధించిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని, లాఠీచార్జీకి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య, మాచర్ల అంజి, తాళ్లపల్లి సురేందర్, ఆసాల నవీన్, రాణవేణి సుధీర్‌కుమార్, కల్లేపల్లి నవీన్, చంద్రగిరి ఉదయ్, సాదుల శివ, ఖాజా ,శివ, తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఆందోళన చేపట్టక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్పష్టం చేశారు. సిపిఐ నగర కమిటీ సమావేశం సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. వరదా నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, పేదలకు నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంలో వివక్ష నెలకొన్నదన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదలు సరైన ఉపాధి అవకాశాలు లేక నివాస స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ పేదలను సమీకరించి సమస్యల పరిష్కారానికి సిపిఐ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ రెండున్నర ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఆ పని చేయలేదని సురేష్ తెలిపారు. సంక్షేమ పథకాల అమలు కూడా సరైన రీతిలో జరగడం లేదని పింఛన్ల పెంపుతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ పిలుపు మేరకు ఆగస్టు ఆరు నుంచి 15 వరకు జిల్లాలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఐదు నియోజక వర్గాల పరిధిలో పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని దండి సురేష్ తెలిపారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, ఎస్‌కె సైదా, జాకీర్, పి. మోహన్‌రావు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.





# మేకల రాములు త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయ్

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : ప్రజా ఉద్యమాలకు జీవితాంతం అంకిత భావంతో సేవలు అందించిన కామ్రేడ్ మేకల రాములు త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పేర్కొన్నారు. పేద ప్రజలు రైతుల కోసం గీత కార్మికుల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడిగా మేకల రాములు నిలిచిపోయారని కొనియాడారు. సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకుడు మేకల రాములు సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవిత లక్ష్యంగా భావించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహించిన వ్యక్తి మేకల రాములు అని తెలిపారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మేకల రాములు భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు ఉద్యమ స్ఫూర్తి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అంతిమయాత్రలో సైతం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కె.శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి.జగన్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ముందస్తు కార్యాచరణ

## ప్రజలకు ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
## ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం




**ప్రజాపక్షం/నల్లగొండ** : ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో తాగునీరు, విద్యుత్, వ్యవసాయ తదితర రంగాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి,ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సంసిద్ధత,ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం తదితర అంశాలపై నిర్వహించిన ఉమ్మడినల్లగొండ జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి,నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డిలతోపాటు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,జిల్లా కలెక్టర్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు,సాగునీరు,వ్యవసాయం వంటి రంగాల్లో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. రైతులను పంటల మార్పిడి,ఆరుతడి పంటల వైపు మళ్లించేలా విస్తృత అవగాహన కల్పించాలని, ఇప్పటికే వరి సాగు చేసిన రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త బోర్లు వేయడాన్ని నియంత్రించాలని సూచించారు.

**వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలే మేలు : నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశమున్నందున రైతులు వరి సాగు చేయకుండా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీరు ప్రధానంగా తాగునీటికే సరిపోతుందని, వర్షాలు లేకపోతే వచ్చే ఏడాది జూలై వరకు తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు.రైతులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచించారు. డిండి, ఎస్ఎల్‌బీసీ, బస్వాపూర్ తదితర ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.

**ఇప్పటికే వేసిన పంటలను కాపాడాలి : మంత్రి వెంకట్‌రెడ్డి**

అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అండగా నిలవాలని సూచించారు.ఇప్పటికే వరి సాగు చేసిన రైతుల పంటలు కాపాడేందుకు అవసరమైన విద్యుత్, నీటి సరఫరా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు.లోవోల్టేజ్ ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని,దేవరకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఎల్‌బీసీ పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలమవుతుందని తెలిపారు. ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి,కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి,దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్,సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, తమ తమ నియోజకవర్గాల్లో తాగునీరు, విద్యుత్, సాగునీరు, ప్రత్యామ్నాయ పంటలు, కోతుల బెడద, మిషన్ భగీరథ నీటి సరఫరా వంటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వా న్ని కోరారు. సమావేశంలోప్రభుత్వ విప్ , నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి,స్పెషలాఫీసర్, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన సెక్రటరీ దాసరి హరిచందన,సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్,యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్లు, రెవెన్యూ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.అనంతరం తెలంగాణ జలసిరి" గోడపత్రికను ఆవిష్కరించారు.

**ఎల్‌నినోపై ముందస్తు అవగాహన కల్పించి ఉంటే రైతులకు నష్టం తగ్గేది : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



ఎల్‌నినో ప్రభావంపై కనీసం నెల రోజుల ముందే రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించి ఉంటే ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులను కొంత మేర నివారించవచ్చని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.జిల్లాలో ఇప్పటికే బోరు బావుల ఆధారంగా పలువురు రైతులు వరి నాట్లు వేసుకున్నారని తెలిపారు.జిల్లాలో అత్యధికంగా రైతులు పత్తి సాగు చేసినప్పటికీ,వ్యవసాయ శాఖ అధికారులు పత్తి సాగుకు అనుకూలమని సూచిస్తున్నారని, అయితే నల్ల నేలల్లో మాత్రమే పత్తి బాగా పండుతుందని, ఎర్ర నేలల్లో ఆశించిన దిగుబడి రాదని పేర్కొన్నారు.విత్తనాలు, ఎరువులు,దుక్కిదున్నడం తదితర పనులకు ఎకరానికి సుమారు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొందని, అలాంటి పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.మునుగోడు,దేవరకొండ నియోజకవర్గాలతో పాటు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా అందడం లేదని, చౌటుప్పల్ ప్రాంతంలో కూడా తాగునీటి సమస్య ఉందని తెలిపారు. విద్యుత్ సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని,రైతులు డీడీలు చెల్లించినప్పటికీ ఇంకా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదని అన్నారు.

# ప్రజలు చట్టాలను గౌరవించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజలు చట్టాలను గౌరవించాలని ఏవైనా సమస్యలు ఉంటే చట్టప్రకారం పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డే నందు ఆయన బాధితుల నుండి అర్జీలను స్వీకరించి అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు తగాదాలు పెట్టుకోవడం, ఆస్తుల కోసం ప్రాణాలు తీసుకునే స్థాయికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

**ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం : డిఎస్‌పి ప్రసన్న కుమార్**

బాధితులకు, ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ స్పష్టం చేశారు. సోమవారం సూర్యాపేట డివిజన్ కార్యాలయం నందు నిర్వహించిన పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం డివిజన్ స్థాయి పోలీస్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించుకోవాలని సూచించారు.

# 2029 ఎన్నికలే లక్ష్యంగా 'ఎస్ఐఆర్'తో బిజెపి కుట్ర

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు



**ప్రజాపక్షం/యాదాద్రి** : రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను అస్త్రంగా వాడుకుంటోందని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూర్ సభ్యులు బి.వి. రాఘవులు తీవ్రస్థాయిలో ఆరోపించారు. అర్హులైన పౌరుల ఓటు హక్కును పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన ఎన్నికల ప్రక్రియను.. బీజేపీ తమ వ్యతిరేక ఓట్లను గల్లంతు చేసే కుట్రల కోసం దుర్వినియోగం చేస్తోందని ఆయన విమర్శించారు. చౌటుప్పల్లోని పద్మావతి ఫంక్షన్ హాల్లో సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలు, డీలిమిటేషన్ తదితర అంశాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. దేశంలో నిత్యావసరాల ధరల పెరుగుదల, రైతుల కష్టాలు, నిరుద్యోగం, యువతలో అసంతృప్తి తదితర సమస్యల వల్ల బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని రాఘవులు అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాభిప్రాయంతో నేరుగా గెలవడం కష్టమన్న అంచనాతోనే ఓటర్ల జాబితాలను తారుమారు చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి, అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ప్రాంతీయ సదస్సుకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి. పాష అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, కొండమడుగు నరసింహ పాల్గొన్నారు.

# పోక్సో కేసులో కానిస్టేబుల్ అరెస్ట్.. రిమాండ్.. తక్షణమే సస్పెన్షన్

ఖాకీకి మచ్చ తెచ్చిన వారిపై రాజీ లేదు : ఎస్పి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సత్యనారాయణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ కానిస్టేబుల్ సత్యనారాయణను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అనంతరం నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్ విధించబడింది.ఈ సందర్భంగా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఖాకీ దుస్తులు ధరించినంత మాత్రాన ఎవరూ చట్టానికి అతీతులు కారని స్పష్టం చేశారు. ఈ ఘటనపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతుండగా నిందితుడిపై వేగంగా కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు సస్పెన్షన్ విధించడం పోలీసు శాఖ కఠిన వైఖరికి నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 23న కలెక్టర్ ముట్టడి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్




**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్రంలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న కలెక్టర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.సోమవారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుగా సుమారు రూ.10,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఇంటర్,డిగ్రీ,ఇంజినీరింగ్,మెడికల్,లా తదితర కోర్సులు పూర్తిచేసిన వేలాది మంది విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడిచినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాంలు,పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందలేదని విమర్శించారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నోట్‌బుక్స్,దుప్పట్లు,దుస్తులు,పరుపులు,తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సరిపడా విద్యుత్, ఫ్యాన్లు వంటి కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో సొంత భవనాల కొరత, తరగతి గదుల లేమి, ఉపాధ్యాయులు , అధ్యాపకుల ఖాళీ పోస్టులు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, డిజిటల్ తరగతి గదుల కొరత విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. మెస్ చార్జీలు పెంచి, నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముద్దిగొండ మురళీకృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా యశ్వంత్,జిల్లా సహాయ కార్యదర్శి రామావత్ శోభన్ బాబు,జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్,జిల్లా కమిటీ సభ్యులు అరవింద్,మహేష్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఆలైన్‌మెంట్‌లో సూర్యాపేటను మళ్లీ చేర్చాలని అఖిలపక్షం, ప్రజాసంఘాల ధర్నా




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** హైదరాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను మళ్లీ చేర్చి సూర్యాపేటలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట అఖిల పక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి, అఖిల పక్ష నాయకులు, సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారి 65 పై ఉన్న ప్రధాన వాణిజ్య పట్టణమన్నారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రజలకు కీలక రవాణా కేంద్రంగా నిలిచిందన్నారు. వరి, పత్తి, ఎర్ర మిరప, జొన్న వంటి పంటల ఉత్పత్తి, పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు, విద్యా, పారిశ్రామిక సంస్థలతో సూర్యాపేట ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉన్న ప్రాంతం అన్నారు. గతంలో బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను చేర్చినప్పటికి, ప్రస్తుతం పరిశీలిస్తున్న మూడో అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను తొలగించడం సూర్యాపేట జిల్లా ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సూర్యాపేట జిల్లాలో గత 20 సంవత్సరాలుగా రైల్వే మార్గం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రాకుంటే జిల్లా అంధకారంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష పార్టీల నాయకులు పెద్దిరెడ్డి రాజా, తండు శ్రీనివాస్ యాదవ్, మల్లు నాగార్జున్ రెడ్డి, మందారి డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్, నూకల సుదర్శన్ రెడ్డి, అనుముల రవిబాబు, తుక్కాని మన్మథరెడ్డి, పాండురంగా చారి పాల్గొన్నారు.

# కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ** : రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు.సోమవారం నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మరో 15 రోజుల్లో రాష్ట్రంలోని రిజర్వాయర్లలో ఉన్న నీరు పూర్తిగా అయిపోయే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నది నుంచి సముద్రంలోకి వృథాగా వెళ్తున్న నీటిని వినియోగించుకునే ప్రణాళికలు రూపొందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన కరువు పరిస్థితుల్లోనూ నాగార్జునసాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించామని, ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారని విమర్శించారు.ఇప్పటికే ఉన్న నీటిపారుదల వ్యవస్థలను సమర్థంగా వినియోగించలేని పరిస్థితి ప్రభుత్వానికి ఉందన్నారు. నల్లగొండతో పాటు హైదరాబాద్‌కు కూడా తాగునీటి ఎద్దడి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసిన జగదీశ్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన వద్ద ఉన్న సాంకేతిక ఆధారాలతో కాళేశ్వరం ప్రాజెక్టు సామర్థ్యాన్ని నిరూపిస్తానని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి,మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగటి మల్లికార్జున్‌రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి,పట్టణ బోనగిరి దేవేందర్,అధ్యక్షుడు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ దొడ్డి రమేష్ పాల్గొన్నారు.






# ఆరు గ్యారంటీలను అమలు పరచాలి

బండి జంగమ్మ డిమాండ్

**ప్రజాపక్షం/మోటకొండూర్** : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఎన్నికలలో హామీలిచ్చిన 6 గ్యారంటీలను నేటికీ పూర్తిస్థాయిలో అమలు పరచలేదని వెంటనే పూర్తిస్థాయిలో అమలుపరిచి పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని భారత జాతీయ మహిళా సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మోట కొండూరు మండల మహిళ సమైక్య మూడవ మహాసభ చాడ గ్రామ శాఖ నాయకురాల్లు చొప్పరి భాగ్యమ్మ, ఆలేటి సబిత, రేపాక ఉమ ల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో జంగమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేటి సమాజంలో మహిళలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యములు కొరబడినాయని, మహిళలకు కేంద్ర రాష్ట్రప్రభుత్వంలో33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళలపై జరిగే లైంగిక దాడులను అత్యాచారాలు, గృహ హింస, ఫోక్స్ చట్టాలను కఠినంగా అమలు చేసి మహిళ లకు రక్షణ ఇవ్వాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. పేద మహిళలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెన్షన్స్, రేషన్ కార్డులు, ప్రతి మహిళలకు 2500 వందల రూపాయలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహా సభలోసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారా యణ, మండల పార్టీ కార్యదర్శి గాదేగాని మాణిక్యం, జిల్లా మహిళా సమైక్య గౌరవాధ్యక్షురాలు గుర్రం రాజమణి, జిల్లా నాయకురాలు వడ్లకొండ భారతమ్మ పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎంపిక..** భారత జాతీయ మహిళా సమాఖ్య మోటకొండూరు మండలగౌరవాధ్యక్షురాలుగా చొప్పరి భాగ్యమ్మ,అధ్యక్షురాలుగా దామర లక్ష్మి ,ఉపాధ్యక్షులు రేపాక ఉమా, మంచాల పద్మ, ప్రధాన కార్యదర్శిగా మంచాల రాధమ్మ, సహాయ కార్యదర్శిగా ఆలేటి సబితా, మంత్రి రేణుక, కోశాధికారిగా దొంతి వెంకటమ్మ, లతో పాటు 21 మందిని కమిటీ సభ్యులుగా మహసభ ఏకగ్రీవంగా తీర్మానించారు.




# కార్మికుల శ్రమదోపిడీకి కేంద్ర ప్రభుత్వం కుటిలయత్నం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకవచ్చిన కేంద్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకునేందుకు కుటిలయత్నం చేస్తుందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన ఎఐటియుసి హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి మహాసభకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే దేశంలోని కార్మికుల కోసం, వారి హక్కుల కోసం ఆవిర్భవించిన మొట్ట మొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని గుర్తు చేశారు. ఎఐటియుసి నాయకత్వాన మళ్లి 8 గంటల పని విధానం కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అందుకు కార్మికులు సిద్దం కావాలన్నారు. ఈ మహాసభకు త్రిపురం సుధాకర్ రెడ్డి అధ్యక్షతన వహించగా, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మహిళ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, పట్టణ సిపిఐ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

# ఎఐటియుసి నల్లగొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక






**ప్రజాపక్షం/నల్లగొండ:(గుర్రంపోడు):** గుర్రంపోడులో ఆదివారం నిర్వహించిన ఏఐటీయూసీ నల్లగొండ జిల్లా 11వ మహాసభలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి తెలిపారు.మహాసభకు ముందు కార్మికులు గుర్రంపోడు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో జిల్లా నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా నూనె రామస్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీఎస్ రెడ్డి,ఉపాధ్యక్షులు ఎడమ సుమతమ్మ,బరిగెల వెంకటేష్, బంటు రాజేశ్వరి,సహాయ కార్యదర్శులు నూనె వెంకటేశ్వర్లు,దోటి వెంకన్న,ఎండి జానీ,కోశాధికారిదోనకొండ వెంకటేశ్వర్లు తోపాటు 39 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

**మహాసభ తీర్మానాలు:** మహాసభలో కార్మికుల హక్కుల పరిరక్షణకు సంబంధించి పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని,అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని తీర్మానించారుస్కీమ్ వర్కర్ల వేతనాలను పెంచాలని,కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని,కనీస వేతనాల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించిన విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.

# వాంగ్ చుక్ అరెస్టును ఖండించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జాతీయస్థాయిలో ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్న సోనం వాంగ్ చుక్ అరెస్టును తీవ్రంగా ఖండించాలని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెపల్లి ఆదిరెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం నల్లగొండలో జరిగిన ఐఎఎల్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎఎల్ సభ్యత్వ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని రాబోయే రోజుల్లో సంఘ పాటిష్టతకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని ఆయన సూచించా రు. శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి.ఐఎఎల్ ఆధ్వర్యంలో ఈనెల 25న జరిగే ఒకరోజు న్యాయవాదుల శిక్షణా తరగతులను విజయవంతం చేయాలన్నారు. ఐఎఎల్ జిల్లా అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఐఎఎల్ సీనియర్ నాయకులు మునగాల నారాయణరావు, గుండె వెంకటేశ్వర్లు,జి.జవహర్‌లాల్,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న,గుర్రం వెంకటరెడ్డి,పందుల సైదులు,భువనగిరి రవి పాల్గొన్నారు.


## నిత్యం కొడుకు దౌర్జన్యాలు.. చివరకు కుటుంబ సభ్యులే హంతకులు

### దుబ్బగూడెం హత్య కేసు ఛేదించిన పేరూరు పోలీసులు

**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెం గ్రామంలో హత్య కేసును పేరూరు పోలీసులు ఛేదించారు. మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను నిత్యం వేధిస్తున్న వ్యక్తిని అతని తండ్రి, ఇద్దరు అక్కలు కలిసి గొడ్డలితో నరికి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్యం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బగూడెం గ్రామానికి చెందిన మడే చలపతి (30) ఈ నెల 18వ తేదీ ఉదయం తన ఇంటి ముందు రేకుల షెడ్‌లో మంచంపై రక్తపు మడుగులో మృతదేహంగా కనిపించాడు. సమాచారం అందుకున్న పేరూరు ఎస్ఐ గుర్రం కృష్ణ ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాని పోస్టుమార్టం అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తుప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులపైనే అనుమానం రావడంతో వారిని విచారించారు. విచారణలో మృతుడి తండ్రి మడే మదనయ్య, పెద్ద అక్క, మూడో అక్క ముగ్గురు కలిసి హత్య చేసినట్లు నేరాన్ని అంగీకరించారు. పోలీసుల కథనం ప్రకారం చలపతి మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా కుటుంబ బాధ్యతలను తీసుకోకుండా ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి తల్లిదండ్రులు, పెళ్లి కాని పెద్ద అక్క, మూడో అక్కపై దాడులు చేస్తూ, బూతులు తిడుతూ వేధింపులకు గురిచేసేవాడు. కొద్ది రోజులుగా ఈ వేధింపులు మరింత పెరగడంతో కుటుంబ సభ్యులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.ఈ నెల 16వ తేదీన కూడా చలపతి తన అక్కను కర్రతో కొట్టడంతో పాటు, అదే రోజు తండ్రిని బెదిరించి రూ.500 తీసుకుని మద్యం సేవించి రాత్రి ఇంటికి వచ్చి రేకుల షెడ్‌లో నిద్రించాడు. ఆ రాత్రి 10.30 గంటల సమయంలో ఇక అతని వేధింపులను భరించడం సాధ్యం కాదని నిర్ణయించుకున్న తండ్రి, ఇద్దరు అక్కలు ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకుని చలపతి తల, ముఖం, మెడపై పలుమార్లు దాడి చేసి హత్య చేశారు. నేరానికి ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ ముత్యం రమేష్ తెలిపారు

## వర్షాభావ పరిస్థితుల్లో రామప్ప సరస్సు కాలువలు బంద్ చేసిన అధికారులు

### పంట మార్పిడి చేసుకోవాలని అధికారుల సూచన



**ప్రజాపక్షం/వెంకటాపూర్ (రామప్ప) :** రాష్ట్రంలో వర్షా బావ పరిస్థితులు తక్కువగా ఉండటంతో భవిష్యత్తులో తాగునీటికీ కొరత రాకుండా ఉండడం కోసం రామప్ప సరస్సు కింద పంటలకు సాగునీరు ఆదివారం అధికారులు బంద్ చేశారు. ఎల్ ని నో ప్రభావంతో తలెత్తే పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి కాలువలు బంద్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే 20 రోజుల క్రితం పంట సాగు కోసం కాలువలు విడిచిపెట్టడంతో నార్లు పోసుకుని కొందరు నాట్లు కూడా వేసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. ముందుగానే సాగునీరు వదలకుండా ఉంటే నారు నష్టపోయే వాళ్ళం కాదని రైతులు వాపోతున్నారు. గతంలో రామప్ప చెరువులో 13 అడుగుల నీటిమట్టం ఉండేదని, పంట సాగు కోసం దేవాదుల నీటిని ఇప్పటివరకు 29 అడుగుల వరకు నింపారని, అకస్మాత్తుగా కాలువలు బంద్ చేయడంతో సుమారు ఐదు నుండి 25 వేల రూపాయల వరకు నష్టపోయామని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే రామప్ప సరస్సు నుండి నాలుగు మండలాలకు తాగునీరు సరఫరా అవుతున్నదని అందుకోసం నీటి నిల్వ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పంట మార్పిడి ద్వారా లాభసాటిగా ఉండే ఆరుతడి పంటలు వేసుకొని భవిష్యత్తులో తాగునీటికీ ఇబ్బంది లేకుండా రైతులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

## ప్రజలకు అభివృద్ధి పనులు చేయడమే నా ధ్యేయం: జాటోత్ హుస్సేన్ నాయక్



**ప్రజాపక్షం/కేసముద్రం:** ప్రజలకు అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేస్తానని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటి పరిధిలోని 16వ వార్డు చైతన్య నగర్ కాలనీలో కెనరా బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హజరై మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్ పర్సన్ అల్లం రమా నాగేశ్వర్ రావులతో కలిసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం వల్లందాస్ రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు వారి స్వంత ప్రాంతాలను మాత్రమే అభివృద్ధి చేస్తున్నాయని, కానీ జాతీయ కమీషన్ తరుపున తనకు ప్రాంతాలు, పార్టీలకతీతంగా అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు తన సహకారం తప్పక ఉంటుందని, స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా పార్టీలకతీతంగా ప్రజలకు మంచి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారిపై కమీషన్ ద్వారా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక కౌన్సిలర్ వల్లందాస్ ఉమా రవి కోరిన మేరకు పిల్లల పార్కు, ఎస్సి కమ్యూనిటి భవన నిర్మాణాలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు తరాల వీరేష్, కనుకుల సుభద్ర రాంబాబు, బానోత్ విజయభద్రు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు, కెనరా బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ప్రతి ఫిర్యాదును వేగవంతంగా పరిష్కరించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అక్కడ ఉన్న జిల్లా అధికారులతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లతో ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు 268 ఫిర్యాదులను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్లైన్ పోర్టల్ లో పరిశీలించాలని, పరిష్కార చర్యలు సంబంధిత శాఖల అధికారులు చేపట్టాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్‌డిఓ మేన శ్రీను,శేషాద్రి, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు..

# ప్రతి అర్హత కలిగిన ఓటును కాపాడటమే లక్ష్యం

### బిఎల్ఎలు గడప గడప ప్రచారం నిర్వహించాలి

### 'సర్' ప్రక్రియపై ఎమ్మెల్యే నాయిని సమీక్ష



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రతి అర్హత కలిగిన ఓటును కాపాడటమే లక్ష్యం అని శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్లు, మాజీ కార్పొరేటర్లు,ఎస్ఐఆర్ బూత్ ఇన్‌చార్జ్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎస్ఐఆర్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాసీర్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సమావేశంలో గత నెల రోజులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో డివిజన్, బూత్‌ల వారీగా జరిగిన పురోగతిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమగ్రంగా సమీక్షించారు. ప్రతి డివిజన్‌లో ఇప్పటివరకు జరిగిన పని, ఎదురవుతున్న సమస్యలు, బూత్‌ల వారీగా నమోదవుతున్న పురోగతిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత బాధ్యతతో పని చేయాలని సూచించారు. ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్‌ఏ) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి గడప గడప ప్రచారం నిర్వహించాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపాడడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం, తప్పులు ఉండడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన దరఖాస్తులు పూర్తి చేయించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఎస్ఐఆర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ప్రతి అర్హ ఓటును కాపాడేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అదే స్ఫూర్తితో ప్రతి నాయకుడు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు.చాలా వరకు షిఫ్టెడ్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.మరణించిన వారి ఓట్లు ఎన్ని కొత్తగా నమోదు అవుతున్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని,"పార్టీలో పని చేసే వారికే గుర్తింపు, అవకాశాలు, పదవులు వస్తాయి. సీనియర్ అనే పేరుతో పని చేయకుండా కూర్చుంటే అవకాశాలు రావు. ప్రజల మధ్య ఉండి పార్టీ కోసం కష్టపడిన వారినే కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గౌరవిస్తుంది" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అదే విశ్వాసంతో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనే స్థాయిలో పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యంగా రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసి విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో పార్టీ సంస్థాగత బలోపేతానికి త్వరలోనే డివిజన్ అధ్యక్షుల నియామకాలు చేపడతామని ఎమ్మెల్యే ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు, బాధ్యతలు తప్పకుండా లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఇ వి శ్రీనివాస్ రావు,పలువురు కాంగ్రెస్ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జ్లు, మాజీ కార్పొరేటర్లు, ఎస్ఐఆర్ బూత్ ఇన్‌చార్జ్లు,నాయకులు పాల్గొన్నారు.

## బీరన్న ఆలయ అభివృద్ధికి రూ.50లక్షలు: మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఉర్సు శ్రీ బీరన్న స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు దేవాదాయ శాఖ ద్వారా రూ.50లక్షలు మంజూరు చేసినట్లు దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా ఈ నెల 25న నిర్వహించే శ్రీ బీరన్న స్వామి బోనాల జాతరకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు కల్పించాలని అధికారులను ఆదేశిస్తామని చెప్పారు. ఉర్సు శ్రీ బీరన్న స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖను కలిసి శాలువాతో సత్కరించి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతరలో వేలాది మంది భక్తులు పాల్గొంటారని, 150 మంది మహిళలు బోనాలతో ఉర్సు నుండి ఆలయం వరకు ఊరేగింపుగా వస్తారని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మిర్యాల కుమారస్వామి, మండల ప్రమీల గౌడ్, కోటేశ్వర్, మరుపల్ల గౌతమ్, కొలుపుల కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ఎదుట హమాలీల ధర్నా




**ప్రజాపక్షం/హనుమకొండ :** ఎఐటియుసి అనుబంధ తెలంగాణ సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ కు సమస్యలపై వినతి పత్రం అందించారు. హనుమకొండ జిల్లాలో పనిచేస్తున్నటువంటి సివిల్ సప్లై హమాలి కార్మికుల సమస్యలు పరిష్కారానికి, ఆరు నెలల నుండి సరిగా బిల్లులు పడక, మూడు నెలలకు ఒకసారి బియ్యం ఎగుమతులు, దిగుమతులు చేయటం వలన మూడు నెలలు పని లేకుండా, దాంతో వేతనాలు రాకుండా అప్పులు తెచ్చుకొని జీవనం గడిపేటువంటి పరిస్థితి ఏర్పడుతున్నదని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీ కార్మికులు తమ వేతనాలతో కూడినటువంటి రేషన్ సరపరా ఇవ్వాలని, అలాగే ఇప్పటి వరకు మూడు నెలలకు ఒకసారి ఇచ్చే బియ్యాన్ని యధావిధిగా నెలకోసారి పంపిణీ చేసే విధంగా చూడాలని, తద్వారా కార్మికులకు పని కల్పించే విధంగా ఉండాలని కోరారు.అలాగే హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, హమాలీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. మునీశ్వర్, జిల్లా అధ్యక్షులు కుక్కల మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సందీప్, సిపిఐ జిల్లా నాయకులు కొట్టెపాక రవి, కొలువుల బిక్షపతి, పెరుగు రాజ్ కుమార్, ఎం శంకర్, బిక్షపతి, ఆర్ కోటి, టి యాకయ్య, కే మహేందర్, బి రాజు సహా దాదాపు 60 మంది ధర్నాలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రాథమిక పాఠశాలలే బలమైన పునాది

### జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** జులై 20వతేది నుండి జిల్లాలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు దశలుగా శిక్షణ తరగతులు ప్రారంభం కాగామొదటి రోజు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి గోవిందరావుపేట మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గోవిందరావుపేట యందు నిర్వహించబడుతున్న శిక్షణ శిబిరాన్ని సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే ప్రైమరీ టీచర్ల పాత్ర కీలకం అని అన్నారు కృత్యాధార ఆట పాటలతో జాయ్ ఫుల్ లర్నింగ్ ద్వారా విద్యార్థులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఆకర్షించాలని స్నేహపూర్వక వాతావరణంలో విద్యాబోధన ద్వారా విద్యార్థుల మనసులో చెరగని ముద్ర వేసుకునే ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులని వారు అన్నారు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుటకు బలమైన పునాది వేయాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో డి వెంకటేశ్వర్లు రిసోర్స్ పర్సన్లు వెంకటేష్ కిషోర్ మాదవిలత రమేష్ బాబు ఎమ్ ఆర్ సి బి విష్ణు రజిత ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.


## దిగజారుడు మాటలతో గౌరవాన్ని కోల్పోతున్న హరీష్‌రావు

### మాజీ మంత్రిపై నిప్పులు చెరిగిన కడియం శ్రీహరి




**ప్రజాపక్షం/జనగామ:**గత ప్రభుత్వంలో మంత్రిగా చేసిన హరీష్‌రావు తన దిగజారుడు మాటలతో గౌరవాన్ని కోల్పోతున్నారని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వలనే కరువు అనడం హాస్యాస్పదమన్నారు. కాళేశ్వరి మునిగిపోవడానికి తమదే బాధ్యత అని ఒప్పుకున్న తరువాతనే నీటిని ఎత్తిపోసే విషయం మాట్లాడాలన్నారు. సోమవారం స్టేషన్‌ఘనపూర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నీనో ప్రభావం దేశ వ్యాప్తంగా ఉందని, దీనితోనే దేశంలో వర్షాలు కురవడం లేదన్నారు. కాంగ్రెస్ వలనే కరులు అంటున్న హరీష్‌రావు ఒక బాధ్యత కలిగిన వ్యక్తిగా ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడడం ఎంత వరకు సరియైందని ప్రశ్నించారు. దేశంలో ఏ నదిలో ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేదని, ప్రస్తుతం గోదావరిలో ఉన్న 16వేల క్యూసెక్కుల ప్రవాహంతో నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. మనిషికి గుండె ఎంత ముఖ్యమో కాళేశ్వరానికి మేడిగడ్డ అంత ముఖ్యమని, మేడిగడ్డ పనిచేయకపోతే కాళేశ్వరం పని చేయదన్నారు. రైతులు వాస్తవ పరిస్థితులు గమనించాలని, హరీష్‌రావు చెప్పే మాటలు వాస్తవం కాదన్నారు. ముందు కాళేశ్వరం కుంగిపోవడానికి బాధ్యత తమదే అని కేసీఆర్, హరీష్‌రావు ఒప్పుకొని ఆ తరువాత ప్రభుత్వం ఏం చేస్తుందని అడగాలన్నారు. ఏ మోహం పెట్టుకొని బిఆర్ఎస్ నాయకులు పాద యాత్రలు చేస్తారని మండిపడ్డారు. 10 ఏళ్ళ అధికారంలో ఉండి నిరుద్యోగులను మోసం చేశారని, కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను పూర్తిగా దోచుకుందన్నారు. 1400 కోట్ల బిఆర్ఎస్ పార్టీ ఫండ్ క్విడ్ ప్రోక్ ద్వారా వచ్చిందని, దానికి ఉద్యమకారులకు పంచాలని కవితి డిమాండ్ చేస్తుందన్నారు. చేతనైతే కవితకు సమాధానం చెప్పాలని, లేకుంటే ఉద్యమకారులకు పంపిణీ చేయాలన్నారు. కొన్ని పత్రికలు, యూట్యూబ్ చానళ్లు పెట్టుకొని విష ప్రచారం చేస్తూ రైతులు, యువతను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ అసత్య ప్రచాలను ప్రజలు నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వలనే కరువు అనడం సరియైంది కాదన్నారు. గోదావరి నుండి నీటిని ఎత్తిపోయాలంటే కనీసం 2లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండాలన్నారు. నీటిని లిఫ్ట్ చేయండి ఏం జరిగినా తమది బాధ్యత అంటున్న బిఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం కుంగిపోవడానికి తమ నిర్లక్ష్యమే కారణం అని ఎందుకు ఒప్పుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విలేకర్ల సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ తాటికొండ విజయ్‌కుమార్, స్టేషన్‌ఘనపూర్ పట్టణ అధ్యక్షులు అంబాటి కిషన్‌రాజ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నీల రాజమ్మ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యును పాల్గొన్నారు.

## బిఎల్ఎలను సన్మానించిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ఓటరు జాబితా సవరణ, అర్హుల ఓట్ల నమోదు, సమస్యల పరిష్కారంలో బిఎల్ఏ ల పాత్ర ముఖ్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం 3వ డివిజన్ లోని పైడిపల్లి గ్రామంలో సర్ ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి పాల్గొన్నారు.బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఏ)ల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. డివిజన్లో సర్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని బిఎల్ఏ లను సూచించారు.డివిజన్ లోని 113,124 బూతలో నూరు శాతం సర్ ప్రక్రియ పూర్తి చేసిన బిఎల్ఏలు చిరంజీవి,అనిల్ లను ఎమ్మెల్యే సన్మానించారు.త్వరలోనే రాహుల్ గాంధీచే సన్మానం కార్యక్రమం ఉంటుందని అందులో పాల్గొనాలనే ఉత్సాహం ఉన్న బిఎల్ఏ మరింత ఉత్సాహంగా సర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.అనంతరం పైడిపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రంను సందర్శించారు.వీధుల హాజరు పటికను పరిశీలించి,వైద్య సేవల గురించి అడిగి తెలుసున్నారు.పేద ప్రజల వైద్య సేవలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్,హన్మకొండ జిల్లా యూత్ అధ్యక్షుడు దిలీప్ రాజ్,డివిజన్ అధ్యక్షులు జన్ను అరుణకర్,మాజీ కార్పొరేటర్ జన్ను అనిల్ శిభారాణి, జిల్లా కార్యదర్శి జేసన్,సీనియర్ నాయకులు బుద్దే పెద్దన్న,కమ్మగోని ప్రభాకర్ గౌడ్,భానుప్రసాద్,డివిజన్,గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యంజియంను సందర్శించిన వరంగల్ సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ సోమవారం వరంగల్ యం.జి.యం హాస్పటల్ ను సందర్శించారు. సోమవారం ఉదయం యం.జి. యంకు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ అవుట్ పోస్ట్ సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, ఇక్కడికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించి ఏవిధమైన చర్యలు చేపడుతున్నారు. వీటికి సంబందించి వివరాలను నమోదు చేసే రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మత్తు పదార్ధాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న డి అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో మత్తు పదార్ధాలకు అలవాటు పడిన యువతను సాధరణ స్థితికి తీసుకవచ్చేందు.. వైద్యులు అందిస్తున్న చికిత్స విధానాన్ని వైద్యులు పోలీస్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా యం.జి.యం పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ హాస్పటల్ కు సంబందించి ప్రధాన మార్గంతో పాటు, వాహన పార్కింగ్ ప్రదేశాలు,ముఖ్యమైన స్థలాల్లో సిసి కెమెరాల ఏర్పాటుపై సంబందించిన అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు, యంజియంలో పార్కింగ్ ఏర్పాట్లు, హాస్పిటల్ సంబందించి ప్రధాన మార్గం నుండి హాస్పటల్ కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాస్పటల్ ప్రధాన ద్వారంలో ఆటోలను నిలపకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిపి ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, యం.జి.యం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్.యం. ఓ, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సదయ్య, సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి ఇన్స్పెక్టర్లు కరుణాకర్, రాఘవేందర్‌తో పాటు ఆర్ఎస్ఐలు పూర్ణ చందర్ రెడ్డి, మనోజ్, నాగరాజు వున్నారు.

## ప్రతి గ్రామ పంచాయితీలో నెలవారి మూల్యాంకన నిర్వహించాలి





**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో నెలవారి మూల్యాంకన నిర్వయించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. ఎస్‌జే స్కోర్ ద్వారా గ్రామాల పరిశుభ్రతకు మార్కుల మూల్యాంకన ఉంటుందన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వాహణ, తాగునీటి భద్రత, దోమల నివారణ,ఓడిఎఫ్ స్థిరత్వం, ప్రజా ఆరోగ్య ప్రమాణాలను మరింత మెరుగు పరిచేందుకు ఎస్‌జే స్కోర్ స్వచ్ఛ జనగామ పారిశుద్య టాస్క్ ఫోర్స్ పేరిట నెలవారి సమగ్ర మూల్యాంకన విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం సెక్షన్ నిబంధనలకు అనుగుణంగా ఉటుందని పేర్కొంది. గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి తడి, పొడి శానిటరీ ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలను నాలుగు వర్గాలుగా వేరు చేసి సేకరించే విధాన్నిన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త ఉండనివ్వవద్దని తెలిపారు. గ్రేడ్ ఏ సాధించిన ప్రత్యేక పంచాయతీలకు ప్రశంసా పత్రాలు, స్వచ్ఛ గ్రామ పురస్కారాలు అందజేస్తామని, వరుసగా తక్కువ గ్రేడ్‌లు పొందిన గ్రామ పంచాయతీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమీక్షలో జనగామ, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓలు గోపిరామ్, కిరన్ ప్రకాష్, డిఆర్‌డిఓ భాస్కర్, పిడి ఈజెఎస్ సూరి, డిపిఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణిలో అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజావాణిలో ప్రజలు అందజేసిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ప్రజావాణిలో మొత్తం 78 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. అధికారులు ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, బాధితులకు తగిన న్యాయం జరిగేలా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, జిల్లాలో జరిగే ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డితో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
21-07-2026
www.prajapaksham.in














నిరసన ప్రదర్శనలో ఎస్‌పి ఎంపి డింపుల్‌యాదవ్‌ను అడ్డుకుంటున్న పాలకులు



విద్యార్థుల దీక్ష విరమింపజేస్తున్న షబానా అజ్మీ, ప్రకాశ్‌రాజ్, సంజయ్‌ఝా, ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర బాబు

## దద్దరిల్లిన ఢిల్లీ

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిరసనకారులు రోజంతా రోడ్డుపైన ఆందోళనలు చేశారు. దీంతో దేశ రాజధానిలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది.




ర్యాలీలో సోనమ్ వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి ఆంగ్మో







# పాలకులకు ‘పార్లమెంట్ మార్చ్’ పెద్ద హెచ్చరిక

**లక్షమందిపైగా స్వచ్ఛందంగా తరలివచ్చిన విద్యార్థులు, యువత**
**ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అభినందన**
**పోలీసు లాఠీచార్జికి ఖండన**



**న్యూఢిల్లీ:** విద్యార్థులు, యువకులు లక్షమంది పైగా పాల్గొన్న ‘పార్లమెంటు మార్చ్’ పాలకపక్షానికి ఒక పెద్ద హెచ్చరిక అని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో విద్యార్థులు, యువతరంలో పెరుగుతున్న ఆవేదనను ఇకపై పాలకులు విస్మరించలేరన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దేశ వ్యతిరేక విధానాలపై రైతు సంఘాలు,కార్మిక సంఘాలు ఇప్పటికే పోరాట మార్గంలో కొనసాగుతున్నాయని, ఈ తరుణంలో న్యాయంకోసం విద్యార్థులు సోమవారం చేపట్టిన ఈ ఉద్యమం ఎంతో స్వాగతించదగిన పరిణామమని, ఇది పాలకులకు ఒక హెచ్చరిక పిలుపు అని పేర్కొన్నారు. విద్యావ్యవస్థ ప్రక్షాళన, మంత్రి ప్రధాన్ రాజీనామా కోరుతూ పార్లమెంటుకు సోమవారం జరిగిన ప్రదర్శనకు భారీగా తరలివచ్చిన విద్యార్థులు, యువకులకు ఎఐటియుసి అభినందనలు తెలియజేసింది. ప్రదర్శకులపై విచక్షణారహితంగా చేసిన పోలీసు లాఠీచార్జీని తీవ్రంగా ఖండించింది. అమర్‌జీత్ కౌర్ సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, భిన్న సంస్కృతులు, భాషలు మత విశ్వాసాలకు గౌరవం ఇస్తూనే, న్యాయం, సమానత్వం, అసమ్మతిని తెలియజేసే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛలకోసం జరిగే పోరాటాన్ని ఈనాడు జరిగిన పరిణామాలు ఖచ్చితంగా బలోపేతం చేస్తాయని ఉద్ఘాటించారు. పార్లమెంటు సమావేశాల మొదటిరోజున కాక్రోచ్ జనతాపార్టీతోపాటు విద్యార్థి, యువజన సంఘాలు తలపెట్టిన నిరసన ప్రదర్శనకు లక్షమందికిపైగా విద్యార్థులు, యువకులు స్వచ్ఛంధంగా తరలిరావడంపట్ల అభినందనలు తెలియజేశారు.

దేశ పరీక్షల విధానంలో అవకతవకలు, అక్రమాలు, నీట్ ప్రశ్నాపత్రాలు ముందుగానే బహిర్గతమైన తర్వాత 20 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ సమస్యల పరిష్కారానికి న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గడచిన నెలరోజులుగా కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి)నాయకత్వంలో విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. వర్షాకాల సమావేశాల మొదటిరోజు పార్లమెంటు ప్రాంగణం వరకు ప్రదర్శన చేయాలని సిజెపితోపాటు విద్యార్థి,యువజన సంఘాలు ముందుగానే పిలుపు ఇచ్చాయి.దేశం నలుమూలల నుండి సామూహికంగా తరలివచ్చిన ప్రదర్శకులలో ఎక్కువమంది విద్యార్థులు, యువకులే ఉన్నారు. లోపభూయిష్టమైన విద్యావిధానం, వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ నియామక పరీక్షలలో అవకతవకలు, తీవ్ర అవినీతికి వ్యతిరేకంగా వీరంతా న్యూఢిల్లీలో ఏకమయ్యారని అమర్‌జీత్ కౌర్ తన ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం అసాధారణస్థాయికి చేరుకుంది, విద్యార్థులు, యువతరంలో అనిశ్చితి కూడా తీవ్ర ఆందోళనకరమైన అంశంగా మారింది,విద్యాశాఖామంత్రి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతూ ప్రముఖ విద్యావేత్త, శాస్త్రవేత్త సోనమ్ వాంగ్‌ఛుక్ గడచిన 20 రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు,ఆయనను బలవంతంగా నిరసన ప్రదేశం నుండి తొలగించడం కూడా విద్యార్థులలో తీవ్ర ఆందోళన పెంచింది, దేశంలో ఉన్న అదానీ, అంబానీ వంటి కొద్ది మంది ఎంపిక చేసిన కార్పొరేట్ శక్తులసేవలో, వారి ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం పని చేస్తోంది, అదేసమయంలో అమెరికా–యూరోపియన్ యూనియన్ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది అని ఆమె విమర్శించారు.

# సింగిల్ డిజిట్ ర్యాంకే లక్ష్యం



విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న పీజీఐ (పర్ఫర్‌మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్) ర్యాంకింగ్‌లో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో సింగిల్ డిజిట్ ర్యాంకు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా పిలుపునిచ్చారు. ‘పాఠశాల విద్యా వ్యవస్థ పని తీరు’ పట్ల జిల్లా స్థాయి బృందాలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ ఇనిస్టిట్యూట్‌లో రెండు రోజుల రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ యోగితా రాణా వర్చువల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీఐ 2024–25లో 28వ స్థానంలో ఉన్న తెలంగాణ, 2025–26 నాటికి 18వ ర్యాంకుకు చేరుకోవడం పట్ల విద్యాశాఖ అధికారులను, సిబ్బందిని అభినందించారు. పీజీఐ అనేది కేవలం ర్యాంకుల కోసం మాత్రమే కాదని, విద్యా వ్యవస్థలో లోపాలను గుర్తించి నాణ్యతను మెరుగుపరిచేందుకు ఉపయోగపడే సాధనమని సూచించారు. అనంతరం పీజీఐలో అత్యుత్తమ ప్రతిభ చూపిన జనగామ, మంచిర్యాల జిల్లాలతో పాటు ఎఫ్‌ఎల్‌ఎన్ శాంపిల్ సర్వేలో ప్రతిభ చూపిన పెద్దపల్లి, వనపర్తి, నారాయణపేట జిల్లాల అధికారులను పాఠశాల విద్య శాఖ సంచాలకులు డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ సత్కరించారు. డేటా క్యాప్చరింగ్ ఫారమ్ నింపడంలో అధికారులు ఎంతో జాగ్రత్తగా ఉండాలని, కచ్చితత్వంతో కూడిన సమాచారమే రాష్ట్ర ర్యాంకింగ్‌ను ప్రభావితం చేస్తుందని ఆయన సూచించారు.

## బర్న్‌హామ్

(మొదటి పేజీ తరువాయి)

సమ్మతించారు. అనంతరం కొత్త ప్రధాన మంత్రి తన కార్యాలయం టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో తొలి కీలక ప్రసంగం చేయాల్సి ఉంది. కాగా స్టార్‌మర్ బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు వెళ్ళేముందు టెన్ డౌనింగ్ స్ట్రీట్ వెలుపల మాట్లాడుతూ, “నా పని పూర్తయింది,బర్న్‌హామ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నా, ఆయనకు నా పూర్త మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది,నేనెంతో సంతోషంతో, చిరునవ్వుతో వైదొలగుతున్నా, మనం సాధించిన విజయాలపట్ల ఎంతో గర్వంతో వెళుతున్నా”అని చెప్పారు. ఈ తర్వాత ఆయన మంత్రివర్గ సహచరులు,అధికారులు వరుసలో నిలబడి ఆయనకు అభినందనలు తెలియజేసి వీడ్కోలు పలికారు.

“గౌరవనీయులైన స్టార్‌మర్ సోమవారం ఉదయం రాజు ఛార్లెస్‌ను కలిశారు. ప్రధానమంత్రి పదవికి, ఫస్ట్ లార్డ్ ఆఫ్ ట్రెజరీ పదవికి రాజీనామా సమర్పించారు. ఆయన సంతోషంగా రాజీనామా ఆమోదించారు. ఆయన స్థానంలో బర్న్‌హామ్‌ను కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు” అని బకింగ్‌హామ్ ప్యాలెస్ ప్రతినిధి ఒకరు చెప్పారు. బర్న్‌హామ్ తన మంత్రివర్గ సభ్యుల పేర్లు ప్రకటించడం ద్వారా వెంటనే ప్రధానమంత్రి విధులు ప్రారంభిస్తారు.

బ్రిటన్‌కు మరింత స్వేచ్ఛను ఇస్తానని, స్థిరమైన,బాధ్యతాయుతమైన రాజకీయాలు చేసే వాతావరణం తెస్తానని, కొత్త రాజకీయ వ్యవస్థకు తెర తీస్తానని కొత్త ప్రధాన మంత్రి ఆండీ బర్న్‌హామ్ తన కొత్త ప్రణాళికలోని ఐదు అంశాలలో ఇప్పటికే స్పష్టం చేశారు.

దేశ ప్రజలపై ధరల భారాలు సడలించడంతోపాటు, దేశ రక్షణ వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దడం, అనిశ్చిత ప్రపంచం నేపథ్యంలో దేశంలో స్వయం సమృద్ధి సాధించడం, పార్టీలో అస్థిరతను తొలగించడం,టెన్‌డౌనింగ్‌స్ట్రీట్‌లో అధికారులు పరస్పర భిన్నమైన ప్రకటనలు చేయకుండా కట్టడి చేయడం వంటి విషయాలపై దృష్టి సారిస్తానని ఆయన చెబుతున్నారు. గడచిన శుక్రవారం (జులై 17) ఆయన లేబర్‌పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో లేబర్‌పార్టీ ఘన విజ యం సాధించిన తర్వాత ఆ పార్టీ నుండి రెండో ప్రధానమంత్రిగా బర్న్‌హామ్ బాధ్యతలు చేపట్టగా, గడచిన నాలుగు సంవత్సరాలలో దేశానికి ఈయన ఐదవ ప్రధాన మంత్రి. పది సంవత్సరాలకాలంలో బ్రిటన్‌లో బర్న్‌హామ్‌తో కలిపి ఏడుగురు ప్రధానమంత్రులు ప్రధానమంత్రులు టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో బాధ్యతలు నిర్వహించారు.


## మళ్ళీ మధ్యవర్తి ప్రయత్నాలు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందని చెప్పారు. అవగాహన ఒప్పందం అమలును ఇరాన్ నిలిపివేసిందా? అని ప్రశ్నించినప్పుడు ఇరాన్ వైఖరి మొదటినుండీ ఒకేవిధంగా ఉందని, తమ కట్టుబాటు మారలేదని చెప్పారు. ఎదుటిపక్షం తన బాధ్యతలు నిర్వర్తించినంతకాలం ఇరాన్ ఒప్పంద కట్టుబాట్లకు లోబడి ఉంటుందన్నారు. మినాబ్ పాఠశాలపై అమెరికా ఉద్దేశపూర్వకంగానే దాడి చేసి విద్యార్థులు,ఉపాధ్యాయులను హతమార్చిందనడంలో ఎలాంటి సందేహం లేదని ఉద్ఘాటించారు. దౌత్య పరిష్కారానికి అమెరికా సిద్ధంగా ఉందని దేశ విదేశాంగమంత్రి మార్కో రుబియో చెప్పిన విషయంపై స్పందిస్తూ, ఇలాంటి మాటలు ఆచరణలో చాలాసార్లు తాము పరీక్షించామని, ఇరాన్ సార్వభౌమాధికార రక్షణే తమ ధ్యేయమని బఖాయీ చెప్పారు. అమెరికా నిజమైన సంప్రదింపులు చేయడానికి బదులుగా తన డిమాండ్లను బలవంతంగా తమపై రుద్దడం, భయపెట్టడం, బెదిరించడం, హెచ్చరికలు చేయడం, ఆంక్షలు విధించడం వంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

గడచిన పది రోజులుగా అమెరికా–ఇరాన్ మధ్య ఆగకుండా పశ్చిమ ఆసియాలో పరస్పర దాడుల బల ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సహా గల్ఫ్ దేశాలు బాంబు దాడులతో దద్దరిల్లుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మధ్యవర్తులు చర్చలకు ప్రతిపాదనలు చేస్తున్నారని ఊహాగానాలు వస్తున్న తరుణంలో వారంతపు మీడియా సమావేశంలో పాత్రికేయులు అడిగిన ప్రశ్నలపై బఖాయీ సానుకూలంగా స్పందించారు. మధ్యవర్తుల ప్రయత్నాలు నిజమేనని, తాము కూడా దౌత్య యత్నాలు చేస్తున్నామని చెప్పారు.

ఖతార్ మాజీ ఎమిర్ షేక్ హమద్ బిన్ ఖలీఫా అల్ థానీ మరణించిన సందర్భంగా సంతాపం తెలియజేసేందుకు ఇటీవల ఆ దేశంలో పర్యటించిన సందర్భంగా ఇస్మాయిల్ బఖాయీ ఖతార్ నాయకులతో యుద్ధ ఉద్రిక్తతల తగ్గింపు విషయంపై సంప్రదింపులు జరిపారు. అమెరికా–ఇరాన్ మధ్య పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగకుండా మధ్యవర్తులు తెరవెనుక నిరంతరం కృషి చేస్తున్నారని దీన్నిబట్టి అర్థమవుతోందని బఖాయీ అన్నారు.ఐతే అదే సమయంలో, “అమెరికా నేరాలు అడ్డుకోవడానికి జరిగే ఎలాంటి ప్రయత్నాలనూఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆపదు” అని కూడా చెప్పారు. ఒకవైపు తమ దళాలు అమెరికాదురాక్రమణ చర్యలు అడ్డుకునేంకుకు,ప్రతిఘటించేందుకు కృషి చేస్తుండగా, దౌత్య యంత్రాంగం కూడా తన ప్రయత్నాల్లో నిమగ్నమైందన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాతో తమ దేశం ప్రస్తుతం పూర్తిస్థాయి యుద్ధంలో నిమగ్నమై ఉందని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ప్రకటించారు . మనం వాస్తవికంగా ఉండాలి, ఈ సంఘర్షణల తాలూకూ ప్రతికూల పరిణామాలను అంగీకరించాలి అన్నారు




## విలీనం తథ్యం

(మొదటి పేజీ తరువాయి)

బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళాభవన్‌లో సోమవారం టిజిఎస్ ఆర్‌టిసి ఉద్యోగుల చేయూత ద్వారా సేకరించిన రూ.90,85,500 లక్షల చెక్కును దివంగత శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డితో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి ఒక కుటుంబమని, ఉద్యోగులు ఐక్యతను చాటుతూ శంకర్‌రావు కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమన్నారు.

**ప్రయాణికులే ఆర్‌టిసికి దేవుళ్లు**

మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి నెల ప్రభుత్వం రూ.300 కోట్లకు పైగా ఆర్‌టిసికి అందిస్తోందని, దీంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు సంస్థ ఆర్థికంగా బలోపేతం అవుతోందన్నారు. ఆర్‌టిసి అభివృద్ధి కోసం కొత్త బస్ టెర్మినల్స్, ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం, మెట్రో, ఎంఎంటిఎస్ అనుసంధానం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. శంకర్‌రావు కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని, ఆయన కుమారుడికి ఉద్యోగం కల్పించేందుకు అవసరమైన నిబంధనల సడలింపుపై ప్రభుత్వ అనుమతి తీసుకుని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వై.నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులే ఆర్‌టిసికి దేవుళ్లని, ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మరింత మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయి అధికారులూ ఉద్యోగులతో సానుకూలంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగులు, యూనియన్ సంఘాల నాయకులు హాజరయ్యారు.

**ఆర్‌టిసి విలీనమే శంకర్ గౌడ్ చివరి కోరిక : హేమలత**

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడమే శంకర్‌గౌడ్ చివరి కోరిక అని, విలీనంతోనే ఆయన ఆత్మ శాంతిస్తుందని శంకర్‌గౌడ్ సతీమణి హేమలత అన్నారు. తమ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలిచిన ఆర్‌టిసి ఉద్యోగులందరికీ ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com